


అవగాహన కల్పిస్తున్నాం

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకున్నాం. ఈ వ్యాధి ప్రాణాంతకమైనది కాదు. ఈ వ్యాధికి అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయి. నల్లిపురుగు కుట్టినచోట మచ్చ వస్తుంది. వెంటనే సమీపంలోని వైద్యశాలకు వెళ్లి చికిత్సపొందాలి.

- టి.వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్

నల్లి పేస్తోంది!

జిల్లాలో స్క్రబ్ టైఫస్ కలకలం

స్క్రబ్ టైఫస్ వ్యాధి జిల్లావాసులను ఆందోళనకు గురిచేస్తోంది. నల్లిపురుగు కుట్టడం ద్వారా వ్యాపించే ఈ వ్యాధి రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ పురుగు కుట్టిన నాలుగైదు రోజుల్లో కుట్టినచోట మచ్చరావడంతో పాటు 104 నుంచి 106 డిగ్రీల జ్వరం వచ్చి తగ్గకుండా ఇబ్బంది పెడుతోంది. జిల్లాకు చెందిన 11 మంది ఈ వ్యాధి బారినపడినట్లు సమాచారం. చిత్తూరు, కర్నూలు జిల్లాలకు వివిధ పనుల కోసం వెళ్లి అక్కడ నల్లిపురుగు కుట్టడం ద్వారా వ్యాధి బారిన పడి ఆ ప్రాంతంలోని వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. దీంతో ఆక్కడి వైద్యశాఖ అధికారులు జిల్లాకు సమాచారం అందించారు. సమస్య నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

- ఒంగోలు కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి)

- ఇతర ప్రాంతాల్లో ఉన్న 11 మంది జిల్లావాసులకు ఈ వ్యాధి
- వైద్యశాఖకు సమాచారం ఇచ్చిన ఆ జిల్లాల వైద్యాధికారులు
- నల్లిపురుగు కుట్టడంతో మచ్చలు వచ్చి జ్వరం బారినపడే అవకాశం
- నాలుగైదు రోజుల పాటు 104 నుంచి 106 డిగ్రీల వరకు జ్వరం
- ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్యశాఖ అధికారుల చర్యలు

అలసత్వం ప్రదర్శిస్తే అంతే

స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రాణాంతకమైనది కాకపోయినప్పటికీ సకాలంలో గుర్తించకపోతే తీవ్రమైన జ్వరం బారిన పడి మృత్యువాతపడతారని వైద్యశాఖ చెప్తుంది. నల్లిపురుగు కుట్టిన వెంటనే రెండు రోజుల పాటు సాధారణ మందులు వాడితే యథావిధిగా ఉంటుంది. అయితే ఈ విషయంపై అవగాహన లేని ప్రజానీకం పెద్దగా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. నల్లిపురుగు కుట్టినచోట నల్లగా మచ్చ ఏర్పడుతుంది. తద్వారా

మిగతా 6లో...



నల్లి కుట్టడం వల్ల ఏర్పడిన మచ్చ



డీడీవో కార్యాలయం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు

డీడీవో కార్యాలయంతో పర్యవేక్షణ, అభివృద్ధి

- కలెక్టర్ రాజాబాబు
- ఒంగోలు, కనిగిరి, మార్కాపురంలలో ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : డివిజన్ స్థాయిలో అభివృద్ధి అధికారి ఉండటం వల్ల క్షేత్రస్థాయిలో పరిస్థితులపై పర్యవేక్షణతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అవుతాయని కలెక్టర్ రాజాబాబు అన్నారు. రాష్ట్రంలోని డివిజన్ కేంద్రాల్లో డీడీవో కార్యాలయాలను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్తూరు జిల్లాలో ప్రారంభించగా మిగిలిన ప్రాంతాల్లో వర్చువల్‌గా ప్రారంభించారు. ఒంగోలులోని పాత జిల్లా పరిషత్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని కలెక్టర్ రాజాబాబు ప్రారంభించారు. కనిగిరిలో అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మార్కాపురంలోని కార్యాలయాన్ని అక్కడి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో వినూత్న మార్పులు చేయడం ద్వారా క్షేత్రస్థాయిలో అభివృద్ధిని పరుగులు పెట్టించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఎంపీడీవోలకు పదోన్నతులు ఇచ్చి డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగించిందన్నారు. దీని ద్వారా అనేక సంవత్సరాలుగా నిరీక్షిస్తున్న ఎంపీడీవోలకు పదోన్నతులు లభించడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు.

అన్ని కార్యాలయాలు ఒకచోటనే..

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలోని డివిజన్ స్థాయి కార్యాలయాలన్ని ఒకేచోట ఉండేలా ప్రభుత్వం చర్యలు

మిగతా 6లో...

బోగస్‌కు భరోసా!

రుణాల మంజూరులో వారి పాత్రపై ఆరా

అర్హులకు రుణాలిచ్చేందుకు కొర్రీలు

బోగస్ గ్రూపులతో అనర్హులకు సహకారం

మెప్మా అవినీతిలో బ్యాంకర్ల పాత్రపై అనుమానం

మెప్మాలో బోగస్ గ్రూపులకు రూ.కోట్ల రుణాలు మంజూరు చేసి, అవినీతికి ఆజ్యం పోసిన కొందరు బ్యాంకు అధికారుల తీరుపై విచారణ కమిటీలు దృష్టి సారించాయి. వారి అవినీతి కారణంగానే ప్రస్తుతం అమాయక మహిళలు అప్పుల ఊబిలో ఉన్నారు. దీంతో బోగస్‌లో భారీగా చేతివాటం చూపి కోట్లు దోచుకున్న ఆర్పీలు, సీవోలు, సీఎంఎంలు, బ్యాంకు లింకేజి సిబ్బంది దర్జాగానే ఉండగా, అమాయకులైన పొదుపు గ్రూపు సభ్యులు రూ.లక్షల్లో అప్పుల్లో కూరుకుపోయారు. దీంతో ఒక్కొక్కరుగా బాధితులు బయటకు వస్తుండటంతో అక్రమాల డొంక కదులుతోంది. అయితే ఈ వ్యవహారంలో మెప్మా సిబ్బందితో పాటు కొన్ని బ్యాంకుల సిబ్బంది కీలకంగా వ్యవహరించినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



మెప్మా కార్యాలయంలో సిబ్బందిని విచారిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ (ఫైల్)

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మెప్మాలో సుమారు 200లకుపైగా బోగస్ గ్రూపులు తయారు చేసి, రూ.కోట్లు దండుకోగా, తాజాగా ఈ ఏడాదిన్నరలో మరో 72 బోగస్ గ్రూపులు సృష్టించి రుణాలు పొందినట్లు సమాచారం. అయితే ఆయా బ్యాంకర్ల పాత్ర లేకుండా కోట్ల రుణాలు ఎలా మంజూరు అయ్యాయనేది అందరిలోనూ తలెత్తుతున్న ప్రశ్న. మెప్మాలో చోటుచేసుకున్న బోగస్ గ్రూపుల వ్యవహారంలో బ్యాంకర్లు ఇష్టారీతిన అడిగిన వెంటనే కోట్ల రుణాలు ఎలా ఇచ్చారన్నది సాధారణ ప్రజలకు అర్థం కాని విషయం. దీని వెనుక భారీగా వాటాలు చేతులు మారాయనే ప్రచారం నడుస్తోంది.

బ్యాంకర్ల భరోసా లేకుండా సాధ్యమా?

పొదుపు సంఘానికి

మిగతా 6లో...



చికెన్, కోడిగుడ్ల ధరలు పైపైకి..

- స్కిన్‌లెస్ కిలో రూ.270
- 30 గుడ్లు రూ.225

ఒంగోలు కలెక్టరేట్,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చికెన్, గుడ్ల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వారం రోజులుగా వాటి ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. బుధవారం మార్కెట్‌లో కిలో చికెన్ స్కిన్‌లెస్ రూ.270కి చేరగా స్కిన్ రూ.250కి చేరింది. వారం రోజుల వ్యవధిలో కిలోకు రూ.20నుంచి రూ.30 మేర ధర పెరిగింది. ఇక కోడిగుడ్ల ధరలు కూడా అదే విధంగా ఉన్నాయి. నిన్నా మొన్నటి వరకు బాక్సు (30గుడ్లు) రూ.200కు లభించగా ప్రస్తుతం రూ.225కు చేరింది. ఒక్కొక్క గుడ్డు హోల్‌సేల్‌లోనే రూ.7.25 పడుతుండగా రిటైల్‌గా రూ.8కి విక్రయిస్తున్నారు. సాధారణంగా కార్తీకమాసం అనంతరం చికెన్ ధరలు కొంత మేర పెరుగుతాయి. కార్తీక మాసంలో చికెన్ అమ్మకాలు తగ్గిపోతాయి. మాసం పూర్తవగానే వాటి ధరలు అధికంగా ఉంటాయి. కానీ ఈసారి కార్తీక మాసం ముగిసిన వెంటనే చికెన్, కోడిగుడ్ల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో సామాన్యులు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం చికెన్ పౌల్ట్రీలు ఉమ్మడి జిల్లాలోనే అందుబాటులోకి రాగా కోడిగుడ్లు గుంటూరు జిల్లా నుంచి జిల్లాకు సరఫరా అవుతున్నాయి.



జరుగుమల్లి నాయకులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న మంత్రి స్వామి

మంత్రి స్వామికి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

7

పంచాయతీలకు రూ.3.91కోట్లు మంజూరు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు మూడు రకాల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి, రెండో క్వార్టర్‌కు రూ.3.91 కోట్లు మంజూరు చేసింది. సర్పంచ్‌ల గౌరవ వేతనంతోపాటు సీనరేజ్ గ్రాంటు, ప్రొఫెషనల్ ట్యాక్స్ కింద ఈ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను జిల్లాలోని 729 గ్రామ పంచాయతీలకు జిల్లా పంచాయతీ అధికారులు విడుదల చేశారు. అందుకు సంబంధించిన బిల్లులను ట్రెజరీలకు పంపారు. ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసిన ప్రభుత్వం తాజాగా ఈ నిధులు కూడా విడుదల చేయడంతో పంచాయతీలకు కొంతమేర ఊరట లభించనుంది.



అమ్మంటే అలుసేల!

- తల్లిని సంరక్షించని తనయుడు.. ఆయన భార్య
- 'మీ కోసం'లో ఎస్పీకి గ్రామస్థుల ఫిర్యాదు
- పోలీసుల కౌన్సెలింగ్‌తో సమస్య పరిష్కారం



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ సాంబశివయ్య

పెద్దారవీడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లి ఆలనా... పాలనా చూడాల్సిన తనయుడు పట్టించుకోలేదు. ఆయన భార్య కూడా భర్త బాటలో నడుస్తోంది. దీంతో వృద్ధ తల్లి తీవ్ర కష్టాలు పడుతోంది. ఈ విషయాన్ని గమనించిన ఇరుగుపొరుగు వారు 'మీకోసం'లో జిల్లా పోలీస్ ఉన్నతాధికారికి సమాచారం ఇచ్చారు. స్పందించిన ఎస్పీ ఆమె సంరక్షణకు చర్యలు తీసుకోవాలని

మిగతా 6లో...

నల్లమలలో పులుల గణన

- 8వ తేదీ వరకు కొనసాగనున్న లెక్కింపు
- నాలుగేళ్లకొకసారి ప్రక్రియ

ప్రతి పులీ లెక్కే

త్రిపురాంతకం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నల్లమలలో పులుల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి నాలుగేళ్లకొకసారి జరిగే పులుల గణన కార్యక్రమంలో భాగంగా 2022 తరువాత ఇప్పుడు మళ్లీ ఈనెల 1 నుంచి 8వ తేదీ వరకు లెక్కింపు ప్రక్రియ జరుగుతోంది. మార్కాపురం అటవీ డివిజన్ పరిధిలో మార్కాపురం, ఎర్రగొండపాలెం, గంజివారిపల్లి, విజయపురిసౌత్ రేంజ్‌లు ఉండగా గిద్దలూరు అటవీ శాఖ డివిజన్ పరిధిలో గిద్దలూరు, గుండ్లకమ్మ, తురిమెళ్ల, కనిగిరి ఉన్నాయి. నాగార్జునసాగర్- శ్రీశైలం పులుల అభయారణ్యం మార్కాపురం, గిద్దలూరు అటవీ డివిజన్ పరిధిలో దాదాపు వెయ్యి చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గణన జరిగినప్పుడు వాటిసంఖ్య 48 ఉంది. ఆ తరువాత నల్లమలలో 2022లో జరిగిన పులుల లెక్కింపులో భాగంగా 73 పెద్ద పులులు ఉన్నట్లు

మిగతా 6లో...



పులి పాదముద్రలకు స్కేలుతో కొలత (ఫైల్)



పాదముద్రలు లెక్కిస్తున్న అధికారులు

నల్లమలలో 5 పెద్ద పులులు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నలమలలో పులులు, చిరుత పులి, ఎలుగు బంటి, రేచు కుక్కల లెక్కింపు ప్రక్రియ ఎర్రగొండపాలెం, గంజివారిపల్లి రేంజ్ పరిధిలో ట్రయల్ పాత్ జరుగుతోందని రేంజ్ అధికారిని ఏ.ప్రసన్న జ్యోతి తెలిపారు. రేంజ్ పరిధిలో 3 రోజులు ఈ లెక్కింపు జరిగిందని ఆమె గురువారం తెలిపారు. కొలుకుల, టీఆర్ చెరువు బీట్ పరిధిలో పెద్ద పులులు 5, ఇతర మాంసాహార జంతువులు ఏడింటిని గుర్తించినట్లు రేంజర్ తెలిపారు.

కడచూపునకొచ్చి కానరానిలోకాలకు..

ప్రమాదవశాత్తూ మన్నేరు సుడిగుండంలో పడి వ్యక్తి మృతి



గుంజి వెంకటేశ్వర్లు మృతదేహం

సింగరాయకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బాబాయి మృతిచెందాడనే విషయం తెలుసుకొని ఆయన్ను కడసారి చూడడానికి వచ్చిన వ్యక్తి కానరానిలోకాలకు వెళ్లిన ఘటన గురువారం శానంపూడిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని శానంపూడి గ్రామానికి చెందిన గుంజి వెంకటేశ్వర్లు (45) హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. తన బాబాయి గుంజి ముసలయ్య మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. సమాచారాన్ని అందుకొని వెంకటేశ్వర్లు హైదరాబాద్ నుంచి బుధవారం ఉదయం స్వగ్రామానికి వచ్చాడు. ముసలయ్య మృతదేహాన్ని గ్రామ సమీపంలోని మన్నేరు దాటి అవతలవైపు కుటుంబ సభ్యులతో కలిసి పూడ్చివేశారు. అనంతరం ఏరు దాటుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ సుడిగుండంలో వెంకటేశ్వర్లు చిక్కుకొని కొట్టుకొనిపోయాడు. ఘటనా స్థలంలో ఉన్న బంధువులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. సమాచారం అందుకొన్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే ఆయన పాకల చెల్లమ్మగారిపాలెంకి చెందిన గజఈతగాళ్లను రంగంలోకి దించారు. వారు గాలాలు సాయంతో మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చారు. మృతదేహాన్ని ఎస్సై బి.మహేంద్ర కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. బాబాయి కడచూపుకు వచ్చి కానరానిలోకాలకు వెళ్లడంతో మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


గాయపడిన గిరి

సింగరాయకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ నుంచి కందుకూరు వెళ్తున్న పల్లెవెలుగు ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటన స్థానిక బాలియోగినగర్ కూడలిలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ చాకిచర్లపట్టపుపాలెంకు చెందిన సున్నపు గిరి కందుకూరు నుంచి సింగరాయకొండ వస్తున్న క్రమంలో బాలయోగినగర్ కూడలి వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో బస్సు ముందు టైరుకింద బైక్ పడింది. దీంతో గిరి ఎడమకాలుకి తీవ్రగాయమైంది. క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

లారీ ఢీకొని వృద్ధుడు దుర్మరణం

నాగులుప్పలపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఉప్పుగుండూరులోని రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా చిన్నగంజాం గ్రామానికి చెందిన ఉప్పుగుండూరు వెంకటేశ్వర్లు (65) గతకొంత కాలం నుంచి ఉప్పుగుండూరు గ్రామంలోని సుబ్బయ్య హోటల్ ఎదురుగా జాతీయ రహదారి పక్కనున్న బస్‌షెల్టర్‌లో ఉంటున్నాడు. గురువారం తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న వెంకటేశ్వర్లును లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు కలెక్టరేట్,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు, అమరావతి నుంచి గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు వ్యాధుల బారినపడకుండా పారిశుధ్య పనులను విస్తృతంగా చేపట్టాలన్నారు. సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలని చెప్పారు. వరి ధాన్య సేకరణకు కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు అవసరమైన ఎరువులు కొరత లేకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం పలు అంశాలపై కలెక్టర్లకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, అధికారులు వరలక్ష్మి, హరికృష్ణ, శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంతనూతలపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు డొంక వద్దనున్న మహిళ ప్రాంగణంలో నిరుద్యోగ మహిళలకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ తరగతులు జరగనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజయాదవ్ గురువారం తెలిపారు. 15-45 సంవత్సరాల మధ్యగల నిరుద్యోగమహిళలు ఈ శిక్షణను సద్వినియోగపరుచుకోవాలని, వివరాలకు 9963005209లో సంప్రదించాలని ఆయన కోరారు.

సమాజానికి ఉపయోగపడేలా యువత ఆలోచనలు ఉండాలి

కలెక్టర్ రాజాబాబు


విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నేటి యువత ఆలోచనలు, మేధో సంపత్తి సమాజంలో నెలకొన్న సమస్యలకు పరిష్కార దిశగా ఉండటంతో పాటు మేలు చేకూర్చేలా ఉండాలని కలెక్టర్ పీ రాజాబాబు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో గురువారం ట్రిపుల్‌ఐటి, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన ఐడియా టు ఇంప్లాక్ట్ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ముందుగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నమూనాలను కలెక్టర్ తిలకించడంతో పాటు ప్రాజెక్టు చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ యువత వినూత్న ఆలోచనలు, మేధో సంపత్తిని, ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించేందుకు జిల్లాలో ఐడియా టు ఇంపాక్ట్ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. పలువురు విద్యార్థులు స్వీయ నియంత్రణతో నీటిట్యాంకు నింపే వ్యవస్థ, స్మార్ట్ నీటి భద్రత, వ్యాధి హెచ్చరిక వ్యవస్థ, టచ్‌లెస్ స్మార్ట్ డస్ట్‌బిన్, వాయిస్ నియంత్రిత వీల్ చైర్, రియల్ టైమ్ లొకేషన్, అత్యవసర హెచ్చరికలతో కూడిన కాంపాక్ట్, మహిళా భద్రత పరికరం లాంటి నమూనాలను రూపొందించడం అభినందనీయమన్నారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త అనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకుపోతున్నారని, వారి ఆలోచనలకు అనుగుణంగా యువత కూడా నడుచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డీవీఆర్ మూర్తి, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రవితేజ, విద్యుత్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పశుగణాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పశుగణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేస్తూ పాడి రైతులకు చేయూత అందిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. మండల పరిధిలోని తాళ్లూరు గ్రామంలో గురువారం గోకులం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా కనిగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో 6 కోట్ల 28 లక్షల రూపాయల వ్యయంతో 314 గోకులం షెడ్ల ఏర్పాటుకు రైతులకు సబ్సిడీపై రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు పాడి పరిశ్రమ ద్వారా ఆర్థిక పురోగతి చెందాలనే సంకల్పంతో ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధిహామీ పథకం కార్యాలయంలో పాడి రైతులు తమ పేర్లను నమోదు చేసుకుని రుణాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కొండా కృష్ణారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసలురెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, బాలు ఓబులురెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, నారపరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గోకులం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

సుపరిపాలనకు అధికారులు సహకరించాలి

నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు సత్వర సుపరిపాలనే లక్ష్యంగా తాను చేస్తున్న కృషికి ప్రభుత్వాధికారులు సహకారాన్ని అందించాలని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి కోరారు. ఇటీవల ఉపాధి హామీ పథకం కార్యాలయాన్ని ఆధునికీకరించి డీఎల్‌డీవో కార్యాలయంగా రూపుదిద్దారు. గురువారం ఆయా కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద మంత్రోచ్చరణలతో స్వాగతం పలికారు. డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ జయలక్ష్మీ, ఎంపీడీవో అబ్దుల్ ఖాదర్, జడ్పీటీసీ సభ్యుడు కస్తూరిరెడ్డి, ఎంపీపీ ప్రకాశం పాల్గొన్నారు.

మార్కాపురం అభివృద్ధిని ఎవరూ ఆపలేరు

విమర్శలు చేసేవారికి ప్రజలే బుద్ధిచెబుతారు

ఎమ్మెల్యే నారాయణరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం అభివృద్ధిని ఎవరూ ఆపలేరని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక 27వ వార్డులోని దత్తసాయి గుడి వద్ద గురువారం రాత్రి మార్కాపురం జిల్లాకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం జరిగిన కృతజ్ఞతా సభలో ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ జిల్లా ప్రకటనతో మార్కాపురం స్వరూపం పూర్తిస్థాయిలో మారిపోనుందని అన్నారు. ఇక్కడికి పలు ప్రతిష్ఠాత్మక సంస్థలు రానున్నాయన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా పెరగనున్నాయన్నారు. ఒకప్పుడు మార్కాపురం స్థాయిలోదే ఒంగోలు అన్నారు. కానీ, జిల్లా ఏర్పాటు అయిన తర్వాత ఒంగోలు స్వరూపం మారిపోయిందన్నారు. ఇప్పటికే పలు వైద్యశాలలు, విద్యాసంస్థలు మార్కాపురం వచ్చేందుకు భూములు కూడా కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందడం ఇష్టంలేని ప్రతిపక్ష వైసీపీ నాయకులు అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారన్నారు. వచ్చే సంవత్సరం వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే మార్కాపురం జిల్లా సుభిక్షంగా మారుతుందన్నారు. అభివృద్ధిని చేసేవాళ్లు ఎవరో, అడ్డుకునేది ఎవరో ప్రజలు గమనిస్తున్నారన్నారు. వారే భవిష్యత్తులో ప్రతిపక్షానికి సరైన బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్, కౌన్సిలర్లు కశెట్టి నగేష్, చిన్న షెక్షావలి, టీడీపీ పట్టణ యూత్ అధ్యక్షుడు దొడ్డా దర్గేష్‌రెడ్డి, యలమంద తదితరులు పాల్గొన్నారు.

పవర్ ఆఫ్ అటార్నీ తీసుకొని మోసం

ఒంగోలుకు పిలిచించి పెద్దిరెడ్డి దౌర్జన్యం


మాట్లాడుతున్న మహిళలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం టీడీపీ నాయకుడు పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డి పవర్ ఆఫ్ అటార్నీ తీసుకొని తమను మోసం చేశాడని నెల్లూరుకు చెందిన మహిళలు మంచికలపాటి అనిత, కడప కామేశ్వరిలు ఆరోపించారు. తమను ఒంగోలుకు పిలిచించి దాడి చేశారన్నారు. స్థానిక ఎంసీఏ భవన్‌లో గురువారం వారు మాట్లాడారు. పేర్నమిట్ట సర్వే నెంబరు 148/1లో తమకు హక్కు లేని 1.04 ఎకరాల భూమికి సంబంధించి తమను ప్రలోభపెట్టి సూర్యప్రకాష్‌రెడ్డి పవర్ ఆఫ్ అటార్నీ తీసుకున్నారన్నారు. ఒంగోలు రిజస్ట్రర్ ఆఫీసులో ఈ డాక్యుమెంట్ కింద మరో డాక్యుమెంట్ పెట్టి తమ సంతకాలు తీసుకున్నారని చెప్పారు. తమ ఇద్దరి కుమార్తెలకు చేరో కోటి రూపాయల చొప్పున డబ్బులు ఇస్తానని చెప్పి తమ పెద్ద కుమార్తె పెళ్లికి కూడా డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. 148/1లో తమకు హక్కు లేకపోయినా తాను అధికారపార్టీ నాయకుడినని, అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కు బంధువునని బెదిరించి 2021లో మూడు లక్షల రూపాయలు ఇచ్చి పవర్ ఆఫ్ అటార్నీ తీసుకున్నాడన్నాడని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యుడైన సూర్యప్రకాష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


రైలులో గంజాయి పట్టుకున్న ఈగల్ టీమ్

పూరీ ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి పట్టివేత

6.5 కిలోలు స్వాధీనం

చెన్నైకు చెందిన వ్యక్తి అరెస్టు

ఒంగోలు క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : పూరీ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించి 6.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని చెన్నైకి చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఈగల్ టీమ్ సీఐ సుధాకర్ చెప్పారు. గురువారం ఈగల్ టీమ్, రైల్వే పోలీసులు కలిసి రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. గంజాయి ఉన్న బ్యాగ్‌ను గుర్తించి అందుకు సబంధించి చెన్నైలోని కరూర్ జిల్లాకు చెందిన పి.రమేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణ నిమిత్తం గంజాయితోపాటు నిందితుడు రమేష్‌ను రైల్వే పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. తనిఖీలలో ఎస్సైలు చెంచయ్య, సుదర్శన్, శివరామయ్య పోలీసు సిబ్బంది ఉన్నారు.

చేకూరపాడులో పింఛన్ నగదు కోతపై ఫిర్యాదు


డీపీవోకి ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ రమేష్‌బాబు

నాగులుప్పలపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల నగదులో కోత విధించి ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేకుండా రశీదులు ఇచ్చి ఇంటిపన్నులకు జమచేసిన పంచాయతీ కార్యదర్శి సీహెచ్.పద్మావతిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని చేకూరపాడు సర్పంచ్ కొమ్మినేని రమేష్‌బాబు కోరారు. ఈమేరకు గురువారం స్థానిక ఎంపీడీవో తేళ్ల రవి కుమార్, జిల్లా ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి పన్నులను స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా డిజిటల్ లావాదేవీలు చేయాలని ఆదేశించిందని, కానీ తమ పంచాయతీ కార్యదర్శి అందుకు విరుద్ధంగా ప్రవర్తించారని చెప్పారు. పింఛన్ల పంపిణీ సమయంలో పలువురు లబ్ధిదారులకు నగదు పూర్తిగా అందించకుండా ఇంటిపన్నులకు నగదు జమ చేసుకొంటున్నట్లుగా చెబుతూ ఎలాంటి రశీదులు ఇవ్వలేదన్నారు. గతంలోనూ కార్యదర్శి పద్మావతి తీరుపై మండల సర్వసభ్య సమావేశంలో పన్నుల వసూలులో ప్రశ్నించానని, మరోమారు నిబంధనలు పాటించకుండా ఇంటిపన్నులు వసూలు చేయడం, పాలకవర్గ సమావేశాలు సైతం నిర్వహించకుండా గ్రామాభివృద్ధిని గాలికివదిలేసి తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కార్యదర్శిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కేసుల రాజీకి జాతీయ లోక్ అదాలత్ ఎంతో ఉపయుక్తం


మాట్లాడుతున్న న్యాయాధికారులు కిషోర్‌కుమార్, బాలాజీలు

మార్కాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇరు వర్గాలు పరస్పర అంగీకారంతో కేసులను రాజీ చేసుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ ఎంతో ఉపయుక్తమని మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ న్యాయాధికారి జె.కిషోర్‌కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.బాలాజీలు అన్నారు. స్థానిక కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాతీయ లోక్ అదాలత్‌పై పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు కక్షలు వీడి సామరస్యపూర్వకంగా వారి కేసులను రాజీ చేసుకునేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. పల్లె సీమల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ ఎంతో విలువైన సమయాన్ని వృథా చేసుకున్నవారవుతారన్నారు. అంతేకాక కోర్టులపై కూడా భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అవీఇవీ

'నల్లి'పేస్తోంది!

(5వపేజీ తరువాయి)

నాలుగైదు రోజుల పాటు విపరీతమైన జ్వరం వచ్చి తగ్గకపోవడంతో అప్పుడు వైద్యశాలకు పరుగులు పెడుతున్నారు. పూర్వకాలంలో ఈ పురుగు (గ్రామాల్లోని పెడదిబ్బలు) వద్ద ఉండేది. అయితే ప్రస్తుతం ఆ పురుగు వ్యవసాయ భూముల్లోకి చేరింది. ప్రస్తుతం వివిధ పనుల కోసం వ్యవసాయ పనులకు పొలాల్లోకి వెళ్లిన ప్రజలకు ఈ పురుగు కుట్టినప్పుడు పెద్దగా పట్టించుకోవడం లేదు.

అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ

నాలుగైదు రోజులకు కుట్టిన చోట నల్లమచ్చగా ఏర్పడటంతోపాటు జ్వరం తీవ్రత పెరుగుతుంది. ఈ జ్వరం నాలుగైదు రోజుల పాటు హైటెంపరేచర్ వచ్చి అనారోగ్యం బారినపడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం వైద్యశాఖను అప్రమత్తం చేసింది. ప్రజలు ఈ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ప్రజలకు వైద్యశాఖ ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ పురుగు కుట్టిన వెంటనే సమీపంలోని వైద్యశాలకు వెళ్లి ప్రాథమిక చికిత్స చేసుకోవడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చని వైద్యాధికారులు చెప్తున్నారు.

డీడీవో కార్యాలయంతో పర్యవేక్షణ, అభివృద్ధి

(5వపేజీ తరువాయి)

తీసుకుందన్నారు. అంతకు ముందు రాష్ట్రవ్యాప్తంగా 77 డీడీవో కార్యాలయాలను వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అనంతరం జరిగిన ప్రసంగాన్ని కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజలు వీక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్, జడ్పీ ఇన్‌చార్జి సీఈవో బాలమ్మ, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డీఎల్‌డీవో సువార్త తదితరులు పాల్గొన్నారు. వర్చువల్ సమావేశంలో మార్కాపురం డీడీవో బాలునాయక్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమకు పదోన్నతులు కల్పించడంతోపాటు డీడీవో కార్యాలయాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు.

'బోగస్'కు భరోసా!

(5వపేజీ తరువాయి)

రుణం మంజూరు చేయాలంటే తొలుత సంఘ సభ్యులు సమావేశం నిర్వహించుకోవాలి. ఆ తర్వాత తీర్మానం పుస్తకంలో రాసుకున్న తర్వాత ఆ గ్రూపు బాధ్యతలు చూసే ఆర్పీని సంప్రదించాలి. ఆమె సహకారంతో బ్యాంకు అధికారులతో మాట్లాడాలి. గ్రూపు సీనియార్టీ, అప్పటికే పొదుపు సభ్యులు పొందిన రుణాలు, బాకీలు ఇతరత్రా అంశాలన్నీ బ్యాంకు మేనేజరు పరిశీలన చేయాలి. ఆ తర్వాత పొదుపు సభ్యులందరిని బ్యాంకు అధికారులు పిలిపించి, వారిని చూసిన తర్వాత మాత్రమే సభ్యుల వ్యక్తిగత ఖాతాలో రుణం సొమ్ము జమ చేస్తారు.ఇవేమీ జరగకుండా రూ.కోట్లు దోచుకోవడం వెనుక జరుగుతున్న గూడుపుఠాణీపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేకించి గ్రూపు సభ్యులు లేకుండా కేవలం ఆర్పీ మాటతోనే ఒక గ్రూపునకు రూ.20లక్షలు రుణాలు బ్యాంకర్లు ఎలా మంజూరు చేస్తారు? అనేది ప్రశ్న.

ఆ బ్యాంకుల్లోనే అత్యధికంగా బోగస్ రుణాలు

ఒంగోలు నగరంలో సుమారు పది జాతీయ బ్యాంకులు ఉండగా, మరో పది వరకు ప్రైవేటు బ్యాంకులు ఉన్నాయి. వాటికి అనుసంధానంగా సుమారు 40 బ్రాంచ్‌ల వరకు ప్రజలకు సేవలందిస్తున్నాయి. కొన్ని బ్రాంచ్‌లోనే ఈ తరహా బోగస్ రుణాలు మంజూరైనట్లు సమాచారం. కర్నూలు రోడ్‌లోని ఓ పేరున్న బ్యాంకు మెయిన్ బ్రాంచ్‌లో ఈసారి ఎక్కువగా రుణాలు మంజూరైనట్లు తెలుస్తోంది. మంగమూరురోడ్‌లోని మరో బ్యాంక్ బ్రాంచ్, దేవుడుచెరువు రోడ్‌లోని మరో బ్యాంక్ బ్రాంచ్, లాయరుపేటలోని మరో బ్యాంకుతోపాటు, ఓ కోఆపరేటివ్ బ్యాంకుకు సంబంధించిన టౌన్ బ్రాంచ్‌లో, వాటితోపాటు పలు పేరున్న ప్రైవేటు బ్యాంకుల్లోనూ ఈ తరహా రుణాలకు సంబంధించి ఆర్థిక లావాదేవీలు అవినీతి జరిగినట్లు తెలుస్తోంది.

రుణాల జాబితా ఇవ్వడానికి వెనకడుగు

బోగస్ గ్రూపులకు సహకారం అందించిన కొన్ని బ్యాంకుల అధికారులు వాటి వివరాలు అందించడానికి వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే అవినీతిపై రెండు కమిటీలు విచారణ చేస్తుండగా, మరోవైపు ఇంటెలిజెన్స్ అధికారులు దృష్టి సారించారు. ఎవరికి వారే బ్యాంకర్ల పాత్రపైనా అనుమానం వ్యక్తం చేస్తూ 2022 నుంచి మంజూరుచేసిన రుణాల జాబితా ఇవ్వాలని కోరారు. కొన్ని బ్యాంకులు అధికారులు వివరాలు అందిస్తుండగా, అత్యధికంగా బోగస్‌కు సహకరించిన బ్యాంకర్లు మాత్రం తాము ఇవ్వలేమని, డీజీఎం, జీఎంలకు లేఖలు పెట్టుకోండంటూ సమాధానమిస్తూ దాటవేసే ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో రుణాలు మంజూరుచేసిన సమయంలో ఉన్న కొందరు బ్యాంకర్లు ప్రస్తుతం బదిలీ కావడంతో ఆ రికార్డులు తమ వద్దలేవని తేల్చి చెబుతున్నారు. మొత్తంగాఅవినీతిపైనా బ్యాంకర్ల పాత్రపైనా విచారణ చేస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ప్రతి పులీ లెక్కే!

(5వపేజీ తరువాయి)

గుర్తించారు. వీటిలో ఎక్కువగా నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోనే అధికంగా ఉన్నట్లు అధికారులు గతంలో వెల్లడించారు. మొత్తం 73 పెద్దపులుల్లో ఇక్కడ 64 పులులు ఉండగా శేషాచలం అటవీ ప్రాంతంలో 9, పాపికొండలు 2 ఉన్నట్లు ప్రకటించారు. పులుల సంఖ్య ప్రస్తుతం పెరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. గత జూలైలో అంతర్జాతీయ పులుల దినోత్సవం రోజున వీటి సంఖ్య 85కు చేరినట్లు ప్రకటించారు. అయితే ప్రస్తుతం నాలుగేళ్ల తరువాత ఈనెల 1 నుంచి లెక్కింపు చేపట్టారు. అటవీ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు ఇతర సిబ్బందిని కలిపి బృందాలుగా ఆయా రేంజ్ పరిధిలో ఈ కార్యక్రమం కొనసాగుతూ 8వ తేదీన ముగుస్తుంది. ఈసారి పూర్తిస్థాయిలో సాంకేతికతను వినియోగించి లెక్కింపు చేపట్టి గుర్తించిన వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేయనున్నారు. అయితే ఈ గణనలో పులుల లెక్కింపుతోపాటు ఇతర వన్యప్రాణుల లెక్కింపు కూడా చేపట్టారు. లెక్కింపులో పాల్గొనే సిబ్బంది అడవిలో తిరుగుతూ పులుల పాదముద్రలను సేకరిస్తారు. అవి సంచరించే ప్రాంతాలను గుర్తించి అక్కడ సేకరించిన గుర్తుల వివరాలను బయోల్యాబ్‌లో విశ్లేషించి జాతీయ పులుల సంరక్షణ కేంద్రానికి పంపుతారు. తరువాత పూర్తయిన గణన వివరాలను అటవీశాఖ వెల్లడిస్తోంది.

అమ్మంటే అలుసేల...!

(5వపేజీ తరువాయి)

పెద్దారవీడు పోలీసులను ఆదేశించారు. ఇదంతా పెద్దారవీడు మండలం నల్లమల అటవీ ప్రాంత గ్రామమైన గుండంచర్లలో చోటు చేసుకుంది.

పెద్దారవీడు మండలం గుండంచర్లలో దూదేకుల పెద్ద పీరమ్మ (80) జీవిస్తోంది. ఆమె భర్త కాశయ్య మరణించారు. వృద్ధాప్యం కారణంగా ఆమె మంచానికే పరిమితమైంది. సంరక్షణ బాధ్యతలను చూసుకోవాల్సిన కోడలు బీజమ్మ పట్టించుకోకపోగా తరచూ దురుసుగా ప్రవర్తిస్తోంది. కుమారుడు ఖాసిం పీరా కూడా భార్య పద్ధతిలోనే వ్యవహరిస్తున్నాడు. ఎంతోకాలంగా పెద్ద పీరమ్మ కష్టాలను చూస్తున్న ఇరుగు పొరుగువారు ఏకమైయ్యారు. ఎలాగైనా పెద్ద పీరమ్మ కష్టాలను తొలగించాలనుకున్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో జరిగే మీకోసం కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు విషయాన్ని తెలిపారు. స్పందించిన ఎస్పీ సమస్యను పరిష్కరించాలని పెద్దారవీడు పోలీసులను ఆదేశించారు. వెంటనే గుండంచర్ల వెళ్లిన ఎస్సై సాంబశివయ్య పెద్ద పీరమ్మ పరిస్థితిని పరిశీలించారు. ఇరుగుపొరుగు వారితో ఆమె పరిస్థితిపైనా, కొడుకు, కోడళ్ల వ్యవహార శైలిపైనా విచారించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వృద్ధులను సంరక్షించడం కుటుంబసభ్యుల బాధ్యత అని హెచ్చరించారు. సీనియర్ సిటిజన్ రక్షణ చట్టాల మేరకు చర్యలు తీసుకుంటామని వారికి తెలిపారు. అనంతరం కొడుకు ఖాసింపీరా, కోడలు బీజమ్మ.. పెద్ద పీరమ్మను జాగ్రత్తగా చూసుకుంటామని హామీ ఇచ్చారు. స్పందించిన పోలీసులను గ్రామస్థులు అభినందిస్తున్నారు

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో గురుశంకర్

పెద్దారవీడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని మొదటి రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కె.గురుశంకర్‌కు స్థానం లభించింది. స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ విడుదల చేసిన సంయుక్త గ్లోబల్ ర్యాంకింగ్‌లో కిట్స్‌లో హ్యూమనిటీస్ అండ్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గురుశంకర్ ప్రపంచంలోని టాప్ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో స్థానం దక్కించుకున్నారు. రసాయన శాస్త్రంలో ఇనార్గానిక్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ రంగాల్లో గురుశంకర్ చేసిన పరిశోధనల ప్రభావం, హెచ్ ఇండెక్స్ , ఉపరంగ ర్యాంకులు వంటి అంతర్జాతీయ మెట్రిక్స్ ఆధారంగా ఈ గుర్తింపు లభించింది. డాక్టర్ గురుశంకర్‌ను కళాశాల కార్యదర్శి అన్నా కృష్ణచైతన్య, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

వడ్డీ వ్యాపారుల ఆగడాలు

ఒంటరి మహిళను స్తంభానికి కట్టేసి కొట్టిన వైనం?

నెల వారీ వడ్డీ చెల్లించలేదని ఆరోపణ

ఒంగోలు క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : లేడీ డాన్‌ల ప్రాపకం పెరిగిపోతోంది. సాటి మహిళ అన్నా ఆలోచన కూడా విస్మరించి ఆమెను ఓ స్తంభానికి కట్టేసి చితకబాది ఖాళీ ప్రామిసరీ నోట్ మీద సంతకం చేయిచుకున్నారు. అంతే కాదు బాధితురాలు చెవులకు ఉన్న కమ్మలను కూడా లాగేసుకున్నారు. ఈ సంఘటన నెహ్రూనగర్ 3వ లైన్‌లో బుధవారం చోటుచేసుకుంది. అమ్మనబ్రోలుకు చెందిన దార్ల మాధురికి 10 ఏళ్ల క్రితం భర్త మృతి చెందాడు. ముగ్గురు బిడ్డలతో ఒంగోలు వచ్చి అద్దె ఇంట్లో ఉంటూ పాచిపనులు చేసుకుంటూ బిడ్డలను చదివిస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మాధురి అదే ప్రాంతంలో నివాసం ఉండే సురేఖ వద్ద 5 నెలల క్రితం రూ.20 వేలు వడ్డీకి తీసుకుంది. నెలకు రెండు వేలు వడ్డీ చెల్లించే విధంగా షరతు విధించింది. అంటే నెలకు 100కి 10 రూపాయలు వడ్డీ చెల్లించాలి. ఇప్పటికి మూడు నెలలు వడ్డీ చెల్లించింది. రెండు నెలలుగా వడ్డీ చెల్లించలేదు. బుధవారం రాత్రి సురేఖ, ఆమె అక్క శాంతిలు వచ్చి మాధురితో గొడవపడి ఆమె చెవులకు ఉన్న కమ్మలను లాక్కొన్నారు. అనంతరం దాడిచేశారు. ఆమెను ఇంట్లో నుంచి కొంత దూరం జుట్టు పట్టుకొని లాక్కొచ్చి స్తంభానికి కట్టేసి ఖాళీ ప్రామిసరీ నోటుపై సంతకం పెట్టించుకున్నారు. సమీపంలో వారు వచ్చి ప్రశ్నించడంతో అక్కడ నుంచి వారు వెళ్లిపోయారు. దీంతో బాధితురాలు ఒంగోలు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లభ్యంకాని బీటెక్ విద్యార్థి ఆచూకీ

గాలింపు చర్యల్లో ఎస్డీఆర్ఎఫ్ బృందం



సాగర్ కాలువలో గాలిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం

త్రిపురాంతకం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బుధవారం సాగర్ కాలువలో జారిపడి గల్లంతైన రాజుపాలేనికి చెందిన పెద్దపూడి సురేంద్రరెడ్డి ఆచూకీ గురువారం సాయంత్రానికి కూడా లభించలేదు. వడ్లమూడి విజ్ఞాన్ కళాశాలలో బీటెక్ చదువుతున్న సురేందర్‌రెడ్డి కాలువలో గల్లంతు కావటంతో గ్రామంలో విషాదం నెలకొంది. యువకుని ఆచూకీ కోసం తొలిరోజు పోలీసుల ఆధ్వర్యంలో ఈతగాళ్లు, స్థానికులు గాలించారు. సాయంత్రం వరకు గాలించినప్పటికీ ఫలితం లభించలేదు. కలెక్టర్‌కు ఎస్డీఆర్ఎఫ్ బృందం కోసం పోలీసులు కోరటంతో గురువారం ఉదయానికి వచ్చిన బృందం సభ్యులు కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.

ఓపెన్ స్కూల్స్‌లో తత్కాల్ అడ్మిషన్లకు అవకాశం

ఒంగోలు విద్య, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీలో పదోతరగతి, ఇంటర్మీడియెట్ తరగతుల్లో 2025-26 సంవత్సరానికి అడ్మిషన్ల గడువు ముగిసినందున తత్కాల్ పథకం కింద మళ్లీ అవకాశం ఇచ్చారు. ఈ మేరకు ఓపెన్ స్కూలు సొసైటీ డైరెక్టర్ నరసింహారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పథకం కింద రెగ్యూలర్ అడ్మిషన్ ఫీజుకు అదనంగా రూ.600 చెల్లించి ఈనెల 6వ తేదీ వరకు అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. ఈనెల 8లోపు దరఖాస్తులను పరిశీలించి ధ్రువీకరించాలి. ఈనెల 10వ తేదీ వరకు అడ్మిషన్ ఫీజు చెల్లింపునకు అవకాశం ఇచ్చారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ కోరారు.

పాఠశాలల రికార్డుల సవరణకు అవకాశం

ఒంగోలు విద్య, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల రికార్డుల్లోని తప్పులను సరిచేసుకునేందుకు పాఠశాల విద్యాశాఖ అవకాశం ఇచ్చింది. విద్యార్థుల అపార్ ఐడీని జనరేట్ చేసేందుకు ఆధార్ అనుసంధానం, విద్యార్థుల వివరాలు సవరించుకోవచ్చు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ యాజమాన్యాల్లోని పాఠశాలలు, ప్రాథమిక, యూపీ స్కూళ్లలో ఎంఈవోలు, హైస్కూళ్లలో సంబంధిత పాఠశాలల గజిటెడ్ హెడ్మాస్టర్లు, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో అయితే ఎలిమెంటరీ స్కూళ్లకు, యూపీ స్కూళ్లకు ఎంఈవో, హైస్కూళ్లకు సంబంధిత ఉప విద్యాధికారులు మాత్రమే పాఠశాలలల్లో రికార్డుల్లోని వివరాలను సరిచేసే అధికారాన్ని ఇచ్చారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



డీడీవో కార్యాలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందుల, డీడీవో బాలునాయక్

మార్కాపురం రూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాయవరం గ్రామ పరిధిలోని జాతీయ రహదారి పక్కన సీఎల్ఆర్సీ భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వర్చువల్‌గా గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, జనసేన ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, అధికారులు, నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో గ్రామాలలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తోందని తెలిపారు.

ఉప ముఖ్యమంత్రికి డీడీవో ధన్యవాదాలు

డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయ ప్రారంభోత్సవం వర్చువల్‌గా చేసిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మార్కాపురం డీడీవో బాలునాయక్ ధన్యవాదాలు తెలిపారు. వర్చువల్‌లో ఉప ముఖ్యమంత్రి మార్కాపురం డీడీవో బాలునాయక్ స్పందించాలని కోరగా వెంటనే లైవ్ వీడియోలో ఆయన స్థానిక కార్యాలయ వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ శివరామిరెడ్డి, తహసీల్దార్ చిరంజీవి, ఎంపీడీవో బాలచెన్నయ్య, వెలుగు మార్కాపురం, తర్లుపాడు ఏపీఎంలు పిచ్చయ్య, రమేష్ బాబు, డివిజన్ పరిధిలోని ఎంపీడీవోలు పాల్గొన్నారు.

దొంగలు తెగబడ్డారు..!

మూడేళ్లుగా పోలీసులకు దొరక్కుండా చోరీలు

ఒంగోలు నగరంలో చెలరేగుతున్న చైన్‌స్నాచర్స్


కల్యాణ మండపాలే లక్ష్యంగా

మధ్యప్రదేశ్ ముఠా దొంగతనాలు?

బంగారు ఆభరణాలతోపాటు నగదు అపహరణ

హడలిపోతున్న ప్రజలు

ఒంగోలు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దొంగలు తెగబడ్డారు.. అడుగడుగునా ప్రజలను కొల్లగొడుతున్నారు. ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస చోరీలతో ఆందోళన చెందుతున్నారు. పెళ్లి పందిళ్లల్లో.. పెళ్లిళ్లల్లో.. నడిచి వెళుతున్న మహిళల మెడల్లో.. ప్రయాణికుల వద్ద బ్యాగ్‌లను కత్తిరించి నగదు, బంగారు ఆభరణాలు దోచుకోవడంతో పాటు ఇంటి దొంగతనాలతో బెంబేలెత్తిస్తున్నారు.



గత పది రోజులలో జిల్లాలో నమోదైన కేసులు పరిశీలిస్తే దొంగతనాలు పెరిగాయి అని చెప్పవచ్చు. అదే క్రమంలో మూడేళ్లుగా పోలీసులకు దొరకకుండా దొంగల ముఠాలు చోరీలకు పాల్పడటం ఆందోళన కలిగించే అంశం. కల్యాణ మండపాలలో చోరీలకు పాల్పడుతున్న మధ్యప్రదేశ్ గ్యాంగ్‌గా నిర్ధారణకు వచ్చిన పోలీసులు నిజం తెలుసుకున్నాక విస్తుపోక తప్పలేదు.

● ఆ ముఠా పనేనా...!

రెండేళ్ల క్రితం ఒంగోలులోని ఓ కల్యాణ మండపంలో చోరీకి పాల్పడిన ముఠానే తిరిగి గత నెల 27న బృందావన్‌గార్డెన్స్‌లో జరిగిన పెళ్లిలో చోరీ చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. అంతే కాదు 2022లో పేర్నమిట్టలో జనసేన నాయకుడు కందుకూరి బాబు ఇంట్లో చోరీ జరిగింది. అదే తరహాలో గత నెల 27న చీమకుర్తి మండలం కూనంనేనివారిపాలెంలో జడ్‌పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు ఇంట్లో చోరీ జరిగింది. ఆ రెండు చోరీలు ఒకరే చేసినట్లు పోలీసులకు కీలకమైన ఆధారాలు దొరికాయి. మూడేళ్ల నుంచి పోలీసులు దొంగలను అరెస్టు చేయకపోవడం వల్లే మళ్లీ వారు విజృంభిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఒంగోలులో రెచ్చిపోతున్న చైన్‌స్నాచర్స్



ఒంగోలు నగరంలో చైన్‌స్నాచర్స్ రెచ్చిపోతున్నారు. ఒంటరి మహిళలే లక్ష్యంగా రోడ్డు మీద నడిచిపోతుంటే వారి మెడల్లో ఉన్న బంగారు గొలుసులను లాక్కెళ్తున్నారు. గత సోమవారం రాత్రి వరుసగా సాయిబాబు గుడి దగ్గర, అయ్యప్పస్వామి గుడి వద్ద ఇరువురు మహిళ మెడలలో బంగారు గొలుసులు లాకెళ్లారు. ఈ నెల 16న రాజీవ్‌నగర్ ఎక్స్‌టెన్సన్‌లో ఓ వృద్ధురాలు వాకింగ్‌కు వెళ్లి వస్తుంటే ఆమె మెడలో బంగారు గొలుసును తెంపుకెళ్లారు. ఈ మూడుచోట్ల దొంగతనాలకు పాల్పడింది ఒకే ముఠా అనీ పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనల్లో సీసీ ఫుటేజీ ఆధారాలు కూడా దొరికినట్లు సమాచారం. ఇరువురు చైన్ స్నాచర్లు 15 రోజుల క్రితం భాగ్యనగర్‌లో రెండు మోటార్ సైకిళ్లు ఎత్తుకెళ్లడం గమనార్హం. వీటిల్లో ఓ మోటార్ సైకిల్‌ను సమతానగర్‌లో వదిలేసి వెళ్లారు. అంటే కొంతకాలం నుంచి ఒంగోలులో మకాం వేసి చోరీలకు పాల్పడుతునట్లు అర్థమవుతోంది.

కల్యాణ మండపాల్లో చోరీల పని మధ్యప్రదేశ్ గ్యాంగ్?

పెళ్లి జరుగుతున్న సమయంలో కల్యాణ మండపాలలో చోరీలకు పాల్పడి భారీగా బంగారం దోచుకెళ్లే ముఠాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రెండేళ్ల క్రితం పాత బైపాస్‌లోని ఓ కల్యాణ మండపంలో వివాహం జరుగుతుండగా చోరీ జరిగింది. అదే తరహాలో ఇటీవల బృందావన్ గార్డెన్స్‌లో బంగారం ఉన్న బ్యాగ్‌ను అపహరించుకెళ్లారు. రెండు ప్రాంతాలలో చోరీకి పాల్పడింది ఒకే గ్యాంగ్‌గా పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో అంచనాకు వచ్చారు. వారు మధ్యప్రదేశ్ గ్యాంగ్‌గా భావిస్తున్నారు.

గత పదిరోజులలో దొంగతనాలు

- గత నెల 21న పొదిలిలో విశ్వనాథపురంలో నివాసం ఉంటున్న వృద్ధురాలు కాకుమాను ఈశ్వరమ్మ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి జొరబడి ఆమె మెడలో బంగారు గొలుసును అపహరించుకెళ్లాడు.
- గత నెల 27 రాత్రి చీమకుర్తి మండలం కూనంనేనివారిపాలెంలో జడ్‌పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు ఇంటి తాళం పగులకొట్టి లోపలకు జొరబడి సుమారు రూ.4లక్షలతోపాటు 7 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు.
- గత నెల 27 రాత్రి ఒంగోలులోని బృందావన్ గార్డెన్స్‌లో వివాహం జరుగుతుండగా కల్యాణ మండపంలో పెట్టిన బ్యాగ్‌ను అపహరించుకెళ్లారు. అందులో సుమారు 160 గ్రాముల బంగారు ఆభరణాలతోపాటు రూ.1.50 లక్షల నగదు ఉంది.
- ఈనెల 1వ తేదీ మధ్యాహ్నం మద్దిపాడులో మల్లిపెద్ది ధనలక్ష్మి ఆమె సోదరి సుకన్యలు సొంతూరైన తెల్లబాడు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. వీరితోపాటు మరో ఇద్దరు మహిళలు కూడా ఎక్కారు. ధనలక్ష్మి హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న 14 సవర్లు బంగారు ఆభరణాలను అపహరించారు.
- ఈ నెల 1 రాత్రి 8.30 గంటల సమయంలో నగరంలోని లాయర్‌పేట సాయిబాబ గుడి పక్క రోడ్డులో నివాసం ఉంటున్న మందాడి కోటేశ్వరమ్మ మెడలో గొలుసును దొంగలు లాక్కెళ్లారు. ఆ గొలుసు రోల్డ్ గోల్డు కావడంతో ఆమె ఊపిరిపీల్చుకుంది. వెనువెంటనే అయప్ప స్వామి గుడి వద్ద ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న కొల్లపర శారద మెడలో మూడు సవర్ల బంగారు గొలుసును అపహరించుకెళ్లారు.

రౌడీ షీటర్స్‌పై పీడీ చట్టం

నిరతరం నిఘా ఉంచాలి

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే

అధికారులపై చర్యలు

ఎస్పీ హర్షవర్ధనరాజు



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

ఒంగోలు క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : రౌడీల కదలికలపై నిఘా ఉంచాలని, అవసరమైన వారిపై పీడీ చట్టం అమలు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని ఎస్పీ హర్షవర్ధనరాజు చెప్పారు. గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేర సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో రౌడీషీట్లు ఉన్న వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదేపదే నేరాలకు పాల్పడుతూ, గంజాయి కేసులు ఉన్న వారిపైనా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపైనా కఠినంగా వ్యవహరించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ చెప్పారు. ప్రజలు రహదారి భద్రత నియమాలు పాటించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. గంజాయి సేవించే వారు, విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రాత్రుళ్ల గస్తీ బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఆర్. శ్రీనివాసరావు, యు.నాగరాజు, లక్ష్మీనారాయణ, సాయిఈశ్వర్‌యశ్వంత్, రమణకుమార్, సీఐలు దేవప్రభాకర్, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి స్వామికి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ



గజమాలతో మంత్రి స్వామిని, సీనియర్ నాయకుడు పూర్ణచంద్రరావును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు



మంత్రి స్వామికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నియోజకవర్గ నాయకులు

● పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జిల్లా అధికారులు

● రాత్రి కూడా వెల్లువెత్తిన శుభాకాంక్షలు

కొండపి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జిల్లా అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కొండపి నియోజకవర్గ టీడీపీ నాయకులు గొర్రెపాటి రామయ్య చౌదరి, కొండ్రగుంట శ్రీనివాసరావు, తాని కొండ వెంకటేశ్వర్లు, ఏలూరి రాంబాబు, బోయళ్ల శ్రీనివాసరావు, ఎ. రాధాకృష్ణ, రామా గోపిలత పాల్గొని మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కొండపి మండల నాయకులు తూర్పునాయుడుపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లి మంత్రి స్వామితోపాటు టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావును గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నేతలు మానికొండ వెంకటేశ్వర్లు, బొక్కిసం శేషయ్య, నువ్వుల శ్రీనివాసరావు, నేతి కోటేశ్వరరావు, మన్నెం రాంబాబు, గోనుగుంట పున్నయ్య చౌదరి, మన్నెం శ్రీనివాసరావు, వెంకయ్య, చాగంరెడ్డి నరసారెడ్డి, పోకూరి రవీంద్రబాబు, పోటు శ్రీనివాసమురళి, పద్మావతి, ఏలూరి రాంబాబు, గాలి సందీప్, వట్టిగుంట శివాజీ, నల్లమోతు వెంకటేశ్వర్లు, నాయకులు నరాల సోమయ్య, జీవీ, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కొండపి మండలంలోని పెదకండ్లగుంట గ్రామంలో తెలుగు యువత నాయకుడు మేడిద గంగయ్య ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే కె. బిట్రగుంటలోని కేజీబీవీ స్కూల్ విద్యార్థులకు సీఐ హజరత్తయ్య దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని గ్రామ టీడీపీ నాయకుడు వట్టిగుంట శివాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పలువురు ప్రముఖుల శుభాకాంక్షలు...

పీడీసీసీ బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య మంత్రికి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి స్వామికి ఓఎన్‌డీ కామేశ్వరరావు బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీలు రాయపాటి శ్రీనివాసరావు, సాయిఈశ్వర్ యశ్వంత్, సీఐలు జి. సోమశేఖర్, హజరత్తయ్య ఆరుమండలాల ఎస్సైలు స్వామిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ వేణుగోపాల్ రావు, ఏఈలు కిషోర్‌బాబు, పి. రమేష్ బాబు, సిహెచ్. వెంకటేశ్వరరావు, ఎన్. మహేంద్ర రెడ్డి, యు. జయపాల్, ఎం. జాన్‌పాల్‌రాజ్, పంచాయతీరాజ్ డీఈఈ రవిబాబు, ఏఈలు బి. ప్రసాదరావు, కోటేశ్వరరావు, శేషగిరి, పీఆర్ (పీఐయూ) డీఈఈ టి. రమణయ్య, ఇరిగేషన్ ఏఈఈ ఎం. జె. రవికుమార్ జిల్లా అధికారులు పలువురు స్వామికి శుభాకాంక్షలు తెలిపారు.

కొండపిలో నాయకులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు కొర్రపాటి వసంతరావు, కొండపి సర్పంచ్ కొమ్ము సుశీల కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, దామా మురళీధర్, గుండపనేని రామ్మూర్తినాయుడు, బూదవాటి సోమయ్య, రాయని నాగేశ్వరరావు, నేతి కోటేశ్వరరావు, తుళ్లూరి బాలచెన్నయ్య, రాయపాటి వెంకటరావు, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, ఆరికట్ల వెంకటరావు, కందిమళ్ల లక్ష్మీనారాయణ, వేముల మల్లికార్జున, టీడీపీ మండల కార్యదర్శి యనమద్ది వెంకటేశ్వర్లు, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో స్వామి కుటుంబ సభ్యులు

మంత్రి స్వామి తన పుట్టిన రోజు సందర్భంగా ఆనవాయితీగా ఈ ఏడాది కూడా తిరుపతిలో వేంకటేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.

మర్రిపూడినే వరిస్తున్న పృథులగిరి చైర్మన్ పీఠం

40ఏళ్లుగా పృథులగిరీశుని సేవలో తరిస్తున్న మర్రిపూడి వాసులు



మర్రిపూడి, డిసెంబరు 4 : (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనరసింహ స్వామి సేవలో గత 40 ఏళ్లుగా మర్రిపూడి వాసులు తరిస్తున్నారు. కులమతాలకు అతీతంగా స్థానికులు స్వామివారి పేరు కుటుంబ సభ్యులకు పెట్టుకోవడం ఆనవాయితీ. 1985లో ఈ దేవాలయాన్ని దేవాలయ శాఖ పరిధిలో చేర్చారు. అప్పటి నుంచి దేవాలయ పాలకవర్గం సారధ్య బాధ్యతలు మర్రిపూడి ప్రజలకే దక్కడం గొప్ప వరంగా భావిస్తుంటారు. తొలి చైర్మన్‌గా కుప్పం కొల్లయ్య సుదీర్ఘకాలంపాటు పనిచేశారు. 1994లో టీడీపీ అధికారంలోకి రాగానే చలువాది వెంకటేశ్వర్లను చైర్మన్‌గా అప్పటి శాసనసభ్యులు దామచర్ల ఆంజనేయులు ఎంపిక చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత అంబటి జయరామిరెడ్డి, చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డిలు చైర్మన్‌లుగా వ్యవహరించారు. ఆ తరువాత మర్రిపూడికి చెందిన అలవల చెంచుసుబ్బారావు మరోమారు చైర్మన్‌గా ఎంపికయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మర్రిపూడికి చెందిన కుప్పం కొల్లారావు రెండు పర్యాయాలు చైర్మన్‌గా కొనసాగారు. గత 40 ఏళ్లలో ఆరుగురు చైర్మన్లను నియమించగా నలుగురు ఆర్యవైశ్యులు కావడం విశేషం. ప్రజాప్రభుత్వం ఏర్పాటు తరువాత మర్రిపూడికి చెందిన పలువురు కీలక నేతలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వం త్వరలో దేవాలయ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయనుండటంతో ఆశావహుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. మొత్తం మీద లక్ష్మీనరసింహుని సేవలో 40 ఏళ్ల నుంచి గ్రామస్థులు తరిస్తుండటం గమనార్హం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

నేడు జిల్లాలో మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్

ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ

కొణిజేడు పాఠశాలలో పాల్గొననున్న మంత్రి స్వామి, కలెక్టర్

ఇతర నియోజకవర్గాల్లో పాల్గొననున్న ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు, అధికారులు

సమావేశానికి రూ.53.79 లక్షల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మూడోవిడత మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశం నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. పక్షం రోజుల నుంచి అందుకు సంబంధించి చర్యలు చేపట్టింది. జిల్లాలోని 2,409 ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి షెడ్యూల్ ప్రకారం మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తిచేశారు. రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఈ సమావేశాలను నిర్వహించనున్నారు. ఇప్పటికే సమావేశాల షెడ్యూల్‌ను పంపారు. ఆ ప్రకారం కార్యక్రమాలను నిర్వహించేందుకు కలెక్టర్ రాజాబాబు చర్యలు తీసుకున్నారు. మరోవైపు జిల్లా అధికార యంత్రాంగం కూడా ఈ సమావేశాల్లో పాల్గొననుంది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కలెక్టర్ రాజాబాబు టంగుటూరు మండలం కొణిజేడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే సమావేశంలో పాల్గొననున్నారు. ఇతర నియోజకవర్గాల్లో శాసనసభ్యులతో పాటు ముఖ్యనేతలు, జిల్లాతో పాటు మండల స్థాయి అధికారులు ఆయా పాఠశాలల్లో జరిగే సమావేశాల్లో పాల్గొన్నారు. ఉదయం 9గంటలకు సమావేశాలను ప్రారంభించి మధ్యాహ్నం 12.45 గంటలకు ముగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్‌కు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సమావేశాల నిర్వహణకు ప్రభుత్వం రూ.53.79 లక్షలను విడుదల చేసింది. వీటి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్‌ను నిర్వహించారు. మరో వైపు ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో కూడా ఈ సమావేశాల నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకున్నారు.



ఒంగోలులో స్కూలును ముస్తాబు చేస్తున్న విద్యార్థులు

పీవీఆర్ స్కూలు శతాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్, డిప్యూటీ మేయర్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ హైస్కూలు శతాబ్ది ఉత్సావాలు త్వరలో జరుగుతున్న నేపథ్యంలో అందుకు అవసరమైన ఏర్పాట్లు, స్కూలు మరమ్మతులు, ఇతర సౌకర్యాలను కమిషనర్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి ఆధ్వర్యంలో గురువారం పీవీఆర్ బాలికల హైస్కూలు, బాలుర హైస్కూలలో వారు పర్యటించారు. వందేళ్ళ చరిత్ర కలిగిన పీవీఆర్ హైస్కూలు వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు నిర్వహణ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు. దేశ, విదేశాలలో ఉన్న పీవీఆర్ పూర్వ విద్యార్థులు హాజరవుతున్నట్లు నిర్వహణ కమిటీ వారు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బేతంశెట్టి హరిబాబు, బి.సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలి

● డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

సంతనూతలపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి మండలపరిషత్, వెలుగు, సచివాలయం, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. గురువారం చిత్తూరు జిల్లా నుంచి ఆయన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సిబ్బంది వీక్షించారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలంగా ఉంటే గ్రామాల్లో ప్రజలకు అన్ని సదుపాయాలు సక్రమంగా అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవోలు సురేష్‌బాబు, అరుణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

భాగవత శ్రవణం సర్వపాప హరణం



ప్రసంగిస్తున్న శ్రీరామమూర్తి

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): భాగవతాన్ని చదివినా, విన్నా సకల పాపాలు హరించుకుపోతాయని పద్య సారస్వత పరిషత్ జిల్లా అధ్యక్షుడు మాగంటి శ్రీరామమూర్తి ఉద్ఘోధించారు. ఒంగోలులోని పరిషత్ కార్యాలయంలో గురువారం నుంచి ప్రారంభమైన భాగవత సప్తాహ కార్యక్రమంలో ఆయన భాగవతంలోని కొన్ని భాగాలను విపులంగా వివరించారు. భాగవతం అంటే కేవలం ఒక ఆధ్యాత్మిక గ్రంథం మాత్రమే కాదని, అది భగవత్ తత్వాన్ని సంపూర్ణంగా తెలియజేసి మనిషి జీవితానికి మార్గనిర్దేశం చేస్తుందని తెలిపారు. భాగవతంలోని పరీక్షిత్ మహరాజ్ కథను ఆయన వివరించారు. తమ పరిషత్ ఆధ్వర్యంలో భాగవత సప్తాహ కార్యక్రమం ఏర్పాటుకు నిర్ణయించిన జాతీయ అధ్యక్షుడు చదలవాడ లక్ష్మీ నరసింహారావుకు, కార్యక్రమ నిర్వహణకు కృషి చేసిన కార్యవర్గ సభ్యులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పింగళి పూర్ణచంద్రరావు, అనఘా ఝాన్సీలక్ష్మి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించగా ఆధ్యాత్మికాభిమానులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

ఒంగోలు(రూరల్), డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం దశరాజుపల్లి గ్రామంలోని రైల్వే ట్రాక్ పక్కన గల చిల్లచెట్లలో పేకాట ఆడుతున్న శిబిరంపై తాలుకా పోలీస్‌లు గురువారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6500 స్వాధీనపరుచుకున్నారు. నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దేశంలో పెచ్చరిల్లుతున్న ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాలని సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు పిలుపునిచ్చారు. ఈ నెల 6న హైదరాబాద్‌లో అఖిలభారత ఫాసిస్టు వ్యతిరేక సదస్సు జరుగనున్న నేపథ్యంలో గురువారం ఒంగోలులోని ప్రకాశం భవన్ ఎదురుగా ఉన్న మంచి పుస్తకం కార్యాలయం వద్ద వివిధ ప్రజాసంఘాల నాయకులు సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు చుండూరు రంగారావు, చావలి సుధాకర్‌రావు, ఎం.జార్జి, దాసరి సుందరం, పేరం సత్యం, పి.పేరయ్య, గుంటూరు మస్తాన్‌రావు, ఆవుల సుబ్రహ్మణ్యం, ఏఎల్.ప్రసాద్, కొమ్ము రాజేంద్ర, తేరటి ఆనంద్, కొమ్ము సామ్యూల్, మురహరి రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

నాగులుప్పలపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ సూచించారు. పోతవరంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహాన్ని గురువారం రాత్రి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, వంటశాల, వసతిగదులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి వారితో ముచ్చటించారు. విద్యార్థుల వసతుల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఐ రమేష్, వీఆర్వో రాణి, వార్డెన్ కె.రామానందరావు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

కొత్తపట్నం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీపీవో వెంకటేశ్వరరావు కోరారు. గురువారం మండలంలోని కె.పల్లెపాలెం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయం సిబ్బంది, వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చూడాలన్నారు. నీటి నిల్వల్లో దోమలు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గ్రామస్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తాగునీటి నాణ్యతలను పరీక్షించి క్లోరినేషన్‌ను క్రమం తప్పకుండా చేయించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు సూచించారు. గ్రామంలో పన్నులు నూరుశాతం వసూలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో మూర్తి, పీడీవో పుల్లయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

● విద్యార్థి సంఘాల డిమాండ్
● నగరంలో పాఠశాలల బంద్



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యా సంస్థలను బంద్ చేపట్టారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏపీజేఏసీ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను మూసి వేయించారు. నెల్లూరు బస్టాండు వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. మార్కాపురంలోని మెడికల్ కాలేజీని ప్రభుత్వరంగంలోనే నిర్మించాలని, జిల్లా యూనివర్శిటీ, ట్రిపుల్‌ఐటీలకు నిధులను కేటాయించి నిర్మాణాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ వసతిగృహాలు, ప్రభుత్వ పాఠశాలలు, కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ఆయా సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళినా ఇంతవరకు పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆయా సమస్యలను విద్యాశాఖమంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగకపోవడంతో విద్యాసంస్థల బంద్‌ను చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సీహెచ్.వినోద్, రాయపాటి జగదీష్, ఎల్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా మంత్రి స్వామి పుట్టినరోజు



మద్దిపూడిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



మంత్రి స్వామిని గజమాలతో సత్కరిస్తున్న రామాగోపీ, టంగుటూరు నేతలు

మద్దిపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి జన్మదిన వేడుకలు గురువారం మద్దిపూడిలోని సుబ్రహ్మణ్యేశ్వర కాంప్లెక్స్ కార్యాలయంలో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. నియోజకవర్గ అభివృద్ధికి స్వామి చేస్తున్న కృషిని పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం స్వామికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తూర్పునాయుడుపాలెం తరలివెళ్లారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో చిమట సొసైటీ అధ్యక్షుడు మలసాని కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రేగుల వీరనారాయణ, మలసాని నాగేశ్వరరావు, మందలపు వెంకటేశ్వర్లు, బాలకోటయ్య, యర్రమోతు శ్రీనివాసులు, చేరెడ్డి నర్సారెడ్డి, పొదిలి శ్రీనివాసులు, రేగులు శ్రీనివాసరావు, వై.వెంకటరెడ్డి, గుళ్లాపల్లి మల్లిఖార్జున, బైరపునేని హరిక్రిష్ణ, శ్రీను, మోదుకూరి వెంకట్రావు, బి.రామక్రిష్ణ, పసుపులేటి సురేష్‌బాబు, తుళ్ళూరి నరసింహారావు, గొంట హనుమారెడ్డి, కొనిదెన మోహన్‌రావ్, బాలనరసయ్య, సారెడ్డినర్సింహారెడ్డి ఉన్నారు.

సింగరాయకొండ నేతల శుభాకాంక్షలు

సింగరాయకొండ: మండలంలోని పది గ్రామాల టీడీపీ నేతలు బుధవారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

పొన్నలూరు మండలం నుంచి..

పొన్నలూరు: మంత్రి శ్రీడోలా బాల వీరాంజనేయ స్వామి పుట్టినరోజు సందర్భంగా మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన స్వగ్రామం తూర్పునాయుడుపాలెంలో గురువారం కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కర్ణ తిరుపతమ్మ, మండల టీడీపీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, గుమ్మల్ల వెంకట్రావు, మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్, మండవ మురళీమోహన్, పల్లపోతు రమేష్ బాబు, రమణారెడ్డి, రాఘవరెడ్డి, కుంకు సురేష్, ఉన్నం శ్రీనివాసరావు, పల్లపోతు వెంకట్రావు, మన్యం రమణయ్య, నల్లూరి తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

● కాంట్రాక్టర్లతో కమిషనర్ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధి కోసం చేపట్టిన పనులు త్వరతగతిన పూర్తి చేయాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. గురువారం స్థానిక నగర పాలక సంస్థలోని తన చాంబర్‌లో కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలుతగా ఈనెలాఖరులోపు నగరంలో ప్యాచ్ వర్కులు చేపట్టి గుంతలు పూడ్చివేయాలన్నారు. అలాగే ఎన్‌కాప్, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులు కూడా వెంటనే ప్రారంభించాలని చెప్పారు. ఆయా బడ్జెట్‌ల నిధులు అందుబాటులో ఉన్నాయని, బిల్లుల మంజూరుకు ఎలాంటి జాప్యం జరగదని ఆయన తెలిపారు. వాటితోపాటు జనరల్ ఫండ్ కింద చేపట్టిన పనులకు త్వరలోనే బిల్లులు మంజూరు జరుగుతుందని కమిషనర్ కాంట్రాక్టర్లకు హామీ ఇచ్చారు. నగర అభివృద్ధిలో కాంట్రాక్టర్లు అందరూ భాగస్వాములై సహకరించాలని కోరారు. పనులు పర్యవేక్షణ విషయంలో ఇంజనీర్లు ప్రత్యేకదృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుని వేగవంతం అయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంఈ ఐశయ్య, కాంట్రాక్టర్లు పోతంశెట్టి పవన్‌కుమార్, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, పాలపర్తి లక్ష్మీనారాయణ, రమేష్, ఏడుకొండలు, సుధాకర్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపర చాణిక్యుడు కొణిజేటి రోశయ్య

● ఘనంగా వర్ధంతి కార్యక్రమాలు



ఒంగోలులో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా సేవలు అందించిన కొణిజేటి రోశయ్య అపర చాణిక్యుడని పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు కొనియాడారు. కొణిజేటి రోశయ్య వర్ధంతిని గురువారం స్థానిక ఆర్టీసీ డిపో దగ్గర ఉన్న ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ యక్కల తులసిరావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా గర్వించదగిన ఆర్యవైశ్య నాయకుడు కొణిజేటి రోశయ్య అన్నారు. ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపోతు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేసిన మహనీయుడు రోశయ్య అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బొగ్గవరపు సుబ్బారావు, మువ్వల శ్రీనివాసులు, కొల్లిపర్ల సురేష్, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ కమిటీ అధ్యక్షుడు తాతా చెంచయ్య గుప్తా, జలదంకి కృష్ణారావు, శ్రీనివాసరావు, దుడ్డు రంగనాయకులు, జెమినీ నాగేశ్వరరావు, అచ్యుత సత్యం తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: మాజీ సీఎం కొణిజేటి రోశయ్య వర్ధంతిని జిల్లా ఆర్యవైశ్య సంఘ నాయకుడు గుగ్గిలం సోమశేఖర గుప్తా ఆధ్వర్యంలో మద్దిపాడు తూర్పు పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. గంగిశెట్టి నరసింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి



ఘంటసాలకు నివాళులర్పిస్తున్న కళాకారులు



మద్దిపాడులో నివాళులర్పిస్తున్న అభిమానులు

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత నేపథ్య గాయకుడు స్వర్గీయ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో ఉన్న ఘంటసాల విగ్రహానికి పలువురు గాయకులు, కళాకారులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వాహకుడు కనకారావు మాట్లాడుతూ తెలుగు చిత్రసీమలో పాటకు, పద్యానికి మకుటాయమానం ఘంటసాల అని కొనియాడారు. జిల్లా సంగీత కళాకారుల సంఘ అధ్యక్షుడు ఎస్కే.బాబు మాట్లాడుతూ నేటికీ ప్రజల హృదయాల్లో మధురగాయకునిగా నిలిచిఉన్న మహనీయుడు ఘంటసాల అని చెప్పారు. కార్యక్రమంలో అన్నమయ్య సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు ఐ.మురళీకృష్ణ, సీవీఎన్ రీడింగ్ రూము కార్యదర్శి కోడూరు రాధాకృష్ణ, ఆకుల శ్రీనివాసరావు, ఎన్నూరి నాగేశ్వరరావు, చల్లా నాగేశ్వరమ్మ, నిర్మలమ్మ, భాస్కరరెడ్డి, శేషారత్నం, లక్ష్మీతులసి, గోపాలరావు, యు.కోటేశ్వరరావు, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఘంటసాల గీతాలతో సంగీత విభావరి నిర్వహించారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: ఘంటసాల గాన గంధర్వుడని మాజీ సర్పంచ్ జజ్జర శరత్‌బాబు అన్నారు. గురువారం స్థానిక నటరాజ కళాక్షేత్రంలో ఘంటసాల జయంతి వేడుకలు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సంఘ అధ్యక్షుడు దేవరశెట్టి ఎలమంద, నేలటూరి సత్యనారాయణ, అరి సూర్యనారాయణ, గంగిశెట్టి నరసింహారావు, గంట కోటేశ్వరరావు, కాకుమాను సుబ్బారావు, ఉండవల్లి సుందర్‌రావు, ఈమని సుబ్బారావు, బడితల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషి

మద్దిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేయాలని ఏపీఎం కాకుమాను సుబ్బారావు అన్నారు. గురువారం మద్దిపాడులో మండలంలోని పాడిపోషకుల ఔత్సాహిక సభ్యులకు డెయిరీ నాన్ ఫామ్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఈఆర్‌పీ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఎంఎస్ఆర్.మూర్తి మాట్లాడుతూ జిల్లాలో 8 మండలాలను పాడిపరిశ్రమ హబ్‌గా ఎంపిక చేశారని చెప్పారు. ఆయా మండలాల్లో పాడిపరిశ్రమను మరింతగా అభివృద్ధి చేయటం ద్వారా సంఘ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమానికి కార్యక్రమంలో డెయిరీ పరిశ్రమల మహిళా సంఘాల సభ్యులు, కోఆర్డినేటర్లు జి.వెంకటసుబ్బయ్య, బి.మోహన్, అరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

మద్దిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు తక్షణం పరిష్కరించాలని తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి తెలిపారు. గురువారం దొడ్డవరంలో ఆమె సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీఆర్వోలు తక్షణం పెండింగ్ సమస్యలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మహా పడిపూజ

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం లాయర్‌పేటలోని శిద్దా నివాసం వద్ద శుక్రవారం అయ్యప్ప స్వామి మహాపడి పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్పస్వాములు, శివస్వాములు, ఆంజనేయ, భవానీ దీక్షాధారులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

ఫీజులు చెల్లింపులపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఫీజులు చెల్లింపునకు డిజిటల్ (యూపీఐ) వాకడంపై ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో ఫీజులు చెల్లించేందుకు రియల్ టైం చెల్లింపు వ్యవస్థ వాడకం, ఈ వ్యవస్థ కింద నమోదైన పాఠశాలలు, ప్రభుత్వానికి వచ్చిన ఫీజులు, ఉపాధ్యాయులకు శిక్షణ తదితర అంశాలపై ఆయన మాట్లాడారు. దీనిపై కేంద్ర విద్యాశాఖసహాయమంత్రి జయంత్‌చౌదరి సమాధానం ఇస్తూ అన్ని ఆర్థిక లావాదేవీలు డివిజటల్ చెల్లింపులకు వాడే వివిధ రకలా ఎలక్ట్రానిక్ మాధ్యమాల మాదిరిగానే పాఠశాలల ఫీజులు చెల్లించడానికి ఉపయోగపడే రియల్ టైం చెల్లింపు వ్యవస్థకు కూడా ప్రభుత్వం మద్దతు ఇస్తుందని తెలిపారు. అన్ని పాఠశాలల్లో అన్ని రకాల ఫీజుల వసూళ్ళకు ఈ వ్యవస్థకు సంబంధించి పరిశీలన, డిజిటల్ పద్ధతులు తదితర అన్ని అంశాలకు సంబంధించి రాష్ట్రాలకు సలహాలను కేంద్ర విద్యామంత్రిత్వశాఖ ఇస్తుందని ఆయన వివరణ ఇచ్చారు.

పొదుపు మహిళలకు ఆరోగ్య పరీక్షలు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పొదుపు గ్రూపు సభ్యుల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు గురువారం ఒంగోలు నగరం కబాడీపాలెం కమ్యూనిటీ హాలు వద్ద మహిళలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సఖీ సురక్షలో భాగంగా మహిళలకు, వారి కుటుంబ సభ్యులకు థైరాయిడ్ పరీక్షతో పాటు పదహారు రకాల ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలను గుర్తించారు. అదేవిధంగా వారికి అసరమైన ఆరోగ్య సలహాలు, సూచనలు నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో మెప్మా సీవోలు, ఆర్పీలు, సఖీ సురక్ష బృందం వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

మంత్రి స్వామికి సత్కారం



మంత్రి స్వామికి శుభాకాంక్షలు చెబుతున్న జయంత్‌బాబు

మద్దిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి జన్మదినం సందర్భంగా రాష్ట్ర పొగాకు సమాఖ్య ఛైర్మన్ మండవ జయంత్‌బాబు గురువారం నాయుడుపాలెంలోని మంత్రి స్వగృహంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి స్వామిని శాలువతో ఘనంగా సత్కరించారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఉప విద్యాధికారి చంద్రమౌళేశ్వరరావు అన్నారు. ఈనెల 6వతేదీన అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని మాస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీలకు సంబంధించి కరపత్రాలను ఆయన ఒంగోలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రమౌళేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించడంతో వారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జి.శివాజి, మేకపాటి మాల్యాద్రి, బొడ్డు శ్రీనివాసరావు, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైవీకి కృతజ్ఞతలు

ఒంగోలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు వైవీ.సుబ్బారెడ్డిని గురువారం స్థానిక లాయర్‌పేటలోని ఆయన నివాసంలో పలువురు ఆ పార్టీనాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీలో సభ్యునిగా స్థానం కల్పించినందుకు క్రాంతి కుమార్ ఈ సందర్భంగా వైవీని సత్కరించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబును కూడా సత్కరించారు. కార్యక్రమంలో ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, నాయకులు కేవీ.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, లంకపోతు అంజిరెడ్డి, కటారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనిల్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఒంగోలు నగరం కొప్పోలురోడ్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ వి.అనిల్ మాట్లాడుతూ తాగునీటిలో ఫ్లోరైడ్ ఎక్కువై దేశ వ్యాప్తంగా అనేకమంది పలు రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. తాగునీటిలో పరిమితికి మించి ఉన్న ఫ్లోరైడ్ ప్రజలను అనారోగ్యానికి గురి చేస్తుందనితెలిపారు. ప్రజలు తాగునీటి వినియోగంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రామాంజనేయులుకు అవార్డు ప్రదానం

ఒంగోలు నగరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా బాలల సంరక్షణ కమిటీ ఛైర్మన్ వేము రామాంజనేయులుకు గురువారం ఎన్‌హెచ్-16 సింహపురి ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్(సెల్) వారు ఇన్‌స్పైర్ అవార్డును ప్రదానం చేశారు. జిల్లాలో బాలల సంరక్షణ కోసం, బాల్య వివాహాలను అరికట్టటంలో ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేశారు. నెల్లూరు హైవే సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు సమక్షంలో రామాంజనేయులు ఈ అవార్డును అందకున్నారు. బాలల సంరక్షణలో విశేష సేవలు అందిస్తున్న వారికి ప్రతి ఏటా సెల్ అందించే ఇన్‌స్పెయిర్ అవార్డును ఈ ఏడాదికి సంబంధించి రామాంజనేయులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు వేము రామాంజనేయులు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ నెల్లూరు ఇన్‌చార్జి అనిల్‌కుమార్‌రెడ్డి, కో ఆర్డినేటర్ నర్సింగరాజు పాల్గొన్నారు.



రామాంజనేయులుకు అవార్డును అందజేస్తున్న డీఆర్వో చిన ఓబులేసు, ప్రతినిధులు


కోర్టులో పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న న్యాయాధికారి ఓంకార్

ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలి

● జూనియర్ సివిల్ న్యాయాధికారి ఓంకార్

గిద్దలూరు టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు కోర్టులో ఈనెల 13వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా పోలీసులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ అన్నారు. గురువారం కోర్టు ఆవరణలో 6 మండలాల పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కారమైతే మళ్లీ అప్పీల్‌కు వెళ్ళే అవకాశం ఉండదని, ఇది కక్షిదారులకు తెలియజేయాలని సూచించారు. రాజీ మార్గమే రాజమార్గమని అన్నారు. 13న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గిద్దలూరు అర్బన్, రూరల్ సీఐలు కె.సురేష్, రామకోటయ్య, 6 మండలాల ఎస్సైలు పాల్గొన్నారు.


బాల్యవివాహాలు వద్దంటూ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో గిరిధర్ శర్మ

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

రాచర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి వి. గిరిధర్ శర్మ అన్నారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను మండల కార్యాలయంలో స్థానిక ఎంపీడీవో ఎస్. వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. బాల్య వివాహాలు చేసినా, అందుకు ప్రోత్సహించినా వారంతా బాధ్యులవుతారని అన్నారు. ముఖ్యంగా నేడు జరిగే మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌పై ఆయన ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటించి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులంతా ప్రత్యేక కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో (జీఎస్‌డబ్ల్యూఎస్) ఓవీకే శ్రీనివాస్ కుమార్, ఎంఈవో -1 షేక్ మోయినుద్దీన్, రాచర్ల జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామానాయక్, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ కార్మికులు

ఫిట్‌నెస్ కార్యాలయాన్ని కొనసాగించాలి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో మోటారు వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ కార్యాలయాన్ని మార్కాపురంలోనే కొనసాగించాలని, ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లడుతూ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే సెంటర్‌ను నంద్యాలకు తరలించడం తగదన్నారు. నంద్యాల వెళ్లాలంటే 120 కిలో మీటర్లు అని ఆటోలో పర్మిట్, కేవలం 30 కిలోమీటర్ల పరిధి అన్నారు. ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలన్నారు. అనంతరం ఆర్టీవో చందన, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మాదవరావులకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టీకేఎం రఫీ, రంగారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు అందె నాయసరయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు భాషా, వెంకట రెడ్డి, జీపు ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు హమీద్, ఆవులయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీని వివరిస్తున్న ఏవో లక్ష్మీనారాయణ

డ్రోన్లతో పురుగుమందుల పిచికారీ సులభతరం

పెద్దారవీడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పురుగుమందుల పిచికారీ డ్రోన్లతో చేసినట్లయితే తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో చేయవచ్చని ఏవో ఎన్.లక్ష్మీనారాయణ అన్నారు. పెద్దారవీడులో శనగపంటపై డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీ విధానాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా తైవాన్ స్ప్రేయర్లు ఉపయోగించినట్లయితే ఎకరాకు 100 నుంచి 150 లీటర్ల నీరు అవసరం అవుతుందన్నారు. అదే డ్రోన్లతో అయితే కేవలం 12 లీటర్లతో ఎకరాకు పిచికారీ చేయవచ్చన్నారు. తైవాన్ స్ప్రేయర్‌తో 2 గంటలు పడుతుండగా, డ్రోన్‌తో 10 నిమిషాల్లో పిచికారీ పూర్తి చేయవచ్చన్నారు. ఎకరాకు కేవలం రూ.350లు మాత్రమే ఖర్చవుతుందన్నారు. ఎత్తు ఎక్కువగా పెరిగినటువంటి కంది, ఉద్యాన పంటలలో డ్రోన్లతో సులభతరంగా పిచికారీ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రైతు కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జనవరిలో సీఐటీయూ అఖిలభారత మహాసభలు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కొండారెడ్డి అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మహాసభల వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 30 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో మహాసభలు జరుగుతాయని, విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీకేఎం రఫీ, నాయకులు సుబ్బరాయుడు, రూబెన్, నన్నెన, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

13న నవోదయ ప్రవేశ పరీక్ష

తర్లుపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుజువ్వలపాడు జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశ పరీక్ష ఈనెల 13న జరుగుతుందని ప్రిన్సిపాల్ బ్రహ్మనాయుడు తెలిపారు. పశ్చిమ ప్రకాశంలోని 27 మండలాల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 13వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి 1.30 నిమిషాల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి 1 గంట ముందుగానే చేరుకోవాలని ఆయన సూచించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎంఎల్ఏ కందుల నారాయణరెడ్డి


రైతన్నా మీకోసం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ కందుల నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఏ కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గోగులదిన్నె గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎంఎల్ఏ కందుల నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ మిరప రైతులు గుంటూరు వెళ్లి ఉత్పత్తులను అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు మార్కాపురంలోనే మిర్చి యార్డును త్వరలో ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే అయినట్లుగా చూపి ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేసుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసిందని తెలిపారు. అలాగే అధికారులు రైతుల ఇళ్ల వద్దకే వచ్చి పంటల సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలను సలహాలు సూచనలను తెలియజేస్తున్నారన్నారు. మంచి పనులను చేస్తున్న తమను గుర్తించి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ బాలాజి నాయక్, తహసీల్దార్ చిరంజీవి, ఏవో బుజ్జిబాయి, వెలుగు ఏపీఎం పిచ్చయ్య, టీడీపీ నాయకులు బొగ్గు శేఖర్‌రెడ్డి, రామాంజులరెడ్డి, శ్రీనివాసులు, నాసర్‌రెడ్డి, గోగులదిన్నె నాయకులు కృష్ణారెడ్డి, కాశిరెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఖైదీలు పరివర్తన చెందాలి


రికార్డులో సంతకం చేస్తున్న న్యాయాధికారి ఇబ్రహీం షరీఫ్

మార్కాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు జైలు జీవితంలో పరివర్తన చెందాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, న్యాయాధికారి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. స్థానిక సబ్ జైలును ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. విజిటర్స్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా , వంటశాల, స్టోర్‌రూమ్, ఖైదీలు ఉండే గదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ జైలుకు వచ్చినందుకు పశ్చాతాపపడి పరివర్తన చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఉషశ్రీ, మండల లీగల్ సర్వీస్ అథారిటీ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, పారా లీగల్ వాలంటీర్ షేక్ బాషా, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలు మంచి పౌరులుగా మారాలి

గిద్దలూరు టౌన్ : ఖైదీలు జైలు జీవితం అనుభవించిన తరువాత మంచి పౌరులుగా మారి కుటుంబసభ్యులను జాగ్రత్తగా చూసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. గురువారం పట్టణంలోని సబ్‌జైలును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఖైదీలకు నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం జైలులో అందుతున్న సదుపాయాలు, సరుకుల నాణ్యతను, జైలు పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, లీగల్ ఎయిడ్ న్యాయవాది ఎన్.అహల్య, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు, కోర్టు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

తూతూమంత్రంగా ఉపాధిహామీ గ్రామసభలు


గ్రామ సభలో మాట్లాడుతున్న డీఆర్‌పీ కోటయ్య

తర్లుపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2024-2025 లో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో గుట్టు చప్పుడు కాకుండా గ్రామ సభలు నిర్వహించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం తర్లుపాడు, చెన్నారెడ్డిపల్లి, మిర్జపేటలో గ్రామసభలు జరిగాయి. ఈ సభలకు అధికారులు లేకుండానే టెక్నికల్ అసిస్టెంట్లు, డీఆర్పీలు తూతూమంత్రంగా గ్రామసభలు నిర్వహించి వెళ్లిపోవడంలో అంతర్యం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామాజిక తనిఖీలు నిర్వహించాల్సిన సిబ్బంది చేసిన పనులపై తూతూమంత్రంగా సభలు నిర్వహించడాన్ని ప్రజలు తప్పు పడుతున్నారు. గతంలో పని చేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు, వైసీపీ కార్యకర్తలు, టెక్నికల్ అసిస్టెంట్లు కూడా అప్పటి ఫీల్డ్ అసిస్టెంట్లతో కుమ్మక్కై లక్షలాది రూపాయలు అవినీతికి పాల్పడ్డారు. ఈ అవకతవకలు బయటకు రాకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు సామాజిక తనిఖీ బృందం కుమ్మక్కైనట్లు సమాచారం. ఇప్పటికైనా గ్రామ సభ నిర్వహించేటప్పుడు గ్రామంలో దండోరా వేయించాలి కానీ ఎవరికీ తెలియకుండా తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధిహామీ పనుల్లో జరిగిన అవతవకలను సామాజిక తనిఖీ బృందం గుర్తించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా కాశినాయన ఆరాధనా మహోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో కాశినాయన మూల విరాట్

పెద్దారవీడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి: కాశీనాయన 30వ ఆరాధన ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కాశినాయన ఆశ్రమంలో 32వ జయంతి సందర్భంగా కాశినాయనను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆరాధనలకు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ పాలకవర్గం భోజన వితరణ కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. మహిళలు, చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎద్దుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కాశినాయనకు పూజలు

గిద్దలూరు : పట్టణంలోని కాశినాయన ఆశ్రమంలో ఆరాధన మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. తొలిరోజు గురువారం కాశినాయనకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు సామూహిక భజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థాన ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు. కాశినాయన ఆరాధన మహోత్సవాల సందర్భంగా కాశినాయన జ్యోతి క్షేత్రానికి గిద్దలూరు ఆర్టీసీ డిపో అధికారులు 15 ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. వివిధ జిల్లాలకు చెందిన కాశినాయన భక్తులు పెద్ద ఎత్తున రైళ్లు, ఇతర వాహనాలు, బస్సుల ద్వారా గిద్దలూరుకు చేరుకున్నారు. అక్కడ ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో జ్యోతి క్షేత్రానికి బయలుదేరి వెళ్లారు. కాశినాయన భక్తులతో రైల్వేస్టేషన్ కిటకిటలాడింది.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి


బంద్ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరస్వామి అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్‌లో భాగంగా మార్కాపురంలో పాఠశాలలు, కళాశాలల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ జీవో 77ను రద్దు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ మెస్ చార్జీలను రూ. 3 వేలకు పెంచాలన్నారు. ట్రిపుల్ ఐటీ జిల్లాలో వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. మార్కాపురం, గిద్దలూరులలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. దర్శిలో డిగ్రీ కలాశాల ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్నారని, వెంటనే ప్రభుత్వం భవనంలో నిర్మాణం చేపట్టాలన్నారు. ఒంగోలులో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పి.అజయ్, వై.జడేజా, సభ్యులు ప్రవణ్ కుమార్, సన్నీ, నాగరాజు, రంజిత్ కుమార్, మహేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ

గిద్దలూరు టౌన్: ప్రైవేటు కళాశాలలు పేద విద్యార్థులపై భారీ ఫీజులతో భారం మోపుతున్నాయని ఆరోపిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. రాచర్ల గేటు నుంచి నిరసన ర్యాలీ ప్రారంభమై తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం విద్యార్థి నాయకులు తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

20 నుంచి కబడ్డీ పోటీలు

గిద్దలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ముండ్లపాడు సెయింట్ జాకబ్స్ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి ఓపెన్ టు ఆల్ ప్రైజ్ మనీ కబడ్డీ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంటు కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విజేతకు రూ. 40వేలు, రెండవ విజేతకు రూ. 30వేలు, మూడవ విజేతకు రూ. 20వేలు, నాల్గవ విజేతకు రూ.10వేలు నగదు అందజేస్తామని తెలిపారు. 500 రూపాయల ఎంట్రీ ఫీజు చెల్లించాలని, పోటీలో పాల్గొనే జట్లు 9676109792, 9381793406 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు సీపీఐ జిల్లా కమిటీ సమావేశం

త్రిపురాంతకం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని పూల సుబ్బయ్యభవన్‌లో ఈనెల 5వ తేదీన సీపీఐ జిల్లా కమిటీ సమావేశం జరుగుతుందని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు దేవెండ్ల శ్రీనివాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో రైతు సమస్యలపై ప్రధానంగా చర్చిస్తామని చెప్పారు. సమావేశంలో నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి బాణాల రామయ్య, దాసరి మల్లికార్జున, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్

గిద్దలూరు టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈనెల 5వ తేదీ శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని, నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో ఎమ్మెల్యే దృష్టికి తేవాలని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి ప్రజాదర్బార్ జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు కంభంలో ప్రజావిజ్ఞప్తుల దినం

కంభం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 5వ తేదీ శుక్రవారం ఉదయం 10.30గంటలకు గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు వారి సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు సమర్పించాలని తహసీల్దార్ కోరారు.

నేడు కార్యకర్తల సమావేశం

గిద్దలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దమార్కెట్ సమీపంలో గల సాయిబాబా ఫంక్షన్ హాలులో ఈనెల 5వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

ల్యాబ్‌కిట్లు,పుస్తకాలు అందజేత

బేస్తవారపేట,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా మంజూరైన ల్యాబ్ పరికరాల కిట్లు,గ్రంథాలయ పుస్తకాలను గురువారం ఎంఈవో రమణారెడ్డి పంపిణీ చేశారు.

వాటర్ ట్యాంక్ పరిసరాలు శుభ్రం

గిద్దలూరు టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏబీఎం పాలెంలోని వాటర్‌ట్యాంక్‌ను మున్సిపల్ సిబ్బంది గురువారం శుభ్రం చేశారు. వాటర్ ట్యాంక్‌తోపాటు పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. వాటర్ ట్యాంక్ చుట్టూ ఉన్న చిల్లచెట్లను తొలగించి బ్లీచింగ్‌తో ట్యాంక్‌ను శుభ్రం చేశారు. పట్టణంలోని 8 ట్యాంక్‌లను శుభ్రపరచి పెయింటింగ్ వేయించామని మున్సిపల్ కమిషనర్ రమణబాబు తెలిపారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి

బేస్తవారపేట,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): బేస్తవారపేటలో గురువారం శ్రీ దత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఉదయం ప్రత్యేక పూజలతో ప్రారంభమై సాయంత్రం గ్రామోత్సవంతో ముగిసింది. అనేక మంది భక్తులు పాల్గొని దత్తాత్రేయ జయంతి వేడుకలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి


బేస్తవారపేటలో ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న సీఆర్‌ఎంటీలు

బేస్తవారపేట,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి):తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని సీఆర్‌ఎంటీలు గురువారం ఎంఈవో రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీఆర్‌ఎంటీలకు డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలని,ట్రావెలింగ్ అలవెన్స్‌ను పునరుద్ధరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రకాశరావు, డి.మహబూబ్‌బీ, ఎం. సుజాత, ఎ.సునీత పాల్గొన్నారు.

తర్లుపాడులో ఎంఈవోకు వినతి

తర్లుపాడు : మండలంలోని ప్రభుత్వ పాఠశాల, విద్యశాఖ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంప్లెక్స్ రిసోర్స్ మానిటరింగ్ ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంఈవో అచ్యుత సుబ్బారావుకు, తహసీల్దార్ కిషోర్ కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రోగ్రాం అసోసియేట్ శ్యాంబాబు

గంజి వార్చని అన్నంలో పోషకాలు

రాచర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేసే ఫోర్టిఫైడ్ బియ్యంలో మంచి పోషకాలు అధికంగా ఉంటాయని విజయ మోహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రాం అసోసియేట్ వి. శ్యాంబాబు అన్నారు. మండల ఎంఈవో వి. గిరిధర శర్మతో కలిసి గురువారం ఆయన రాచర్ల జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. టాటా ట్రస్ట్ సహకారంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. బియ్యాన్ని ఒక్కసారి కడిగి గంజి వంచకుండా మగ్గించాలని ఆయన వంటవారికి సూచించారు. కోడిగుడ్డు కొంత ఉడికించిన తర్వాత సన్నని మంటపై కొంత సమయం ఉడికించాలన్నారు. వంట చేసేవారు వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఎల్ రామానాయక్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వాన కార్డులు తల్లిదండ్రులకు ఇస్తున్న ఉపాధ్యాయులు

నేడు అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే వేడుకలు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న తమ పిల్లల భవిష్యత్తు ఏ విధంగా ఉందో, పాఠశాలల్లో ఎటువంటి వసతులు ఉన్నాయో తెలుసుకొని వారికి విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులు, పిల్లలతో సరదాగా గడిపేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ సమావేశం విద్యాశాఖ ఏర్పాటు చేసింది. అందుకుగాను గురువారం అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికలను పంపిణీ చేసినట్లు ఎర్రగొండపాలెం ఎంఈవో ఆంజనేయులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొంటారని ఎంఈవో తెలిపారు.

కొమరోలులో..

కొమరోలు : మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ డే నిర్వహించాలని ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు,దాతలు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యేలా హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

మెగా పేరెంట్, టీచర్స్ సమావేశానికి తప్పక రావాలి

కంభం : మండలంలో నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్ సమావేశానికి తల్లిదండ్రులందరూ తప్పక రావాలని ఎన్ఆర్ తురిమెళ్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ నాయుడు గురువారం ఇంటింటికీ ఆహ్వాన పత్రికలను అందజేశారు.

తల్లులకు ఆటల పోటీలు

మండలంలోని హజరత్ గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్, బాల్ ఇన్ బకెట్ వంటి పోటీలను నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్, షబ్బీర్ నేతృత్వంలో ఏ సరోజ, పి. సుజాత, రాజ్యలక్ష్మి, తదితర ఉపాధ్యాయులు ఈ పోటీలను నిర్వహించారు.


భిక్ష చేస్తున్న అయ్యప్ప, భవానీ దీక్షాధారులు

దీక్షాధారులకు నిరంతరాయంగా అన్నదానం

పొదిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పార్వతీ సమేత నిర్మమహేశ్వర స్వామి ఆలయంలో సకల దీక్షాధారులకు దాతల సహాయంతో అయ్యప్పస్వామి సేవ సంఘం ఆధ్వర్యంలో నెలరోజులుగా అన్నదానం నిరంతరాయంగా సాగుతోంది. గురుస్వాముల పర్యవేక్షణలో జరుగుతున్న కార్యక్రమానికి విరాళాలు అందించేందుకు దాతలు పెద్దఎత్తున ముందుకువస్తున్నారు. నిత్యం సుమారుగా 500ల మంది సకల దీక్షాధారులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. స్వాములకు అన్నదానం చేస్తే మంచి జరుగుతుందని, అందుకు తమ వంతుగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భోజన ఏర్పాట్లు చేస్తున్నామని పలువురు దాతలు తెలిపారు.

తర్లుపాడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

తర్లుపాడు, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడు పోలీస్ స్టేషన్‌ను గురువారం దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో నేరాల నియంత్రణకు రాత్రివేళ గస్తీని ఏర్పాటు చేయాలని పోలీస్ వ్యవస్థపై ప్రజలకు మరింత విశ్వాసం కలిగేలా చూడాలని ఎస్సై బ్రహ్మనాయుడుని ఆదేశించారు. ఈయన వెంట పొదిలి సీఐ రాజేష్ కుమార్ ఉన్నారు.

కొమరోలు ఇన్‌చార్జి ఎంపీఈవోగా చెన్నారావు

కొమరోలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొమరోలు పంచాయతీ ఇన్‌చార్జి అభివృద్ధి అధికారిగా డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న చెన్నారావును నియమించినట్లు ఎంపీడీవో సత్యం తెలిపారు.

పాలసీదారులకు సరైన సేవలు అందించాలి

పొదిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఐసీ సేవలను పాలసీదారులకు అందించేందుకు ఏజెంట్లు ముందుండాలని నెల్లూరు డివిజన్ సేల్స్ మేనేజర్ వేణుమాధవ్ అన్నారు. గురువారం స్థానిక ఎల్ఐసీ శాటిలైట్ కార్యాలయంలో ఏజెంట్ల నాలెడ్జి డెవలప్‌మెంట్ సమావేశానికి హాజరై మాట్లాడారు

మోడల్ టెస్టు పేపర్లు ఆవిష్కరణ

కురిచేడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం పదో తరగతి మోడల్ టెస్టు పేపర్లను ఆవిష్కరించారు. మండల విద్యా వనరుల కేంద్రం వద్ద ఎంఈవోలు వస్రాం నాయక్, సుబ్బారావు, ఎంపీడీవో సత్య హనుమప్రసాద్, జడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి వీటిని ఆవిష్కరించారు. ఈ మోడల్ పేపర్లు పదో తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు.

గోకులం షెడ్లను త్వరితగతిన పూర్తిచేయాలి

ముండ్లమూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో గోకులం షెడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీవో పి.వెంకటరావు అన్నారు. గురువారం మండలంలోని పెదఉల్లగల్లులో గోకుల్ షెడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముండ్లమూరు, పసుపుగల్లు, నాయుడుపాలెం, సింగనపాలెం, పోలవరం, కెల్లంపల్లి, వేముల, ఈదర, భీమవరం గ్రామాల్లో గోకుల్ షెడ్డుల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఈసీ శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌కు వాటర్‌ప్లాంట్

దొనకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న బాలికల హాస్టల్‌కు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు సొంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను బహూకరించారు. హాస్టల్‌లో ఉంటున్న దాదాపు వంద మంది విద్యార్థినులు తాగునీటి కోసం పడుతున్నారు. దీంతో బాలికలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు రూ.80 వేలు విలువచేసే మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన హాస్టల్‌కు అందజేశారు.

13న నవోదయ ప్రవేశ పరీక్ష

తర్లుపాడు, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుజువ్వలపాడు జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశ పరీక్ష ఈనెల 13న జరుగుతుందని ప్రిన్సిపాల్ బ్రహ్మానాయుడు తెలిపారు. పశ్చిమ ప్రకాశంలోని 27 మండలాల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 13వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి 1.30 నిమిషాల వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

గంజి వార్చని అన్నంలో పోషకాలు

రాచర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేసే ఫోర్టిఫైడ్ బియ్యంలో మంచి పోషకాలు అధికంగా ఉంటాయని విజయ మోహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రాం అసోసియేట్ వి. శ్యాంబాబు అన్నారు. మండల ఎంఈవో వి. గిరిధర శర్మతో కలిసి గురువారం ఆయన రాచర్ల జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. టాటా ట్రస్ట్ సహకారంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. బియ్యాన్ని ఒక్కసారి కడిగి గంజి వంచకుండా మగ్గించాలని ఆయన వంట వారికి సూచించారు. కోడిగుడ్డు కొంత ఉడికించిన తర్వాత సన్నని మంటపై కొంత సమయం ఉడికించాలన్నారు. వంట చేసేవారు వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బీఎల్ రామానాయక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టారని ఫిర్యాదు

కనిగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని కొట్టాడని ప్రైవేటు కళాశాల ఉపాధ్యాయుడిపై తల్లిదండ్రులు గురువారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో వెలిగండ్ల మండలంలోని గుమ్మలకర్ర గ్రామానికి చెందిన కుమ్మరికుంట జోయల్‌రాజు అనే విద్యార్థి పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ అదే కళాశాల హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈక్రమంలో రాత్రి సమయాల్లో హాస్టల్‌లో పెద్ద పెద్దగా అరుస్తూ అల్లరి చేస్తున్నాడు. కళాశాల ప్రక్కన ఉన్న నివాసాలకు చెందిన ఆ ప్రాంత వాసులు కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. కళాశాల అధ్యాపకుడు విద్యార్థిలను విచారించగా నోయల్‌రాజు అల్లరి చేశాడని తెలిపారు. ఈక్రమంలో నోయల్‌రాజును కళాశాల ప్రిన్సిపాల్ గదిలోకి పిలిచి బెత్తంతో వీపుపై కొట్టడంతో తీవ్ర గాయమైంది. దీంతో తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

పాలసీదారులకు సేవలు అందించాలి

పొదిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఐసీ సేవలను పాలసీదారులకు అందించేందుకు ఏజెంట్లు ముందుండాలని నెల్లూరు డివిజన్ సేల్స్ మేనేజర్ వేణుమాధవ్ అన్నారు. గురువారం స్థానిక ఎల్ఐసీ శాటిలైట్ కార్యాలయంలో ఏజెంట్ల నాలెడ్జి డెవలప్‌మెంట్ సమావేశానికి హాజరై మాట్లాడారు

కాశినాయన ఆరాధనా మహోత్సవం

పెద్దారవీడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి: కాశీనాయన 30వ ఆరాధన ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కాశినాయన ఆశ్రమంలో 32వ జయంతి సందర్భంగా కాశినాయనను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆరాధనలకు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ పాలకవర్గం భోజన వితరణ కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. మహిళలు, చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

దిగజారిన ధాన్యం దిగుబడులు

- పెరిగిన పెట్టుబడులు
- కౌలురైతుల పరిస్థితి దారుణం

దర్శి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా రాకపోవటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఈఏడాది వాతావరణం, తుఫాన్‌తో చోటుచేసుకున్న మార్పులతో వరిపంట దిగుబడి తగ్గింది. గతంలో కంటే పెట్టుబడులు పెరిగాయి. దీంతో మాగాణి రైతులకు లాభాలు కనిపించటంలేదు. కౌలు రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తుంది.

సాగర్ ఆయకట్టు కింద సాగుచేసిన వరిపంట కోతలు కోసి ముమ్మరంగా కల్లాలు చేస్తున్నారు. ఈ ఏడాది ఎకరాకు అధికశాతం మందికి 30 నుంచి 35 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. కొద్దిమందికి మాత్రం 40 బస్తాల మేర దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ ఖర్చులు, ఎరువుల ధరలు, కూలీల ధరలు విపరీతంగా పెరగటంతో ఎకరాకు రూ.40వేల మేర పెట్టుబడి ఖర్చు అయింది. ప్రస్తుతం వస్తున్న దిగుబడి మార్కెట్‌లో లభిస్తున్న ధరల ప్రకారం కేవలం పెట్టుబడులకు మాత్రమే సరిపోతున్నాయి.

బయట మార్కెట్‌లో ప్రైవేట్ వ్యాపారులు 75 కేజీల ధాన్యం బస్తాను రూ.1400 కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.1790గా నిర్ణయించింది. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకుంటే ఆ మేరకు విక్రయించుకోవచ్చు. అయితే, కొనుగోలు కేంద్రాలు రెండు రోజుల క్రితమే ప్రారంభించారు.



బస్తాల్లోకి నింపుతున్న ధాన్యం

పూర్తిస్థాయిలో కొనుగోలు ప్రారంభం కాలేదు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలుచేసే అవకాశం లేదు. కేవలం నాలుగో వంతు పంటను మాత్రమే కొనుగోలు చేస్తారు. మిగిలిన పంటను ప్రైవేట్ వ్యాపారులకే విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈపరిస్థితుల్లో ఎకరాలో పండించిన ధాన్యం విక్రయించగా కేవలం రూ.40 వేలు మాత్రమే రాబడి వస్తుంది. ధాన్యం విక్రయించగా వచ్చిన సొమ్ము పెట్టుబడులకు సరిపోతుంది. సొంత పొలం ఉన్న వారికి గడ్డి మాత్రమే మిగులుతుంది. ఆరుగాలం కష్టించి పండించిన వరిపంటకు లాభాలు రాకపోవటంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

నష్టాలు చవిచూస్తున్న కౌలు రైతులు

మాగాణి భూములను కౌలుకు తీసుకొని వరిపంట సాగు చేసిన కౌలు రైతులు నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈఏడాది ఎకరాకు 8 నుంచి 10 బస్తాల వరకు కౌలు ధర పలికింది. కౌలు రైతులు ఆ మేరకు ఒప్పందంతో మాగాణి తీసుకొని వరిసాగు చేశారు. పండిన పంట అమ్మగా పెట్టుబడులకు మాత్రమే సరిపోతుంది. కౌలు చెల్లించలేని పరిస్థితుల్లో ఇబ్బంది పడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేస్తే మాగాణి రైతులకు న్యాయం జరుగుతుంది. ప్రభుత్వం, ఉన్నతాధికారులు తమ ఇబ్బందులను గుర్తించి వీలైనంత మేరకు అధిక మొత్తంలో కొనుగోళ్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

పాడిరైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

వీసీపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాడిరైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని బుడ్డారెడ్డిపల్లిలో ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న గోకుల షెడ్‌కు గురువారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో పశువుల సంరక్షణ, పాలఉత్పత్తుల పెంపు, రైతుల ఆదాయ వృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. మండలంలో మంజూరైన గోకులషెడ్‌లన్నీ త్వరగా నిర్మాణాలు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో డ్వామా పీడీ గంగవరపు జోసెఫ్‌కుమార్, తహసీల్దార్ ఉష, ఎంపీడీవో జీవీ కృష్ణారావు, ఏపీవో కొండయ్య, నాయకులు గడ్డం బాలసుబ్బయ్య, వేమూరి రామయ్య, వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని కోడిగుంపుల, సీఎస్‌పురం పట్టణంలోని వడ్డెపాలెంలో గోకులం షెడ్లను డ్వామా



సీఎస్‌పురంలో గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పీడీ జోసెఫ్‌కుమార్‌తో కలిసి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ గేదెల రక్షణకు గోకులాలు నిర్మిస్తున్న ఘనత ప్రజాప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు ఎల్.బ్రహ్మయ్య, వి.ప్రతాప్‌రెడ్డి, ఏపీవో బి.మాల్యాద్రి, టీడీపీ మండల అధ్యక్షులు బొల్లా నరసింహారావు, బొబ్బూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో అభివృద్ధి పరుగులు

వెలిగండ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలతో పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో గోకుం షెడ్‌కు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోకులం షెడ్ల నిర్మాణాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, ఏపీవో నాయక్, ఎంపీడీవో గంగాధర్, కర్నాటి భాస్కర్ రెడ్డి, అక్కి శ్రీను, మోటాటి సబ్బారెడ్డి, నరేంద్ర, సుంకరి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు చేయూత

ముండ్లమూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల బలోపేతమే లక్ష్యమని సెర్ప్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ ఎన్ఎస్ఆర్ మూర్తి అన్నారు. పాడి పరిశ్రమ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే సెర్ప్ లక్ష్యమన్నారు. గురువారం ముండ్లమూరులోని వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సం ఘాలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారుచేసే భాగంలో ప్రతి డ్వాక్రా మహిళను ఆర్థికంగా అభివృద్ధి చేయటం జరుగుతుందన్నారు. ఇప్పటికే అనేక పథకాలు మంజూరుచేసి వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చినట్టు తెలిపారు.

సమావేశంలో సీనియర్ మేనేజర్ బాలకృష్ణరాజు, బి.సుబ్బారావు, పశువైద్యాధికారి వంశీ, ఏపీఎం టి.హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు రుణాలు

తాళ్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారులకు అధిక మొత్తంలో రుణాలు మంజూరుచేసి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పడుతున్నట్టు సెర్ప్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ ఎన్ఎస్ఆర్ మూర్తి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాడిపరిశ్రమ చేస్తున్న మహిళా రైతులకు ఆర్థికంగా పురోగతి చెందేందుకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో సీవో బాలకృష్ణరాజు, ఏపీఎం బి.సుబ్బారావు, ఏపీఎం పి.దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరులో మాట్లాడుతున్న ఎన్ఎస్ఆర్ మూర్తి

ఘనంగా డాక్టర్ లలిత్‌సాగర్ జన్మదినం

దొనకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ జన్మదిన వేడుకలను గురువారం దొనకొండలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు మోడి ఆంజనేయులు, మాజీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, టీడీపీ కార్యాలయంలో వీరపనేని వెంకన్నచౌదరి, కామేపల్లి చెంచయ్య, బస్టాండ్ సెంటర్‌లో మోడి వెంకటేశ్వర్లు, షాపింగ్ కాంప్లెక్స్ వద్ద సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్న కుమారి, దేవానంద్ భారీ కేకులు కట్ చేశారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పులిమి రమణాయాదవ్, పురుషోత్తం సత్యానందం, బండ్ల వెంకటనారాయణ, వడ్లమూడి చెన్నయ్య, సింగమనేని బసవయ్య, మన్నెం గాలయ్య, పత్తి వెంకటేశ్వర్లు, కొమ్మతోటి సుబ్బారావు, పిల్లి ఓబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ పుట్టినరోజు వేడుకలు గురువారం ఆపార్టీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్‌చేశారు. ఈసందర్భంగా తిరుపతిలో ఉన్న లలిత్‌సాగర్‌కు వీడియో కాల్‌చేసి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మానం రమేష్‌బాబు, గొల్లపూడి వేణుబాబు, గొంది రమణారెడ్డి, కాలేషావలి, రాచకొండ వెంకట్రావు, శివనాగిరెడి, విద్యాసాగర్, షేక్ కాశీంసైదా, చెన్నపురెడ్డి వీరనాగిరెడ్డి, ఇడమకంటి శ్రీనివాసరెడ్డి, కె.రామకోటిరెడ్డి, కె.నాగార్జునరెడ్డి, పోలంరెడ్డి రమణారెడ్డి, మారం వెంకటరెడ్డి, అనపరి సుబ్బారావు, కె.రామయ్య, పేరిరెడ్డి, హనుమారెడ్డి, మారాబత్తుల సుజాత, తదితరులు పాల్గొన్నారు.



దొనకొండలో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



తాళ్లూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

దర్శి: డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ జన్మదినం సందర్భంగా గురువారం స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే పాపారావు, కడియాల రమేష్ తదితరులు కేకు కట్‌చేశారు. పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, పుల్లలచెరువు చిన్నా, మారెళ్ళ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు పరివర్తన చెందాలి

మార్కాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు జైలు జీవితంలో పరివర్తన చెందాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, న్యాయాధికారి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. స్థానిక సబ్ జైలును ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. విజిటర్స్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా , వంటశాల, స్టోర్‌రూమ్, ఖైదీలు ఉండే గదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ జైలుకు వచ్చినందుకు పశ్చాతాపపడి పరివర్తన చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఉషశ్రీ, మండల లీగల్ సర్వీస్ అథారిటీ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, పారా లీగల్ వాలంటీర్ షేక్ బాషా, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలు మంచి పౌరులుగా మారాలి

గిద్దలూరు టౌన్ : ఖైదీలు జైలు జీవితం అనుభవించిన తరువాత మంచి పౌరులుగా మారి కుటుంబసభ్యులను జాగ్రత్తగా చూసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. గురువారం పట్టణంలోని సబ్‌జైలును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఖైదీలకు నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం జైలులో అందుతున్న సదుపాయాలు, సరుకుల నాణ్యతను, జైలు పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, లీగల్ ఎయిడ్ న్యాయవాది ఎన్.అహల్య, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు, కోర్టు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

వాడివేడిగా మండల పరిషత్ సమావేశం

కురిచేడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండల పరిషత్ సమావేశం వాడివేడిగా జరిగింది. గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభమైన వెంటనే సభ్యులు పలుప్రశ్నలు లేవనెత్తారు. చేతి పంపులు మరమ్మతులు చేయాలని ఆరునెలలుగా కోరుతున్నా పట్టించుకోవడంలేదని జడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

పశువైద్యశాలలో సిబ్బంది కొరతతో జీవాలకు వైద్య చికిత్సలు చేయలేకపోతున్నామని ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి తెలిపారు. ఉదయం 9 గంటలకు రైతులు పొలాలకు వెళ్తారని, పశువైద్యశాలను ఉదయం 10 గంటలకు తెరిస్తే ఎవరికి ఉపయోగం ఉంటుందని సభ్యులు ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా పనిచేయడం లేదని సభ్యులు పేర్కొన్నారు. కేంద్రాలలో కోడిగ్రుడ్లు పగిలి దుర్వాసన వస్తున్నాయన్నారు. అక్కడ ఉండాలంటే పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రంథాలయం భవన నిర్మాణ స్థలం పరిశీలన

తాళ్లూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మించనున్న తాళ్లూరు శాఖా గ్రంథాలయ భవన నిర్మాణ స్థలాన్ని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఎంపీ వైవీ అత్యధికంగా గ్రంథాలయ భవనం కోసం ఎంపీ లాడ్స్ నుంచి రూ.35 లక్షలు కేటాయిస్తూ జిల్లా కలెక్టర్‌కు పంపారు. ఎంపీ ఆదేశానుసారం కలెక్టర్ పరిపాలన అనుమతులు ఇచ్చారు. తాళ్లూరులో ఓవివాహ వేడుకలకు వచ్చినవారు ఈ స్థలాన్ని పరిశీలించారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

ఘనంగా ఘంటసాల జయంతి



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, జీవీ రత్నం

దర్శి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని గురువారం దర్శిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పాపారావు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సంఘసేవకుడు జీవీ రత్నం తదితరులు ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలోని అనేక భాషల్లో గానామృతం కురిపించిన ఘంటశాలకు భారతరత్న అవార్డు ఇవ్వాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో ఏపీటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి కోటేశ్వరరావు, వీఆర్వో శ్రీనివాసరావు, జి.ప్రేమ్‌కుమార్, పి. సురేష్, ఆర్.మోషే తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన భూములకు నష్టపరిహారం చెల్లించాలి

పామూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పామూరు శ్రీమదనవేణుగోపాలస్వామి, శ్రీ భుజంగేశ్వరస్వామి దేవస్థానాలకు సంబంధించిన భూములకు నష్టపరిహారం ఇప్పించాలని ఈవో నరసింహబాబు కోరారు. ఈమేరకు గురువారం కనిగిరిలో ఆర్డీవో కేశవర్ధనరెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్ 565, ఎన్‌హెచ్ 167-7బి జాతీయ రహదారుల నిర్మాణంలో దేవస్థానం కోల్పోయిన భూములకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఆర్డీవోను కలిసినవారిలో మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థాన చైర్మన్ కొమ్మినేని ఆదినారాయణ ఉన్నారు.

పోలీసుస్టేషన్‌కు చేరిన పంచాయితీ



పోలీసు స్టేషన్‌కు చేరిన కెల్లంపల్లిలోని ఇరువర్గాలు

ముండ్లమూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్లంపల్లిలో పురాతన కాలం నాటి గ్రామ దేవత అంకమ్మ తల్లి విగ్రహాన్ని ఎవరిని అడిగి నదిలో కలిపారంటూ కొత్త ఆలయ కమిటీ నిర్వాహకులను గ్రామస్థులు ప్రశ్నించారు. గత రెండు రోజుల నుంచి పాత ఆలయంలో ఉన్న అంకమ్మ తల్లి వ్యవహారం గ్రామంలో ఇరువర్గాల మధ్య పంతాలకు వెళ్ళింది. ఎవరిని అడిగి అమ్మవారిని నదిలో కలిపారని ఒకవర్గం, కమిటీ నిర్వాహకులకు ఆహక్కు ఉందన్నందునే సముద్రంలో కలిపామంటూ మరోవర్గం పేర్కొంటుంది. ఈక్రమంలో కమిటీ నిర్వాహకులపై గ్రామంలో కొందరు బుధవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. గురువారం రాత్రి కెల్లంపల్లి నుంచి సుమారు రెండు వందల మందికి పైగా పోలీసు స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ కమలాకర్ వద్ద పంచాయితీ పెట్టారు. దీంతో ఎస్ఐ తాము గ్రామంలోకి వచ్చి విచారిస్తామని తెలిపారు. పాత అంకమ్మ తల్లి విగ్రహమైనా గ్రామస్థులందరికీ చెప్పి సముద్రంలో కలిపితే బాగుండేదని చెప్పి వారిని పంపించారు. కొత్త ఆలయం నిర్మించి గతేడాది పార్టీలకు అతీతంగా ఒకే తాటిపై ప్రతిష్ఠ మహోత్సవం చేశారు. పాత అంకమ్మ తల్లి విషయానికి వచ్చేసరికి రెండువర్గాలుగా విడిపోయి వాదులాడుకుంటూ పోలీసు స్టేషన్‌కు చేరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు కలెక్టరేట్,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. అమరావతి నుంచి గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రజలు వ్యాధుల బారినపడకుండా పారిశుధ్య పనులను విస్తృతంగా చేపట్టాలన్నారు. సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలన్నారు. వరి ధాన్య సేకరణకు కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు కొరత లేకుండా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, అధికారులు వరలక్ష్మి, హరికృష్ణ, శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతో పురుగుమందుల పిచికారీ సులభతరం

పెద్దారవీడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పురుగుమందుల పిచికారీ డ్రోన్లతో చేసినట్లయితే తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో చేయవచ్చని ఏవో ఎస్.లక్ష్మీనారాయణ అన్నారు. పెద్దారవీడులో శనగపంటపై డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీ విధానాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా తైవాన్ స్ప్రేయర్లు ఉపయోగించినట్లయితే ఎకరాకు 100 నుంచి 150 లీటర్ల నీరు అవసరం అవుతుందన్నారు. అదే డ్రోన్లతో అయితే కేవలం 12 లీటర్లతో ఎకరాకు పిచికారీ చేయవచ్చన్నారు. తైవాన్ స్ప్రేయర్‌తో 2 గంటలు పడుతుండగా, డ్రోన్‌తో 10 నిమిషాల్లో పిచికారీ పూర్తి చేయవచ్చన్నారు. ఎకరాకు కేవలం రూ.350లు మాత్రమే ఖర్చవుతుందన్నారు. ఎత్తు ఎక్కువగా పెరిగినటువంటి కంది, ఉద్యాన పంటలలో డ్రోన్లతో సులభతరంగా పిచికారీ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రైతు కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



గుంటూరు సీసీఐ కేంద్రంలో పత్తి ఆటో

రూ.20 ఇస్తే..పాస్

సీసీఐ కేంద్రాల్లో రైతుల నిలువు దోపిడీ

సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతు జేబుకు చిల్లు పడుతోంది. అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన వాళ్లే అన్నదాతలతో ఆడుకుంటున్నారు. సాధారణంగా పరీక్షల్లో వందకు 35 మార్కులు వస్తే పిల్లలను టీచర్లు పాస్ చేస్తారు. అలానే రైతులు తీసుకొచ్చిన పత్తి బండి సీసీఐ కొనుగోలు కేంద్రంలోనికి వెళ్లాలంటే.. క్వింటాల్‌కు రూ.20లు చెల్లిస్తేనే పాస్ చేస్తున్నారు. లేదంటే లోనికి పంపేది లేదని మంకుపట్టు పడుతున్నారు. ఇది అప్పటికి చిన్న దోపిడీలా కనిపించినా.. కొనుగోళ్లు పూర్తయ్యే సరికి రూ.కోట్లకు చేరుకుంటోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని సీసీఐ కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

- లోనికి వెళ్లాలంటే.. క్వింటాల్‌కు రూ.20 ఇవ్వాల్సిందే
- దిగుమతి కూలీ రెట్టింపుతో జేబుకు చిల్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాధారణంగా రైతులు తీసుకొచ్చిన పత్తి నిల్వలకు సంబంధించిన ప్రాథమిక సమాచారం నిర్ధారించాల్సిన బాధ్యత మార్కెటింగ్ శాఖది. ఈ పని చేసేందుకు ప్రతి సీసీఐ కేంద్రంలో మార్కెటింగ్ శాఖ సూపర్ వైజర్‌ను నియమించింది. ఆయా మండలాల నుంచి వచ్చిన రైతుల వివరాలు సీఎం యాప్, కిసాన్ యాప్‌లలో సక్రమంగా ఉన్నాయా లేదా అన్న విషయం సదరు సిబ్బంది పరిశీలిస్తారు. వారు పరిశీలించిన తర్వాతే మిగిలిన కొనుగోలు ప్రక్రియ ఆరంభం అవుతుంది.

అదే అదునుగా...

ఒక వేళ మార్కెటింగ్ శాఖ సిబ్బంది (మిగతా 6వ పేజీలో)

దిగుమతి కూలీ రెట్టింపు

ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సీసీఐ కేంద్రాల్లో దింపుడు కూలీ ధరలు అమాంతం పెంచేశారు. గతంలో ఉన్న ధర కంటే రెట్టింపు కావడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నాలుగు చక్రాల ఆటోలో పత్తి తీసుకువస్తే దిగుమతి కూలీ రూ.1000 నుంచి రూ.1200 వరకు తీసుకుంటున్నారు. అదే ట్రాక్టర్‌లో తీసుకు వస్తే రూ.1500 కు తగ్గకుండా తీసుకుంటున్నారు. లారీలో అయితే ఒక్కో చోట ఒక్కో ధర వసూలు చేస్తున్నారు. దిగుమతి కూలీ వ్యవహారంలో ఒకే విధానం లేక పోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు. చాలా సందర్భాల్లో ఈ విషయంలో గొడవలు కూడా జరుగుతున్నాయి.

నేడు పాఠశాల పండుగ

- మెగా పీటీఎం 3.0కు విస్తృత ఏర్పాట్లు
- జిల్లాలో 1405 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహణ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం పేరిట నిర్వహిస్తున్న పాఠశాల పండుగకు సర్వం సిద్ధమైంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం పండుగ వాతావరణంలో మెగా పేరంట్స్ టీచర్స్ మీటింగ్(పీటీఎం) 3.0 కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ ఎలా ఉందనే అంశంతో పాటు పాఠశాలల్లో వసతులపై చర్చించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1405 ప్రభుత్వ పాఠశాలల్లో, 15 జూనియర్ కళాశాలల్లో శుక్రవారం పీటీఎం నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. 85,358 పాఠశాల విద్యార్థులు, 2,775 మంది కళాశాల విద్యార్థులు పీటీఎంలో భాగం కానున్నారు. పీటీఎం వేదికగా విద్యార్థుల హాజరు శాతంతో పాటు అసెస్‌మెంట్ నివేదికలు కూడా తల్లిదండ్రులకు అందించి వారు మరింత మెరుగుపడడానికి ఏం చేయాలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు చర్చించనున్నారు. అదే విధంగా తల్లిదండ్రుల సూచనలు, సలహాలు కూడా తీసుకుని దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోనున్నారు.



ముస్తాబవుతున్న సంతమాగులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల



మంత్రి రవికుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేయనున్న సైకిల్స్

జిల్లా స్థాయిలో ఇంకొల్లు జడ్పీ హైస్కూల్‌లో..

ఇంకొల్లు జడ్పీ హైస్కూల్ వేదికగా జరిగే జిల్లా స్థాయి పీటీఎంలో కలెక్టర్ వినోద్‌కుమార్ హాజరుకానున్నారు. మంత్రి రవికుమార్ సంతమాగులూరు ఉన్నత పాఠశాలలో, రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో పాటు ఎమ్మెల్యేలు పీటీఎంలో పాల్గొని విద్యార్థుల భవితపై చర్చించనున్నారు. ఈ కార్యక్రమం నిర్వహణ కోసం 27 లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారాన్ని సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కింద ప్రభుత్వం కోరింది. జిల్లా వ్యాప్తంగా 150 మంది వరకు ఇలా సహకారం అందించిన వారిని విద్యాశాఖ గుర్తించింది. వీరందరి చేత పీటీఎంలో మాట్లాడించి మరింత మంది సీఎస్ఆర్ కింద ముందుకొచ్చేలా ప్రేరణ కలిగించేలా ఈ వేదికను సద్వినియోగం చేసుకునేలా కూడా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది.

జాతీయ స్థాయి స్విమ్మింగ్‌లో కానిస్టేబుల్‌కు 15పతకాలు

- ఎస్పీ ఉమామహేశ్వర్ అభినందనలు



కానిస్టేబుల్‌కి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

బాపట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో బాపట్ల జిల్లాకు చెందిన కానిస్టేబుల్ 15మెడల్స్ సాధించాడు. జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్ నందు విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పి.నాగబ్రహ్మారెడ్డి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించిన 21వ నేషనల్ మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని 400మీటర్ల ఫ్రీస్టయిల్ స్విమ్మింగ్‌ను 6.44 నిమిషాల్లో పూర్తి చేసి మెడల్స్ సాధించాడు. అదేవిధంగా గతంలో తెలంగాణ, కర్ణాటక, గుజరాత, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని 15మెడల్స్ సాధించి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింప చేశారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో కానిస్టేబుల్ నాగబ్రహ్మారెడ్డిని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ మెడల్‌తో సత్కరించి ప్రశంసపత్రాన్ని అందజేసి అభినందించారు. కానిస్టేబుల్ బ్రహ్మారెడ్డిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు క్రీడా పోటీల్లో సత్తా చాటాలన్నారు.

పీజీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

ఏఎన్‌యూ డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, అనుబంధ ప్రభుత్వ కళాశాలల్లో ఏపీ పీజీ సెట్-2025 కౌన్సెలింగ్ అనంతరం కన్వీనర్ కోటా కింద ఎంఏ, ఎమ్మెస్సీ, ఎం.కామ్ తదితర కోర్సుల్లో ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లకు ఉన్నత విద్యాశాఖ అనుమతిచ్చింది. ఈ మేరకు ఏపీ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ జీవో నంబరు 230ను గురువారం జారీ చేశారు. ఏపీ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి కన్వీనర్ కోటా కింద ఖాళీ సీట్ల భర్తీపై రాసిన లేఖను పరిశీలించిన అనంతరం స్పాట్ ప్రవేశాలకు అనుమతిచ్చామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డీడీవోలతో సంక్షేమం చేరువ

- కార్యాలయ ప్రారంభోత్సవంలో కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేందుకు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీడీవో) కార్యాలయాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం వర్చువల్‌గా చిత్తూరు జిల్లా నుంచి ప్రారంభించగా బాపట్లలో శీలంవారిపాలెంలో డివిజినల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుపై నిత్యం పర్యవేక్షణకి డీడీవో కార్యాలయాలతో అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యాలయాలతో అభివృద్ధి పనుల పర్యవేక్షణ మరింత సమర్థంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పంచాయతీరాజ్ సహాయ సంచాలకులు పి.జనార్ధనరావు, డీపీవో ప్రభాకర్, బాపట్ల డీపీవో విజయలక్ష్మి, డ్వామా పీడీ విజయలక్ష్మి, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా, ఎంపీడీవో బాబురావు తదితరులు పాల్గొన్నారు.

9న అద్దంకిలో మెగా జాబ్‌మేళా

నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 9న అద్దంకిలో 12 కంపెనీలతో మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్‌డెవలప్‌మెంట్ జిల్లా అధికారి మాధవి, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, ఏడీఎస్‌డీ రవికిరణ్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ తదితరులు పాల్గొన్నారు



డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

వైభవంగా తమలపాకుల పూజ

అద్దంకి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా గురువారం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో లక్ష తమలపాకుల పూజ వైభవంగా జరిగింది. తమలపాకులతో పూజ అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గుంటూరుకు చెందిన న్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత శ్రీనివాసరావు, యశోధ దంపతులు ఈ పూజకు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, దేవాలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ తిమ్మానాయుడు పర్యవేక్షించారు. మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రదక్షిణ చేస్తున్న పూజారులు, ఉభయదాతలు

మలుపులో మరణాలు

- గాలిలో కలిసి పోతున్న ప్రజల ప్రాణాలు
- అత్యంత ప్రమాదకరంగా కారంచేడు-చీరాల మలుపు



ప్రమాద భరితంగా ఉన్న కారంచేడు - చీరాల రోడ్డులోని మలుపు

కారంచేడు(పర్చూరు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అసలే ప్రమాదకరంగా ఉన్న మలుపు.. ఆపై ఆక్రమణలు. దీంతో ఆ ప్రాంతం ప్రమాదాలకు.. మరణాలకు కేంద్రంగా మారింది. కారంచేడు నుంచి చీరాల వెళ్లే ప్రధాన రోడ్డు మలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. రోజురోజుకు రోడ్డు అంచులు ఆక్రమణలతో కుంచించుకుపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డు మలుపులో ఓ వైపు కట్టడాలు మరో వైపు ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. దీంతో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మలుపులో ఇప్పటికే పదుల సంఖ్యలో వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయారు గడిచిన నెల వ్యవధిలో ఓ ఆటోను లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా పలువురికి తీవ్రగాయాలయ్యాయి. బైక్‌పై వెళ్తూ జరిగిన ప్రమాదంలో కారంచేడు గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందగా, మనమడికి తీవ్రగా యాలయ్యాయి. ఇలాంటి సంఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నా కనీసం ప్రమాద నివారణ చర్యలు చేపట్టక పోవడంపై పలు విమర్శలు నెలకొంటున్నాయి.



మలుపులో ఆటోను లారీ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన (ఫైల్ ఫొటో)

216 హైవే విస్తరించాలని వినతి

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరిని కోరిన ఎంపీ తెన్నేటి



కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరితో ఎంపీ కృష్ణప్రసాద్

బాపట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో వెళ్తున్న 216 జాతీయ రహదారిని నాలుగు వరసలుగా విస్తరణకు చర్యలు తీసుకోవాలని లోక్‌సభ ప్యానల్ స్పీకర్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరిని కోరారు. ఈ మేరకు గురువారం కేంద్రమంత్రికి ఎంపీ వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరణాత్మక నివేదిక తయారీ కోసం వెంటనే కన్సల్టెంట్‌ను నియమించాలని కోరారు. జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతమైతే ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగు పడటంతోపాటు ఆర్థికాభివృద్ధికి, తీరప్రాంత పర్యాటకానికి సహకరిస్తుందని కేంద్రమంత్రికి వివరించారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెన్నేటి తెలిపారు.

వెదుళ్లపల్లిలో బధిరులకు డిగ్రీ కళాశాల

- ప్రభుత్వం ఆధ్వర్యంలో మొదటగా ఏర్పాటు
- సీఎం చంద్రబాబు ప్రకటనపై సర్వత్రా హర్షం

బాపట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాలలో బధిరుల కోసం ప్రభుత్వం ఆధ్వర్యంలో తొలిగా బాపట్ల మండలం వెదుళ్లపల్లిలో ఏర్పాటు కానున్నది. విజయవాడ, హైదరాబాద్‌లో ప్రైవేటుగా కళాశాలలు ఉన్నాయి. కాగా బాపట్లలో ప్రత్యేకంగా ప్రభుత్వమే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతున్నది. వెదుళ్లపల్లిలో దశాబ్దాలుగా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బధిరుల ఆశ్రమ పాఠశాల, జూనియర్ కళాశాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ బాపట్ల, పొదిలి, కనిగిరి, విజయవాడ, విజయనగరం, భీమవరం తదితర ప్రాంతాలకు చెందిన వారు ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంటున్నారు. పాఠశాలలో 94 మంది, కళాశాలలో 50 మంది విద్యార్థులు ఆశ్రయం పొంది విద్యను అభ్యసిస్తున్నారు. ఇంటర్మీడియట్ తర్వాత ఆర్థిక స్థోమత ఉన్నవారు ప్రైవేట్ కళాశాలలకు వెళుతుండగా లేనివారు ఇంటర్మీడియట్‌తో చదువును ఆపేస్తున్నారు. ఈ క్రమంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బధిరులకు డిగ్రీకళాశాల ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.



వెదుళ్లపల్లిలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల

రేపు కోటప్పకొండలో ఆరుద్రోత్సవం

- తరలి రానున్న మాలధారులు
- విశేష అభిషేకాలకు విస్తృత ఏర్పాట్లు


కోటప్పకొండ(నరసరావుపేట), డిసెం బరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామికి ఆరుద్రోత్సవం శనివారం అత్యంత ఘనంగా జరగనుంది. ఇందుకు ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. త్రికోటేశ్వర స్వామిని మేధా దక్షిణామూర్తిగా భక్తులు కొలుస్తారు. కోటి వరాల దీక్ష కోటప్పకొండ దీక్ష అనే సంకల్పంతో మాలను ధరిస్తారు. కోటప్పకొండలో 1981 నుంచి కోటయ్య స్వామి మాలధారణ ప్రారంభమైంది. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు కోటప్ప మాలను ధరించి 41 రోజులు మండల దీక్షను భక్తిశ్రద్ధలతో చేపడ తారు. అయ్యప్ప స్వాముల వలె కోటయ్య మాల ధారులు ఇరుముడితో కొండకు చేరుకుంటారు. ఆరుద్రోత్సవం సందర్భంగా కోటయ్య స్వామికి స్వాములు ఇరుముడి సమర్పించి ప్రత్యేక పూజ లు చేస్తారు. ఇరుముడిని స్వాములు తలపై ధరించి నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల నుంచి కొందరు స్వాములు పాదయాత్రగా కోటప్పకొండ చేరుకుంటారు.



త్రికోటేశ్వర స్వామి మూల విరాట్

విశేషంగా అభిషేకాలు

కోటప్పకొండలో ఆరుద్రోత్సవం సందర్భంగా స్వా మికి వివిధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహి స్తారు. జ్యోతి దర్శనం అనంతరం త్రికోటేశ్వర స్వా మికి మహన్యాస పూర్వక మహారుద్రాభిషేకం జరగ నుంది. వీభూది, గంధం, కుంకుమ, పంచదార, వివిధ రకాల ఫలాలు, శుష్క ఫలాలు, ఆవు నెయ్యి, పెరుగు, తేనె, పాలు తదితర ద్రవ్యాలతో స్వామికి ఘనంగా అభిషేకాలు నిర్వహిస్తారు. తదుపరి స్వా మికి అన్నాభిషేకం చేస్తారు. అర్ధరాత్రి నుంచి ఆల యంలో మహన్యాస పూర్వక మహా రుద్రాభిషే కాలు జరగనున్నాయి. అభిషేకాల అనంతరం స్వా ములు మాల ధారణలు విరమిస్తారు. ఆదివారం ఉదయం గంటలకు యాగశాలలో లక్ష్మీగణపతి, రుద్ర, శాంతి, వాస్తు హోమాలు నిర్వహిస్తారు. స్వాములకు ప్రసాదం, భోజన సౌకర్యాలు ఆలయ ప్రాంగణంలో దాతలు తాళ్ల వెంకట కోటిరెడ్డి, అల్లు రమేష్, జయరామిరెడ్డి సహకారంతో ఏ ర్పాటు చేయనున్నారు. ఏర్పాట్లను ఈవో డి.చంద్రశేఖర రావు పర్యవేక్షిస్తున్నారు.



త్రికోటేశ్వర స్వామి ఆలయం

అద్దంకిలో.. మద్యం వార్

- అక్రమ మద్యం అమ్మకాలపై నిరసనాగ్రహం
- నాలుగు రోజులుగా బార్ మూత.. ఎక్సైజ్‌స్టేషన్‌లో తాళాలు

అద్దంకి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అద్దంకిలో మద్యం వార్ సాగుతుంది. రెస్టారెంట్లు, దాబాలలో మద్యం అక్రమ అమ్మకాలకు నిరసనగా నాలుగు రోజుల క్రితం అద్దంకిలోని బార్‌ను నిర్వాహకులు మూసివేశారు. మద్యం అక్రమ అమ్మకాలు నిలిపే వరకు బార్‌ను తెరిచేది లేదని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి పోవటంతో గురువారం ఒంగోలు నుంచి ఎక్సైజ్ విజిలెన్స్ అధికారులు అద్దంకి వచ్చారు. ఈ నేపథ్యంలో తనిఖీలకు వచ్చిన అధికారుల తీరును నిరసిస్తూ అద్దంకిలోని బార్ నిర్వాహకులకు సంఘీభావంగా అద్దంకిలోని మూడు, తిమ్మాయపాలెంలోని ఓ మద్యం షాపులను మూసి వేసిన నిర్వాహకులు తాళాలను అద్దంకి ఎక్సైజ్ కార్యాలయంలో అప్పగించారు. విచారణకు వచ్చిన అధికారి తమను బెదిరించడంతో షాపులు మూసివేసినట్లు నిర్వాహకులు చెబుతుండగా, ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేసి యజమానులతో సమావేశం నిర్వహించేందుకు తాము వచ్చినట్లు తెలిపారు. అయితే స్థానిక అధికారులు ఉదాసీనత వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కొందరు అధికారులు మద్యం షాపుల నిర్వాహకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో మద్యం షాపుల నిర్వాహకుల మధ్య వార్ నెలకుని షాపులు మూసి వేసి నిరసన తెలిపే వరకు వచ్చినట్లు తెలుస్తుంది.



అద్దంకిలోని శింగరకొండ రోడ్డులో మూసి ఉన్న రెస్టారెంట్ అండ్ బార్

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


గాయపడిన గిరి

సింగరాయకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ నుంచి కందుకూరు వెళ్తున్న పల్లెవెలుగు ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటన స్థానిక బాలియోగినగర్ కూడలిలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ చాకిచర్లపట్టపుపాలెంకు చెందిన సున్నపు గిరి కందుకూరు నుంచి సింగరాయకొండ వస్తున్న క్రమంలో బాలయోగినగర్ కూడలి వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో బస్సు ముందు టైరుకింద బైక్ పడింది. దీంతో గిరి ఎడమకాలుకి తీవ్రగాయమైంది. క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

లారీ ఢీకొని వృద్ధుడు దుర్మరణం

నాగులుప్పలపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఉప్పుగుండూరులోని రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా చిన్నగంజాం గ్రామానికి చెందిన ఉప్పుగుండూరు వెంకటేశ్వర్లు (65) గతకొంత కాలం నుంచి ఉప్పుగుండూరు గ్రామంలోని సుబ్బయ్య హోటల్ ఎదురుగా జాతీయ రహదారి పక్కనున్న బస్‌షెల్టర్‌లో ఉంటున్నాడు. గురువారం తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న వెంకటేశ్వర్లును లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

రూ. 20 ఇస్తే.. పాస్

(5వ పేజీ తరువాయి)

వివరాలు నిర్ధారించకపోతే సీసీఐ కేంద్రంలోకి ప్రవేశించే అవకాశం ఉండదు. రైతుల ఇటువంటి అవసరాన్ని ఆధారం చేసుకొని క్వింటాల్‌కు రూ. 20 ఇస్తేకానీ, పత్తి లోడ్‌ను పాస్ చెయ్యమని సిబ్బంది తెగేసి చెబుతున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. వే బ్రిడ్జి బరువు ఆధారంగా నగదు ముందే వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ లెక్కన ప్రతి రైతు కనీసం రూ. 200 నుంచి రూ.400 వరకు చెల్లించి లోపలికి వెళ్లాల్సి వస్తుందని అంటున్నారు. గతంలో కూడా ఇదే వ్యవహారంపై దుమారం రేగింది. మార్కెటింగ్ సిబ్బంది చేస్తున్న వసూళ్ల దందాపై ఒక వ్యక్తి రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్‌కి ఫిర్యాదు చేశారు. ప్రతి సంవత్సరం ఈ విధానంలో భారీ మొత్తంలో వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

రూ. 20 అంటే సామాన్యం కాదు

సీసీఐ కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి క్వింటాల్ పత్తికి రూ. 20 వసూలు చేస్తున్నారన్నది చిన్న విషయంగా తోచినా.. సీజన్ మొత్తంలో అది పెద్ద మొత్తం గానే కనిపిస్తుంది. ఉదాహరణకు గతేడాది ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 9.50 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. అప్పుడు కూడా క్వింటాల్‌కు రూ. 20 వసూలు చేసినట్లు పలువురు మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ లెక్కన గత ఏడాది సుమారుగా రూ. 1.90 కోట్లు వసూలు చేసినట్లు స్పష్టం అవుతుంది. ఇలా వసూలు చేసే సొమ్ము ఆ శాఖ లోని కీలకమైన వారి వద్దకు చేరుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. అందువల్ల ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అవి బుట్టదాఖలు అన్నట్లుగానే ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమాజానికి ఉపయోగపడేలా యువత ఆలోచనలు ఉండాలి

కలెక్టర్ రాజాబాబు


విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నేటి యువత ఆలోచనలు, మేధో సంపత్తి సమాజంలో నెలకొన్న సమస్యలకు పరిష్కార దిశగా ఉండటంతో పాటు మేలు చేకూర్చేలా ఉండాలని కలెక్టర్ పీ రాజాబాబు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో గురువారం ట్రిపుల్‌ఐటి, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన ఐడియా టు ఇంపాక్ట్ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ముందుగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నమూనాలను కలెక్టర్ తిలకించడంతో పాటు ప్రాజెక్టు చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ యువత వినూత్న ఆలోచనలు, మేధో సంపత్తిని, ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించేందుకు జిల్లాలో ఐడియా టు ఇంపాక్ట్ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. పలువురు విద్యార్థులు స్వీయ నియంత్రణతో నీటిట్యాంకు నింపే వ్యవస్థ, స్మార్ట్ నీటి భద్రత, వ్యాధి హెచ్చరిక వ్యవస్థ, టచ్‌లెస్ స్మార్ట్ డస్ట్‌బిన్, వాయిస్ నియంత్రిత వీల్ చైర్, రియల్ టైమ్ లోకేషన్, అత్యవసర హెచ్చరికలతో కూడిన కాంపాక్ట్, మహిళా భద్రత పరికరం లాంటి నమూనాలను రూపొందించడం అభినందనీయమన్నారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త అనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకుపోతున్నారని, వారి ఆలోచనలకు అనుగుణంగా యువత కూడా నడుచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డీవీఆర్ మూర్తి, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రవితేజ, విద్యుత్ శాఖ ఎస్‌ఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పశుగణాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


గోకులం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పశుగణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేస్తూ పాడి రైతులకు చేయూత అందిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. మండల పరిధిలోని తాళ్లూరు గ్రామంలో గురువారం గోకులం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా కనిగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో 6 కోట్ల 28 లక్షల రూపాయల వ్యయంతో 314 గోకులం షెడ్ల ఏర్పాటుకు రైతులకు సబ్సిడీపై రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు పాడి పరిశ్రమ ద్వారా ఆర్థిక పురోగతి చెందాలనే సంకల్పంతో ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధిహామీ పథకం కార్యాలయంలో పాడి రైతులు తమ పేర్లను నమోదు చేసుకుని రుణాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కొండా కృష్ణారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, బాలు ఓబులరెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, నారపరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు అధికారులు సహకరించాలి

నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు సత్వర సుపరిపాలనే లక్ష్యంగా తాను చేస్తున్న కృషికి ప్రభుత్వాధికారులు సహకారాన్ని అందించాలని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి కోరారు. ఇటీవల ఉపాధి హామీ పథకం కార్యాలయాన్ని ఆధునికీకరించి డీఎల్‌డీవో కార్యాలయంగా రూపుదిద్దారు. గురువారం ఆయా కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద మంత్రోచ్చరణలతో స్వాగతం పలికారు. డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీవో అబ్దుల్ ఖాదర్, జడ్పీటీసీ సభ్యుడు కస్తూరిరెడ్డి, ఎంపీపీ ప్రకాశం పాల్గొన్నారు.

మార్కాపురం అభివృద్ధిని ఎవరూ ఆపలేరు

విమర్శలు చేసేవారికి ప్రజలే బుద్ధిచెబుతారు

ఎమ్మెల్యే నారాయణరెడ్డి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం అభివృద్ధిని ఎవరూ ఆపలేరని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక 27వ వార్డులోని దత్తసాయి గుడి వద్ద గురువారం రాత్రి మార్కాపురం జిల్లాకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం జరిగిన కృతజ్ఞతా సభలో ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ జిల్లా ప్రకటనతో మార్కాపురం స్వరూపం పూర్తిస్థాయిలో మారిపోనుందని అన్నారు. ఇక్కడికి పలు ప్రతిష్టాత్మక సంస్థలు రానున్నాయన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా పెరగనున్నాయన్నారు. ఒకప్పుడు మార్కాపురం స్థాయిలోదే ఒంగోలు అన్నారు. కానీ, జిల్లా ఏర్పాటు అయిన తర్వాత ఒంగోలు స్వరూపం మారిపోయిందన్నారు. ఇప్పటికే పలు వైద్యశాలలు, విద్యాసంస్థలు మార్కాపురం వచ్చేందుకు భూములు కూడా కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందడం ఇష్టంలేని ప్రతిపక్ష వైసీపీ నాయకులు అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారన్నారు. వచ్చే సంవత్సరం వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే మార్కాపురం జిల్లా సుభిక్షంగా మారుతుందన్నారు. అభివృద్ధిని చేసేవాళ్లు ఎవరో, అడ్డుకునేది ఎవరో ప్రజలు గమనిస్తున్నారన్నారు. వారే భవిష్యత్తులో ప్రతిపక్షానికి సరైన బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్, కౌన్సిలర్లు కశ్శెట్టి నగేష్, చిన్న షెక్షావలి, టీడీపీ పట్టణ యూత్ అధ్యక్షుడు దొడ్డా దర్గేష్‌రెడ్డి, యలమంద తదితరులు పాల్గొన్నారు.

పవర్ ఆఫ్ అటార్నీ తీసుకొని మోసం

ఒంగోలుకు పిలిచించి పెద్దిరెడ్డి దౌర్జన్యం


మాట్లాడుతున్న మహిళలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం టీడీపీ నాయకుడు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి పవర్ ఆఫ్ అటార్నీ తీసుకొని తమను మోసం చేశాడని నెల్లూరుకు చెందిన మహిళలు మంచికలపాటి అనిత, కడప కామేశ్వరిలు ఆరోపించారు. తమను ఒంగోలుకు పిలిచించి దాడి చేశారన్నారు. స్థానిక ఎంసీఏ భవన్‌లో గురువారం వారు మాట్లాడారు. పేర్నమిట్ట సర్వే నెంబరు 148/1లో తమకు హక్కు లేని 1.04 ఎకరాల భూమికి సంబంధించి తమను ప్రలోభపెట్టి సూర్యప్రకాష్‌రెడ్డి పవర్ ఆఫ్ అటార్నీ తీసుకున్నారన్నారు. ఒంగోలు రిజస్ట్రర్ ఆఫీసులో ఈ డాక్యుమెంట్ కింద మరో డాక్యుమెంట్ పెట్టి తమ సంతకాలు తీసుకున్నారని చెప్పారు. తమ ఇద్దరి కుమార్తెలకు చేరో కోటి రూపాయల చొప్పున డబ్బులు ఇస్తానని చెప్పి తమ పెద్ద కుమార్తె పెళ్లికి కూడా డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. 148/1లో తమకు హక్కు లేకపోయినా తాను అధికారపార్టీ నాయకుడినని, అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కు బంధువునని బెదిరించి 2021లో మూడు లక్షల రూపాయలు ఇచ్చి పవర్ ఆఫ్ అటార్నీ తీసుకున్నాడన్నాడని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యుడైన సూర్యప్రకాష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


రైలులో గంజాయి పట్టుకున్న ఈగల్ టీమ్

పూరీ ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి పట్టివేత

6.5 కిలోలు స్వాధీనం

చెన్నైకు చెందిన వ్యక్తి అరెస్టు

ఒంగోలు క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : పూరీ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించి 6.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని చెన్నైకి చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఈగల్ టీమ్ సీఐ సుధాకర్ చెప్పారు. గురువారం ఈగల్ టీమ్, రైల్వే పోలీసులు కలిసి రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. గంజాయి ఉన్న బ్యాగ్‌ను గుర్తించి అందుకు సబంధించి చెన్నైలోని కరూర్ జిల్లాకు చెందిన పి.రమేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణ నిమిత్తం గంజాయితోపాటు నిందితుడు రమేష్‌ను రైల్వే పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. తనిఖీలలో ఎస్సైలు చెంచయ్య, సుదర్శన్, శివరామయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

చేకూరపాడు పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు


ఎంపీడీవో రవికుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ రమేష్‌బాబు

నాగులుప్పలపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల నగదులో కోత విధించి ఎలాంటి అధికారిక ధృవీకరణ లేకుండా రశీదులు ఇచ్చి ఇంటిపన్నులకు జమచేసిన పంచాయతీ కార్యదర్శి సీహెచ్.పద్మావతిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని చేకూరపాడు సర్పంచ్ కొమ్మినేని రమేష్‌బాబు కోరారు. ఈమేరకు గురువారం స్థానిక ఎంపీడీవో తేళ్ల రవి కుమార్, జిల్లా ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి పన్నులను స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా డిజిటల్ లావాదేవీలు చేయాలని ఆదేశించిందని, కానీ తమ పంచాయతీ కార్యదర్శి అందుకు విరుద్ధంగా ప్రవర్తించారని చెప్పారు. పింఛన్ల పంపిణీ సమయంలో పలువురు లబ్ధిదారులకు నగదు పూర్తిగా అందించకుండా ఇంటిపన్నులకు నగదు జమ చేసుకొంటున్నట్లుగా చెబుతూ ఎలాంటి రశీదులు ఇవ్వలేదన్నారు. గతంలోనూ కార్యదర్శి పద్మావతి తీరుపై మండల సర్వసభ్య సమావేశంలో పన్నుల వసూలులో ప్రశ్నించానని, మరోమారు నిబంధనలు పాటించకుండా ఇంటిపన్నులు వసూలు చేయడం, పాలకవర్గ సమావేశాలు సైతం నిర్వహించకుండా గ్రామాభివృద్ధిని గాలికివదిలేసి తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కార్యదర్శిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

శాఖ గ్రంథాలయంలో జిల్లా కార్యదర్శి తనిఖీ

చినగంజాం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శాఖా గ్రంథాలయం చినగంజాంను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శివారెడ్డి గురువారం వార్షిక తనిఖీ నిర్వహించారు. గ్రంథాలయంలోని పుస్తక ర్యాకులను, రికార్డులను పరిశీలించారు. ర్యాకులలో ఏర్పాటు చేసిన పుస్తకాలు డ్యూయి దశాంశ వర్గీకరణలో ఉండడాన్ని ఆయన చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్య పెంచాలని అన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి ఆయన పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ గ్రంథపాలకులు ఎ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు, పాఠకులు పాల్గొన్నారు.

కేసుల రాజీకి జాతీయ లోక్ అదాలత్ ఎంతో ఉపయుక్తం


మాట్లాడుతున్న న్యాయాధికారులు కిషోర్‌కుమార్, బాలాజీలు

మార్కాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇరు వర్గాలు పరస్పర అంగీకారంతో కేసులను రాజీ చేసుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ ఎంతో ఉపయుక్తమని మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ న్యాయాధికారి జె.కిషోర్‌కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.బాలాజీలు అన్నారు. స్థానిక కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాతీయ లోక్ అదాలత్‌పై పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు కక్షలు వీడి సామరస్య పూర్వకంగా వారి కేసులను రాజీ చేసుకునేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. పల్లె సీమల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ ఎంతో విలువైన సమయాన్ని వృథా చేసుకున్నవారవుతారన్నారు. అంతేకాక కోర్టులపై కూడా భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అవీఇవీ

నేడు మంత్రుల పర్యటన

సంతమాగులూరు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సంతమాగులూరులో సుమారు రూ.2 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ సచివాలయం భవనాలను శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు ప్రారంభించనున్నారు. ఉదయం 10:30 గంటలకు 1.66 కోట్ల రూపాయలతో నిర్మించిన సంతమాగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం, 11:30 గంటలకు రూ.46 లక్షలతో నిర్మించిన గ్రామసచివాలయ భవనాన్ని మంత్రులు సత్యకుమార్‌యాదవ్, రవికుమార్ లు ప్రారంభించనున్నారు. అనంతరం మధ్యహ్నం 12 గంటలకు సంతమాగులూరులోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయనున్నారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో గురుశంకర్

పెద్దారవీడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని మొదటి రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కె.గురుశంకర్‌కు స్థానం లభించింది. స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ విడుదల చేసిన సంయుక్త గ్లోబల్ ర్యాంకింగ్‌లో కిట్స్‌లో హ్యూమనిటీస్ అండ్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గురుశంకర్ ప్రపంచంలోని టాప్ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో స్థానం దక్కించుకున్నారు. రసాయన శాస్త్రంలో ఇనార్గానిక్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ రంగాల్లో గురుశంకర్ చేసిన పరిశోధనల ప్రభావం, హెచ్ ఇండెక్స్ , ఉపరంగ ర్యాంకులు వంటి అంతర్జాతీయ మెట్రిక్స్ ఆధారంగా ఈ గుర్తింపు లభించింది. డాక్టర్ గురుశంకర్‌ను కళాశాల కార్యదర్శి అన్నా కృష్ణచైతన్య, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

కార్మిక సంఘాల మహాసభలు జయప్రదం చేయండి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

వేటపాలెం(చీరాల), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులో ఈ నెల 8, 9 తేదీలలో నిర్వహించనున్న ఏఐఎఫ్‌టీయూ(న్యూ) అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ప్రతినిధులు కోరారు. గురువారం వేటపాలెం మండలం ఆనుమల్లిపేటలో అందుకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న హక్కులను లేబర్ కోడ్‌లతో కాలరాస్తున్నట్లు చెప్పారు. కార్మికుల శ్రమ దోపిడి ఎంతమాత్రం సబబు కాదని ఈక్రమంలో తలపెట్టిన సభలను జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, పింజల భూషణం, సుబ్రహ్మణ్యం, రంగనాథ్, రమేష్, ధవళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో రోశయ్యకు అత్యున్నత స్థానం

- ఘనంగా మాజీ గవర్నర్‌ను ఘన నివాళి


రోశయ్య విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న మహేంద్రనాథ్

చీరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రజల హృదయాల్లో మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్యకు అత్యున్నత స్థానం ఉందని, ఆయన సమర్థవంతమైన నాయకులని నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాధ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో ఘనంగా రోశయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏంజీసీ మార్కెట్ వద్దగల ఆయన విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చీరాలకు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఉమ్మడి తెలుగు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, ఆర్థిక శాఖామంత్రిగా పనిచేయడంతో పాటు తమిళనాడు గవర్నర్‌గా అందరి మన్ననలు పొందినట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, పట్టణ అధ్యక్షులు సురేష్, నాగేంద్రమణి పలువురు నాయకులు కార్యకర్తలు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

అన్నదానానికి బియ్యం అందజేత

అద్దంకిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సేవాస్ఫూర్తి కమిటీ తరఫున అయ్యప్ప స్వాముల అన్నదాన కార్యక్రమానికి బియ్యంను గురువారం అందజేశారు. శింగరకొండలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ట్రెజరర్‌గా పని చేస్తున్న తమ బ్యాచ్ మిత్రుడు శ్రీరామ్ రామలింగేశ్వరరావు అభ్యర్థన మేరకు అయ్యప్ప గుడిలోని స్వాముల అన్నదానానికి 25 కేజీల 11 బస్తాలను గుడికి అందజేశారు. గత 10 ఏళ్ల నుండి పూర్వ విద్యార్థులు, మిత్రుల సాయం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని కమిటి ప్రధాన కార్యదర్శి జ్యోతి రమేష్‌బాబు తెలిపారు. దీనిలో భాగంగానే మిత్రులు కుమ్మరపల్లి రామసుబ్బారావు, గార్లపాటి మురళీకృష్ణ, కమిటి అధ్యక్షుడు దామా వెంకటేశ్వర్లు, మోహన్న వర్మ, ఉపాధ్యాక్షుడు నేరేళ్ల శ్రీనివాసరావు, సైదులుల ఆర్థిక సహకారంతో అయ్యప్ప స్వాముల అన్నదానానికి బియ్యంను అందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో గోరంట్ల నరహరి, బెల్లం రాజేష్, బత్తుల పురుషోత్తం పాల్గొన్నారు.

దివ్యాంగులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి


దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎంలు

చినగంజాం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులను ప్రేమతో ఆదరిస్తూ వారిలోని నైపుణ్యాలను బయటకు తీసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో-1 బి.అజయ్‌బాబు, చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్.ఎం కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డిలు అన్నారు. చినగంజాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, తల్లిదండ్రులు మధ్య కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్.ఎం. మాట్లాడుతూ దివ్యాంగులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమగ్ర శిక్ష ద్వారా ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను, వాటి ద్వారా అందించే సౌకర్యాలు, సదుపాయాలు, అలవెన్సులు, ఉపకరణాలు తదితర వాటిని ఉపయోగించుకోవాలని అన్నారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు ఎంఈవో, హెచ్‌ఎంలు బహుమతులు అందజేశారు. దాతలు టి.ముసలయ్య, గోవిందస్వామిలు విద్యార్థులకు టీఎల్ఎం మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్.ఎం. ఎం.వెంకటేశరరావు, భవిత కేంద్రం ఐఈఆర్‌పీఎస్‌లు టి.బాలకృష్ణ, డి.నాగార్జున, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఎం.కోటిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, ఆయా, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

అనుమతుల్లేని హోర్డింగ్‌లకు చెక్

● నూతన మార్గదర్శకాలు అందజేసిన అధికారులు

చీరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో అనుమతుల్లేని వ్యాపార, వాణిజ్య సముదాయాల హోర్డింగ్‌లకు ఇక చెక్ పడనుంది. ప్రచారాల హోర్డింగ్‌లకు సంబంధించి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలు నూతన మార్గదర్శకాలను జారీ చేశాయి. ఈక్రమంలో ఇకపై పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కచ్చితంగా అనుమతులు పొందాల్సిందిగా హెచ్చరిస్తున్నారు. ఏజెన్సీలు అనుమతులు ధిక్కరిస్తే రూ.50 వేలు అపరాధ రుసుము విధించేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. సాధారణంగా ఏటా మార్చిలో ఏడాది పాటు ఆయా ఏజెన్సీల ద్వారా హోర్డింగ్‌ల నిర్వహణ చేపడతారు. అయితే కొంతమంది వ్యక్తులు నిబంధనలు గాలికి వదిలి ఇబ్బడిముబ్బడిగా నిర్వహణ సాగిస్తుంటారు. అయితే ప్రభుత్వం తీసుకున్న నూతన విధానాలతో చాలావరకు అన్యాక్రాంతం జరిగే వీలు లేకుండా చెక్ పడనుంది. చీరాల పట్టణంలో ఇప్పటివరకు ఏజెన్సీల ద్వారా 76 హోర్డింగ్‌లు ఉన్నాయి.వాటిల్లో 25 నివాసాలపైన, 51 రహదారుల వెంబడి ఉన్నాయి. ఇవన్నీ ప్రస్తుతం అనుమతుల పరిధిలోనే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న నూతన విధానాలతో కొంతవరకు ప్రభుత్వానికి ఆదాయంచేకూరే అవకాశం కూడా ఉంది.

నేటి నుంచి అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీలు



వివరాలను తెలియజేస్తున్న కళాశాల పీడీ సుశీలమ్మ

అద్దంకిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా అనుబంధ ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం క్రీడల యాజమాన్యం ఈ నెల 5, 6వ తేదీలల్లో అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ టి. సుశీలమ్మ తెలిపారు. గురువారం పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. పోటీలకు చైర్మన్‌గా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహనరావు వ్యహరిస్తారన్నారు. ఈ పోటీలలో వి శ్వ విద్యాలయం అనుబంధ కళాశాలల బృందాలు పాల్గొంటాయన్నారు. గెలుపొందిన మొదటి మూడు టీంలకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందిస్తారన్నారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచిన అన్ని టీమ్‌లలోని క్రీడాకారులను ఎంపిక చేసి యూనివర్శిటీ టీంను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీలలో కాకినాడలో జరిగే సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు పంపించనున్నట్లు ఆమె తెలిపారు. పోటీలలో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులకు కళాశాలలో అన్ని వసతులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయా కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు , సిబ్బంది పాల్గొన్నారు

అద్దంకి డీఎంగా రామ్మోహనరావు బాధ్యతలు


బెల్లం రామ్మోహనరావు

అద్దంకి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ఆర్టీసీ డిపోమేనేజర్‌గా బెల్లం రామ్మోహనరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొరిశపాడు మండలం తిమ్మనపాలేనికి చెందిన రామ్మోహనరావు రెండుసార్లు అద్దంకి డిపో మేనేజర్‌గా పని చేశారు. రెండు నెలల క్రితం పుట్టపర్తి డిపోకు బదిలీ అయ్యారు. వచ్చే ఏడాది ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో రామ్మోహనరావు మరలా అద్దంకి డిఎంగా వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు స్త్రీశక్తి పథకం మరింత గా వినియోగించుకునేందుకు గ్రామీణ బస్ సర్వీసులు పెంచనునట్లు తెలిపారు. కార్మికులు, సిబ్బంది సహకారంతో అద్దంకి డిపోను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయనున్నట్లు వివరించారు.

ముందు జాగ్రత్తలతో రోగాల నియంత్రణ


వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యాధికారులు, అధికారులు

అద్దంకిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వాటిని ఎదుర్కోవచ్చని యూపిహెచ్‌సీ సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎం.హేమమాధురి సూచించారు. గురువారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్-11 విభాగం ఆధ్వర్యంలో శింగరకొండపాలెంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ వైద్యశిబిరానికి డాక్టర్ హేమ మాధురి, మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జగదీష్, సీహెచ్‌సీ దంతవైద్యులు డాక్టర్ జి.నర్సిలు హాజరై రోగులను పరీక్షించారు. గ్రామాల్లో పారిశుద్యం మెరుగుకు తగుచర్యలు తీసుకోవడంతో పాటు తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోగులకు మందులను పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు క్యాంప్‌లో ప్రజలకు సహాయ సహకారాలు అందించారు. కార్యక్ర మంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్. షర్మిలారాణి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రాజశేఖర్, అధ్యాపకులు వేటి ప్రసాద్, వి. రామకృష్ణ పాల్గొని పర్యవేక్షించారు.

బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన


సూచనలు చేస్తున్న జీసీడీవో చారులత

బల్లికురవ, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సులోనే బాలికలకు బాల్య వివాహాలు చేయకుండా తల్లి దండ్రులకు అవగాహన కార్యక్రమం చేసేలా అన్ని ఏర్పాట్లు చేశామని సమగ్ర శిక్ష జీసీడీవో చారులత తెలిపారు. గురువారం బల్లికురవలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జీసీడీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమె ఉపాధ్యాయులతో మాట్లాడారు. శుక్రవారం జరిగే మెగా పేరేంట్స్ మీటింగ్‌లో విద్యార్థినుల తల్లిదండ్రులకు బాల్య వివాహాల వలన కలుగు నష్టాల గురించి తెలియజేయాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక నాటికల ద్వారా కార్యక్రమంపై వివరించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరళకుమారి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయళ్లు అరెస్ట్

చినగంజాం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మసీదుపేట సమీపంలోని స్మశానం దగ్గర పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురుని అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్.ఐ శీలం రమేష్ గురువారం తెలిపారు. వారి వద్ద నున్న రూ.3200లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

శిథిలావస్థలోని దేవాలయాలకు పునర్జీవం

● పురాతన దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు ● అందిపుచ్చుకోవడంలో ప్రజాప్రతినిధుల చొరవ

బల్లికురవ, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధికి ప్రజాకూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. సీజీఎఫ్ (కామన్ గుడ్ ఫండ్) నుంచి నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది.

బల్లికురవలోని పురాతన అంజనేయస్వామి దేవాలయం రామాలయాలు జీర్ణావస్థకు చేరాయి. గతంలో కురిసిన వర్షాలతో ఈ రెండు దేవాలయాల గోడలు పగుళ్లిచ్చి పడిపోయేలా ఉన్నాయి. దీంతో భక్తులు కొంత కాలం నుంచి దేవాలయం వద్దకు కూడా వెళ్లడం లేదు. దీంతో దేవాదాయ శాఖ కింద ఉన్న ఈ రెండు దేవాలయాలను అభివృద్ధి పరచాలని భక్తులు కొంత కాలం నుండి ప్రభుత్వానికి విన్నపాలు చేస్తున్నారు. మంత్రి గొటిపాటి రవికుమార్‌ను గ్రామ పెద్దలు ఇటీవల దేవాలయాల వివరించారు. ముందగా గ్రామస్థులు రూ. 50 లక్షల విరాళాన్ని బ్యాంకు ఎకౌంట్‌లో వేయాలని తదుపరి ప్రభుత్వం దేవాలయ నిర్మాణానికి అవసరమైన మెత్తం నగదును మంజరు చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు సుమారు రూ. 40 లక్షల మేర ఇప్పటికే విరాళాలు సేకరించి దేవాలయం పేరుపై బ్యాంకులో జమ చేశారు. ప్రభుత్వం రెండు రోజుల క్రితం సీజీఎఫ్ నిధుల కింద మరో రూ.కోటి మంజురు చేసింది. మెత్తం రూ. 1. 50 కోట్లతో శిధిలావస్థలో ఉన్న రామాలయం, అంజనేయస్వామి దేవాలయాల పునఃనిర్మాణ పనులు చేపట్టను న్నారు. పాత దేవాలయాలను తొలగించి అక్కడే నూతన దేవాలయాలను నిర్మించేలా దేవాదాయ శాఖ అధికారుల ద్వారా సన్నాహాలు చేస్తున్నారు. తాము కోరిన వెంటనే నిధులు మంజూరు చేయించిన మంత్రి రవికుమార్‌కు పలువురు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.


జీర్ణావస్థలోని ఆంజనేయస్వామి దేవాలయం


బల్లికురవలో శిథిలావస్థలో ఉన్న రామాలయం

మార్టూరు : నియోజకవర్గంలోని 7 దేవాలయాల పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.8.40 కోట్లు సీజీఎఫ్ నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్రదేవాదాయశాఖ కమిషనర్ సీజీఎఫ్ నిధులు(కామన్ గుడ్‌ఫండ్) నుంచి మంజూరుచేస్తూ ఉత్తర్యులు జారీ చేశారు. దీంతో 7 దేవాలయాలకు మంజూరైన నిధులతో ప్రత్యేకంగా ఆలయాల అభివృద్ధి పనులు చేయనున్నారు. తద్వారా దేవాలయాలు కొత్త శోభను సంతరించుకోనున్నాయి. నిధులు మంజూరైన దేవాలయాల పరంగా పర్చూరు మండలంలో పర్చూరులోని వేణుగోపాలస్వామి ఆలయానికి రు1.75 కోట్లు, భీమేశ్వరాలయానికి రు1.50 కోట్లు,దేవరపల్లిలోని వేణుగోపాలస్వామి ఆలయానికి కోటి రూపాయలు,గర్నెపూడి లోని విఘ్నేశ్వర, విశ్వేశ్వర ఆలయాలకు కోటి రూపాయలు, యద్దనపూడి మండలంలోని అనంతవరంలోని వేణుగోపాలస్వామి దేవాలయానికి రూ. 1.05 కోట్లు, సూరవరపుపల్లిలోని చెన్నకేశవదేవాలయానికి రూ.1.05 కోట్లు, చినగంజాం మండలం సంతరావూరులోని శ్రీరామలింగేశ్వర ఆలయానికి రూ.1.05 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులకు 33 శాతం మ్యాచింగ్ గ్రాంట్స్‌తో ఆలయాలు పునర్నిర్మాణం చేపట్టనున్నారు. నిధుల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డిలకు పలువురు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఆర్‌ఎంటీల సమస్యలను పరిష్కరించాలి

ఏపీ సీఎంఆర్ టీచర్స్ యూనైటెడ్ ఫోరం

అద్దంకిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఆర్‌ఎంటీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ సీఎంఆర్ టీచర్స్ యూనైటెడ్ ఫోరం జిల్లా నాయకులు ఎం.రమేష్ అన్నారు. గురువారం సమస్యల పరిష్కారించాలని తహసీల్దార్ శ్రీచరణ్‌కు ఎంఈవో కేవీ.శ్రీనివాసరావుకు సీఎంఆర్‌టీలు వినతిపత్రాన్ని అందజేశారు. స్కూల్ కాంప్లెక్సలను ఏ, బీ, క్లస్టర్ ప్రతిపాదిత విధానాన్ని విరమించుకోవాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. డీఎస్సీలో వెయిటేజి ఇవ్వాలని, ట్రావెలింగ్ అలవెన్స్ పునరుద్ధించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. సమస్యల పరిష్కారంలో భాగంగా ఈ నెల 8న కలెక్టరేట్‌ల వద్ద, డిసెంబరు 22న తేదీన విజయవాడలో ఆత్మగౌరవ దీక్ష చేయాలని ఏపీ సీఎంఆర్ టీచర్స్ యూనైటెడ్ ఫోరం పిలుపు నిచ్చిందన్నారు. అందరూ ఈ నిరసన కార్యక్రమాలల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు టి.శంకరరావు, గురవయ్య, రామకృష్ణలు ఉన్నారు.

మార్టూరు : తమ సమస్యల పరిష్కారం కోసం గురువారం మండలంలోని క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు తహసీల్దారు టి ప్రశాంతికి, ఎంఈవో వస్రామ్‌నాయక్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఆర్‌ఎంటీల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు గద్దె రమేష్ మాట్లాడుతూ గత 9 ఏళ్లనుండి తమ వేతనాలను పెంచలేదన్నారు. ఉద్యోగ భద్రత లేదన్నారు. విద్యార్హతకు తగిన వేతనాలు చెల్లించడం లేదన్నారు.క్లస్టర్ ప్రాతిపదికన నియమించిన తమను ఇతర జిల్లాలకు కేటాయించడం సరికాదన్నారు.తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ఆత్మగౌరవదీక్షను విజయవంతం చేయాలని కోరారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఆర్‌ఎంటీలు

అద్దంకిటౌన్ : సీఆర్‌ఎంటీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని ఏపీసీఎంఆర్ టీచర్స్ యూనైటెడ్ ఫోరం జిల్లా నాయకులు ఎం.రమేష్ అన్నారు. గురువారం సమస్యల పరిష్కారించాలని తహసీల్దార్ శ్రీచరణ్‌కు, ఎంఈవో కేవీ.శ్రీనివాసరావుకు సీఆర్‌ఎంటీలు వినతి పత్రాన్ని అందజేశారు. స్కూల్ కాంప్లెక్స్‌లను ఏ, బి క్లస్టర్ ప్రతిపాదిత విధానాన్ని వి రమించుకోవాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. సమస్యల పరిష్కారంలో భాగంగా ఈ నెల 8వ తేదిన జిల్లా కలెక్టరేట్‌ల వద్ద, డిసెంబరు 22న తేదీన విజయవాడలో ఆత్మ గౌరవ దీక్ష చేయాలని ఏపీసీఎంఆర్ టీచర్స్ టీచర్స్ యూనైటేడ్ ఫోరం పిలుపు నిచ్చిందని అందరు ఈ నిరసన కార్యక్రమాలల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటిలు టి.శంకరరావు, గురవయ్య, రామకృష్ణలు ఉన్నారు.

ఘంటసాల గానం అజరామరం


ఘంటసాల విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న జానపద కళాపీఠం సభ్యులు

అద్దంకిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సంగీత సామ్రాజ్యానికి గాన గంధర్వ ఘంటసాల వెంకటేశ్వరరావు చేసిన సేవలు అజరామరం అని పలువురు వ్యక్తలు కొనియాడారు. గురువారం ఘంటసాల వెంకటేశ్వర రావు 103వ జయంతి సందర్బంగా జానపద కళాపీఠం అద్దంకి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఘంటసాల సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ యూ.దేవపాలన, కార్యదర్శి జ్యోతి చంద్రమౌళి, దాసభారతి అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు, రోటరీ మాజీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలకు రోటరీక్లబ్ నివాళి

అద్దంకిటౌన్ : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గురువారం ఘంటసాల జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఘంటసాల విగ్రహానికి రోటరీ క్లబ్ సభ్యులు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఘంటసాల వెంకటేశ్వరరావు వంటి మరొక సంగీత దర్శకుడుగాని, గాయకుడు గాని పుట్టడని, శతాబ్ధాల తరబడిన ఆయన పేరు చిరస్థాయిగా ఉంటుందని, కళామతల్లికి ముద్దు బిడ్డయని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు బాచిన శి వధర పూర్ణచంద్రరావు, కార్యదర్శి అ లహరి హరి ప్రసాద్, సంకా బాబు, శేషగిరి రావు, అంజాద్ బాషా, మహమ్మద్ రఫీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీలలో బంగారు పతకం

అద్దంకి,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి):మైసూరులోని దత్తపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీలలో అద్దంకికి చెందిన మువ్వల పద్మావతి బంగారుపతకం పొందింది. బంగారు పతకాన్ని మైసూరు దత్తపీఠంలో నిర్వహించిన కార్య క్రమంలో గణపతి సచ్చిదానందస్వామి నుంచి బంగారుపతకం అందుకున్నారు. ఈ సందర్భంగా పద్మావతిని పలువురు అభినందించారు.

గన్నవరంలో ఘనంగా హిందూసమ్మేళనం

యద్దనపూడి,(మార్టూరు) డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని గన్నవరం గ్రామంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి దేవాలయ ప్రాంగణంలో గురువారం హిందూ సమ్మేళనా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళన కార్యక్రమంలో గీత మహాత్యం, గీత సహస్రనామం, శ్రీమద్ భగవద్గీత, విష్ణు సహస్రనామాలను భక్తులు కీర్తించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా శ్రీకాంత్ ప్రభూజీ, ముంబాయి నుంచి విచ్చేశారు. ఆయన భక్తులతో విష్ణుసహస్రపారాయణ యజ్ఞం చేయించారు. అనంతరం మరో ముఖ్య అతుథులుగా ఆర్ఎస్ఎస్ ప్రముఖుడు కొత్త రామకృష్ణ, నరసరావుపేట నుంచి విచ్చేయగా, ఆర్ఎస్ఎస్ పర్చూరు ఖండ్ చాలక్ గడగొట్టు రాంబాబు, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు నర్రాదేవసహాయరావులు విచ్చేశారు. ఈ కార్యక్రమానికి ముందు శ్రీకృష్ణుని విగ్రహంతో మహిళలు గ్రామంలోని వీధులలో తిరుగుతూ కోలాటం ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పర్చూరు,యద్దనపూడి, గన్నవరం గ్రామాలకు చెందిన మహిళలు, పురుషులు పాల్గొన్నారు. వారందరికీ హైదరాబాదులో నివాసం ఉంటున్న గ్రామవాసి ఆరే జయరామిరెడ్డి అల్పాహారాన్ని, అన్నదానం ఏర్పాటుచేశారు. గ్రామానికి చెందిన చుండి మురళీకృష్ణ, గొట్టిపాటి సతీష్ కుమార్, చెన్నుపాటి బసవ రాములు, దూళ్లిపాళ్ల వెంకటేశ్వర్లు చెన్నుపాటి పాపారావు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.


విష్ణుసహస్రనామ పారాయణం చేస్తున్న శ్రీకాంత్‌ప్రభు, భక్తులు

ఘనంగా దత్తాత్రేయ జయంతి

● వేటపాలెం ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహేంద్రనాథ్


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వేటపాలెం(చీరాల), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక స్వర్ణ రోడ్డులోని శ్రీశైవ క్షేత్రములో భక్తులు ఘనంగా శ్రీ అనఘా సమేత శ్రీ శివదత్తాత్రేయ స్వామి జయంతిని నిర్వహించారు. అర్చక స్వాములు అప్పాజోసుల బదరీ నారాయణ శాస్త్రి, శ్రీధర్ శర్మ చేతుల మీదుగా స్వామికి పంచ ఫలా అమృతాభిషేకం వైభవంగా నిర్వహించారు. దత్తహోమం, పల్లకి సేవ అందరి కన్నుల పండువగా నిర్వహించారు. పూజల్లో పలువురు ధర్మకర్తలా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాధ్ పాల్గొన్నారు.

సీఆర్పీల సమస్యను పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న నేతలు

బల్లికురవ, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): అరకొర జీతాలతో అవస్థలు పడుతున్న సీఆర్పీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మండల సీఆర్పీల సంఘం కోరింది. గురువారం తహసీల్దార్ రవినాయక్‌కు వారు అత్మగౌరవ దీక్ష కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖలో తమను వీలనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. గతంలో ఉన్న మాదిరిగానే ప్రయాణ భత్యం ఇవ్వాలన్నారు. అలానే రీటెర్డ్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. సీఆర్పీలకు వెయిటేజ్ మార్కులు ఇవ్వాలన్నారు. తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు ఆశోక్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టిన పాల ఆటో

● ఆటో డ్రైవర్ మృతి



అద్దంకి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నామ్ రోడ్డులో ఆగి ఉన్న లారీని చీకటిలో గమనించకుండా వెనుక వైపు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలైన మురికిపూడి పున్నయ్య (59) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు అద్దంకి మండలం మణికేశ్వరంకు చెందిన పున్నయ్య పాల ఆటో కు డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు సమీపంలోని సూర్య మిల్క్ డెయిరీలో పాల క్యాన్ లు దించి తిరిగి వస్తుండగా అర్ధరా త్రి దాటిన తరువాత నామ్ రోడ్డు లో శాంతినగర్-చ క్రాయపాలెం మధ్య ఎలాంటి సంకేతాలు, లైట్లు లేకుండా నిలిపి ఉన్న లారీని వెనుక నుండి ఢీ కొట్టాడు. తీ వ్ర గాయాలైన పున్నయ్య ను 108 వాహనం లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పిఎస్సై వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. పున్నయ్య కు భార్య, ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు.

నేడు విద్యుత్ సేవలకు అంతరాయం

చీరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో నేడు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో సేవలకు అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విఠల్‌నగర్, స్వర్ణ గేటు, బాలసాయినగర్, వైకుంఠపురం, హరిప్రసాద్‌నగర్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుంది. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వాడరేవు, బుర్లవారిపాలెం, కీర్తివారిపాలెం, పెర్లవారి పాలెం, మున్సిపల్ పరిధిలో జయంతిపేట, మరియమ్మపేట, జాన్‌పేట, ఐక్యనగర్ ప్రాంతాల్లో సేవలకు అంతరాయం ఉంటుందని, అనంతరం యధావిధిగా సేవలు అందుతాయని అధికారులు చెప్పారు.

ఏపీఎన్‌జీవోస్ తాలూకా ఎన్నిక ఏకగ్రీవం

● అధ్యక్షుడిగా తాళ్లూరి సుధాకర్


పర్చూరు ఏపీఎన్‌జీవోస్ నూతన కార్యవర్గం

పర్చూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎన్‌జీవోస్ పర్చూరు తాలూకా ఎన్నికల గురువారం ఏకగ్రీవంగా ముగిసింది. పర్చూరు రోటరీ భవనంలో నామినేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల అధికారిగా జి.ఇసాక్, ఎన్నికల అధికారిగా పి.శేషగిరిరావు భాద్యతలు నిర్వహించారు. కార్యదర్శిగా చెరుకూరి ప్రేమ్‌చెంద్, కోశాధికారిగా వివి.నరసింహులు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.సుమన్, ఉపాధ్యక్షుగా జి.శివనాగరాజు, ఎంపీ.ప్రధామ్ కుమార్‌లు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ముఖ్య అతిధులుగా కె.శరత్‌బాబు, కృష్ణారెడ్డి, సీహెచ్.శేషుబాబు హాజరయ్యారు. బాపట్ల జిల్లా అడహక్ కమిటీ చైర్మన్‌గా పి.నాగేశ్వరరావు, కన్వీనర్‌గా బి.ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

కడచూపునకు వెళుతూ.. కానరాని లోకాలకు

● కారంచేడు వద్ద కారు టైరు పగిలి సోదరుడు మృతి
● మిగిలిన ఇద్దరు అన్నదమ్ములకు స్వల్ప గాయాలు
● ఓ ఛానల్‌లో వీడియో ఎడిటింగ్ విభాగంలో విధులు

చీరాల, పర్చూరు డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బంధువుని కడచూపుకు కారులో వెళుతూ అకస్మాత్తుగా చోటుచేసుకున్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ విషాద ఘటన గురువారం మధ్యాహ్నం కారంచేడులో చోటుచేసుకుంది. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం గోల్కొండ క్రాస్ రోడ్స్ రామనగర్‌కు చెందిన ముంగర మనోహరరాజ్(45) ఓ ప్రముఖ న్యూస్‌చానళ్లలోని వీడియో ఎడిటింగ్ విభాగంలో పనిచేస్తున్నాడు. చీరాల మండల పరిధిలోని వాడరేవు గ్రామానికి చెందిన వారి బంధువు అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. ఆయన కడచూపు కోసం మనోహరరాజ్ తన ఇద్దరి అన్నదమ్ములు జాన్ సెల్విస్టర్‌రాజ్, నిరీక్షణరాజ్‌లతో కారులో తెల్లవారుఝామున హైదరాబాదు నుంచి బయలుదేరాడు. మరో 20 నిముషాల్లో వాడరేవుకు చేరుకుంటామనుకునే క్రమంలో కారు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది. కారంచేడు సమీపంలో కారుకు ఎడమ వైపు వెనుక టైరు అకస్మాత్తుగా పగిలింది. దీంతో కారు మూడు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో మనోహరరాజ్ అక్కడికక్కడే మృతిచెందగా, మిగిలిన ఇద్దరు అన్నదమ్ములు స్వల్పంగా గాయపడ్డారు. వీరు ప్రస్తుతం చీరాల్లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. దీంతో సమాచారం అందుకున్న బంధువులు వైద్యశాల వద్దకు చేరుకుని బోరున విలపించారు. కారంచేడు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మనోహర్‌రాజుకు భార్య సునీతతో పాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న పాప, బాబు సంతానం ఉన్నారు.


మనోహర్‌రాజ్ (ఫైల్)

మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

బల్లికురవ, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 58 పాఠశాలల్లో శుక్రవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు మెగా పేరేంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఈవోలు శ్రీనివాసరావు, రమేష్‌బాబులు తెలిపారు. ప్రతి పాఠశాలకు ఒక ప్రత్యేకాధికారిని నియమించామని ఉపాధ్యాయులు సమావేశాల ఫోటోలను ఎంఈవో కార్యాలయానికి పంపించాలన్నారు.





రాపూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

సేవ్ రాపూరు, కలువాయి!

- తిరుపతి వద్దు.. నెల్లూరులోనే ఉంటాం
- రెండు ప్రాంతాల్లోనూ నిరసన ర్యాలీలు

రాపూరు/కలువాయి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : 'సేవ్ రాపూరు, కలువాయి... తిరుపతి వద్దు.. నెల్లూరే ముద్దు' అంటూ రాపూరు, కలువాయిలలో గురువారం నిరసన ర్యాలీలు జరిగాయి. రాపూరులో ఉదయం పట్టణవాసులంతా ఏకమై సిద్ధలేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిరసన ర్యాలీ ప్రారంభించారు. పడమటి వీధి, పాత బస్టాండ్ మీదుగా బాలాజీ కాంప్లెక్స్ వద్దకు చేరుకుని మానవహారం నిర్మించారు. సేవ్ రాపూరు - సేవ్ నెల్లూరు, తిరుపతి వద్దు నెల్లూరు ముద్దు నినాదాల హోరుతో రాపూరు దద్దరిల్లింది. అనంతరం తహసీల్దారు లక్ష్మీనరసింహంకు వినతిపత్రం అందజేశారు. కాగా, వ్యాపారులంతా దుకాణాలు మూసి స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, యువత, జేఏసీ నాయకులు భారీగా పాల్గొన్నారు.

- పోరాడుదాం.. సాధించుకుందాం!


కలువాయిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

'ఉద్యోగ, ఉపాధ్యాయ, వ్యాపార సంఘాలతో కలిసి అందరం ఐక్యంగా పోరాడుదాం. మన కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉండేలా సాధించుకుందాం.' అని టీడీపీ మండల కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా రఘురామిరెడ్డి అధ్యక్షతన నాయకులంతా సమావేశమయ్యారు. కలువాయిని గూడూరు రెవెన్యూ డివిజన్, తిరుపతి జిల్లాలోకి తీసుకెళుతూ మంత్రివర్గ ఉపసంఘం చేసిన నిర్ణయంపై చర్చించారు. అయితే, దీనిని నాయకులంతా ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ఇదే

- మిగతా 8వ పేజీలో..

పోలీసు స్టేషన్‌లపై ఫోకస్

- దృష్టి పెట్టిన ఎస్పీ అజిత
- ఐడీ పార్టీల జాబితా సేకరణ
- అధికారులు, సిబ్బందిలో వణుకు
- సీసీఎస్, ఎస్‌బిలో పాతుకుపోయిన ఖాకీలు

8లో..

బడిలో వేడుకకు రారండోయ్..!

- నేడు మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం)

ఆత్మకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ మీటింగ్ జరగనుంది. ఈ మేరకు ఆయా విద్యా సంస్థలు ముస్తాబయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటికే రెండుసార్లు పీటీఎం విజయవంతంగా నిర్వహిం చింది. గత ఏడాది తల్లిదండ్రులకు ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసారి అలాంటివి పక్కన పెట్టి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి ప్రభుత్వ పాఠశాలల పురోగతి, నెలకొన్న సమస్యలు, పిల్లల చదువు, వారి నడవడిక, ప్రగతిపై చర్చించనున్నారు. ఈ సమావేశాల నిర్వహణకుగాను రాష్ట్ర ప్రభుత్వం రూ.52.43 లక్షలు విడుదల చేసింది. ఈ సమావేశాలకు అందరూ హాజరయ్యేలా ప్రత్యేక దృష్టి సారించి ఉపాధ్యాయులు ఆహ్వానాలు పంపారు. స్థానిక ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాల్సి ఉంది. అందుకే ఉపాధ్యాయులు స్వయంగా ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులకు మెగా పీటీఎంకు తప్పక రారండోయ్.. అంటూ ఆహ్వాన పత్రాలు అందజేశారు. దూర ప్రాంతాల్లో ఉన్న తల్లిదండ్రులకు పోస్టు ద్వారా ఆహ్వాన పత్రాలు పంపారు.

హౌసింగ్ అధికారుల మెడకు ఉచ్చు

- గతంలో అక్రమాలు చేసినట్లు నిర్ధారణ
- రూ.కోట్లు పక్కదారి పట్టించారని అభియోగం
- 13 మందిపై చార్జ్‌స్ ఫ్రేమ్ చేసిన ప్రభుత్వం
- పది రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

8లో..

డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.లక్షలు దోచేశారు!

నెల్లూరు (క్రైం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సీబీఐ అధికారుల మంటూ ఓ వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ చేసి రూ.66.50 లక్షలు దోచేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు నెల్లూరులోని నవాబుపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేట నాగేంద్రనగర్‌లో ఉంటున్న శ్రీనివాసులుకు శివప్రసాద్ అనే వ్యక్తి అక్టోబరులో ఫోన్‌చేసి 'మీపై బెంగళూరులో ఉమెన్ ట్రాఫికింగ్ కేసు నమోదయ్యింది. అరెస్ట్ వారెంట్ కూడా జారీ అయ్యింది.' అంటూ భయపెట్టాడు. సీబీఐ అధికారులతో మాట్లాడుతున్నట్లు వీడియోకాల్ చూపించారు. మరుసటి రోజు మరో వ్యక్తి ఫోన్ చేసి తాను సీబీఐ అధికారినని చెబుతూ ముంబై కెనరా బ్యాంకులోని మీ ఖాతాలో రూ.30 లక్షలు జమైందని దీనిపై కేసు నమోదైందని చెప్పాడు. ఈ కేసు నుంచి తప్పించాలంటే రూ.66.50 లక్షలు తాము చెప్పిన బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేయాలని చెప్పారు. దీంతో శ్రీనివాసులు పలు దఫాలుగా నగదు వారు చెప్పిన ఖాతాలకు పంపాడు. చివరకు తాను మోసపోయానని గ్రహించి బాధితుడు గురువారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యాబోధనకు ఇన్‌స్ట్రక్టర్స్

- ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు...
- ఐదు నెలల కాలానికి నియామకాలు
- జిల్లాలో 70 పోస్టుల భర్తీ

సబ్జెక్ట్ టీచర్లు లేని పాఠశాలల్లో విద్యావలంటీర్లతో బోధన చేయించనున్నారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉండటంతో బోధన కుంటుపడుతోంది. ఈ నేపథ్యంలో తొలుత విద్యార్థుల సంఖ్య ఆధారంగా మిగులు టీచర్లను గుర్తించి ఆయా పాఠశాలలకు పంపాలని ఆలోచించారు. అయితే దీనివల్ల రాజకీయ ఒత్తిళ్లు అధికమవుతాయని ఈ నిర్ణయాన్ని మార్చుకుని సబ్జెక్ట్ టీచర్లు కొరత ఉన్న చోట అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ పేరుతో వలంటీర్లను నియమించాలని కమిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలో 70 పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు.

8లో..

మున్సిపల్ స్థలానికి ఎసరు!

- కావలిలో రూ.10 కోట్లు విలువైన జాగాపై పెద్దల కన్ను
- అధికారులను బురిడీ కొట్టించే యత్నం
- ఓ తహసీల్దారు సంతకంతో నకిలీ పట్టాల సృష్టి

8లో..




నెల్లూరు నగరంలో గురువారం మధ్యాహ్నం మబ్బులు కమ్మేసి భారీ వర్షం కురవడంతో నగర వాసుల అవస్థలు

జలవలయం

గురువారం మధ్యాహ్నం 12 గంటలు. చూస్తుండగానే క్షణాల్లో వాతావరణం మారిపోయింది. నల్లటి మేఘాలు కమ్ముకున్నాయి. నిమిషాల వ్యవధిలోనే పగలు రేయిగా మారిపోయింది. చిమ్మ చీకటి నెల్లూరును కమ్మేసింది. విద్యుత్ దీపాల వెలుగులో నగరం రాత్రిని తలపించింది. ఆ తర్వాత కొద్దిసేపటికే కమ్ముకున్న మబ్బులు క్షణాల్లో కరిగి నీరయ్యాయి. సుమారు రెండు గంటల సేపు కుండపోత వర్షం కురిసింది. చిమ్మచీకటిలో ఆకాశాన్ని చీల్చుకుని నేలతాకిన చినుకులు చూస్తుండగానే పట్టణాలు, పల్లెల్లో రహదారులను వాగులుగా మార్చేశాయి. ఏ రోడ్డుపై చూసినా మోకాలి లోతున నీరు పరవళ్లు తొక్కాయి. నగరం, పట్టణాల పరిధిలోని అండర్ బ్రిడ్జీలు వరద నీటితో మడుగులు కట్టాయి. రోడ్డుపై వెళ్లే వాహనాలనూ ముంచేశాయి. నెల్లూరు నగరంలో ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్ గేటు, రామలింగాపురం, మాగుంట లేవుట్ అండర్ బ్రిడ్జీల్లో నడుము లోతు నీరు చేరాయి. మాగుంట లే అవుట్ అండర్ బ్రిడ్జి వద్ద ఓ కారు పూర్తిగా నీట మునిగింది. అండర్ బ్రిడ్జీలు ఉన్న అన్ని ప్రాంతాల్లోనూ వాహన రాకపోకలు స్తంభించాయి.

- పగలు రేయి అయ్యింది.. లోతట్టు నీట మునిగింది!
- దిత్వా ప్రభావంతో వాతావరణంలో వింత మార్పులు
- నెల్లూరు నగరాన్ని కమ్మేసిన కరిమబ్బులు
- ఎడతెరిపి లేని వర్షం.. ఆపై పొగమంచు
- పోటెత్తిన వాగులు.. పొంగిన కలుజులు
- నీట మునిగిన కాలనీలు
- పొట్టేపాళెం కలుజులో పడి యువకుడి మృతి
- నెల్లూరు కాలువలో మరొకరి గల్లంతు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

- నెల్లూరు రూరల్ మండలం అంబాపురం వద్ద కాలువగట్టు తెగి ఉడుముల వాగు మీద పడింది. వాగు కట్ట తెగి 1500 ఇళ్లను నీట ముంచింది. మొగళ్లపాలెం చెరువుకు గండి పడింది. కనుపూరు కాలువ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. నగర శివారు ప్రాంతలన్నీ దాదాపుగా జలమయం అయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరింది. నగరంలో 17 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- అల్లూరు మండలంలో పైడేరు ఉధృతి కారణంగా రక్షణ గోడ తెగిపోయింది. పంట పొలాల్లోకి భారీగా వరద వచ్చి చేరుతోంది.
- ముత్తుకూరు మండలంలో గాదెల వాగు, బండ్లపాలెం గ్రామాల్లో ఇళ్లు నీట మునిగాయి. నక్కల కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది.
- మనుబోలును వరద వీడనంటోంది. పొలాలన్నీ నీటిలో ఉంటున్నాయి. సంగమేశ్వరాలయాన్ని నీరు చుట్టేసింది.
- సైదాపురం మండలం కైవల్యానది ఉధృతంగా ప్రవహించడంతో గూడూరు-రాజంపేట మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పిళ్ళేరు, ఊటుకూరు సమీపంలోని మాలేరు ఉధృతంగా ప్రవహించడంతో సైదాపురం- పొదలకూరు మధ్య రాకపోకలు స్తంభించాయి.
- ముత్తుకూరు మండలం బండ్లపాలెం జైభీమ్ కాలనీ నీట మునిగింది. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎక్కడికక్కడ వాగులు, వంకలు ఉధృతంగా పొంగి పొర్లుతున్నాయి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)


కోవూరు శాంతినగర్‌లో..


మనుబోలు : ట్రాక్టర్‌లో తీరప్రాంతానికి వెళుతున్న అధికారులు


మనుబోలు : ముంపువాసుల కోసం పడవ సిద్ధం


చేజర్లలో చెరువును తలపిస్తున్న నారుమడులు

సోమశిలకు పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద పెరుగుతోంది. బుధవారం 14 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా గురువారం ఉదయానికి 22,186 క్యూసెక్కులకు పెరిగింది. రాత్రికి 30,455 క్యూసెక్కులకు పెరిగింది. ప్రస్తుతం జలాశయంలో 72.907 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 2,650, కండలేరుకు 2వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

మునిగిన ఆశలు

నెల్లూరు(వ్యవసాయం) : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోడు పొంగిపొర్లుతున్న చెరువులు, కాలువలతో జిల్లావ్యాప్తంగా 3011 హెక్టార్లలో వివిధ పంటలు నీట మునిగాయి. ఈ మేరకు గురువారం సాయంత్రానికి వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. దాదాపుగా 1782 హెక్టార్లలో వరినారు, 2778 హెక్టార్లలో వరినాట్లు జలమయమయ్యాయి. ఆత్మకూరులో 68 హెక్టార్లలో మొక్కజొన్న, 28 హెక్టార్లలో శనగ పంటలు దెబ్బతిన్నాయి. పొదలకూరులో 65 హెక్టార్లలో శనగ, రాపూరులో 40 హెక్టార్లలో మినుము, చేజర్లలో 32 హెక్టార్లలో మినుము పంటలు నీట మునిగా యి. అత్యధికంగా మనుబోలు మండలంలో 713 హెక్టార్లలో వరి పైరు నీటమునకకు గురైంది. కావ లిలో 360 హెక్టార్లు, వెంకటాచలం లో 279 హెక్టార్లు, బుచ్చిరెడ్డిపాళెం లో 220 హెక్టార్లు, నెల్లూరు రూరల్ లో 200 హెక్టార్లు, కోవూరులో 126 హెక్టార్లు, అల్లూరులో 124 హెక్టా ర్లు, రాపూరులో 80 హెక్టార్లు, పొద లకూరులో 54 హెక్టార్లు, సంగంలో 30 హెక్టార్లు, సైదాపురంలో 5 హెక్టార్ల వరిపైరు నీట మునిగింది. అత్యధికంగా చేజర్ల మండలంలో 733 హెక్టార్లలో వరినారు నీటమునిగింది. వెంకటాచలంలో 315, మనుబోలులో 175, బుచ్చిలో 105, నెల్లూరు రూరల్ లో 100 హెక్టార్లతోపాటు విడవలూరు, సైదాపురం, బోగోలు, కొడవలూరు, కావలి, కోవూరు, పొదల కూరు, అల్లూరు, సంగం, రాపూరు. తదితర మండలాల్లో 1782 హె క్టార్లలో వరినారు జలమయమైంది. మొత్తంగా 16 మండలాల్లో 143 గ్రామాల్లోని 6,321 మంది రైతులకు చెందిన 3011 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి.


కలువాయి ప్రాంతంలో చెరువును తలపిస్తున్న వరి పొలాలు

- 85.6 హెక్టార్లలో ఉద్యాన పంటలు

దాదాపుగా 85.6 హెక్టార్లలో కూరగాయలు, ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖ అధికారుల ప్రాథమిక అంచనా. సైదాపురం, మనుబోలు, పొదలకూరు, ఏఎస్ పేట, చేజర్ల, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, ముత్తుకూరు, కలువాయి, మండలాల్లోని 20 గ్రామాల్లో మిరప, బొప్పాయి, పూలమొక్కలు, తమలపాకులు, వివిధ రకాల కూరగాయలు దెబ్బతిన్నాయి. మొత్తంగా 155 మంది రైతులకు దాదాపుగా రూ.30.6 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

మండలాలు : 16	గ్రామాలు 143	బాధిత రైతులు : 6,321 మంది	వరినారు : 1,782 హెక్టార్లు	వరినాట్లు : 2,778 హెక్టార్లు	ఉద్యాన పంటలు : 85.6 హెక్టార్లు


చేజర్ల : టీకే పాడు సమీపంలో నల్లవాగు ఉధృతి


ఆత్మకూరులో దెబ్బతిన్న వరినారును చూపుతున్న రైతులు


నెల్లూరు రూరల్ : పొట్టేపాళెంలో యువకుడి మృతదేహాన్ని తీసుకొస్తున్న స్థానికులు

కలవరపెడుతున్న కండలేరు

కండలేరు ప్రాజెక్టు వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే జలాశయం పూర్తిసామర్థ్యంతో నిండిపోగా ప్రాజెక్టులోకి వరద నీరు పోటెత్తి చేరుతోంది. డ్యాంలోకి 30 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో తొలిసారిగా స్పిల్‌వే గేట్లు ఎత్తేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అయితే ఈ గేట్లు ఎత్తడం అనివార్యమయితే సైదాపురం, పొదలకూరు, మనుబలు మండలాల పరిధిలో కనుపూరు చెరువు పరివాహక ప్రాంతాల పరిధిలోని గ్రామాలు నీట మునిగే ప్రమాదం ఉంది. అంతేగాక వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగే ప్రమాదం ఉందని ప్రజలు హడలిపోతున్నారు. విపత్కర పరిస్థితులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం కోసం కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రాజెక్టును సందర్శించి ఇంజనీరిం గ్ అధికారులకు తగు సూచనలు చేశారు. ఇప్పటికే కండలేరు వాగు పరివాహక ప్రాంతాల గ్రామస్థులను అప్రమత్తం చేశారు.

- స్పిల్ వేలో ఓ గేటు ఎత్తి..

పొదలకూరు : గురువారం రాత్రి కండలేరు డ్యాంలోని స్పిల్ వేలో ఓ గేటు ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. అంతకముందు డ్యాం వద్దకు చేరుకున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఆర్డీవో నాగ అనూషా, సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గేట్లను పరిశీలించారు. గేట్లు ఎత్తే సమయంలో జనరేటర్ మొరాయించడంతో జనరేటర్‌ను తెప్పించి, గేటు ఎత్తి నీటిని వదిలారు.


కండలేరు అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా


సైదాపురం : తురిమెర్ల వద్ద పిళ్ళేరువాగు ఉగ్రరూపం

ఒకరి మృతి..

- మరొకరి గల్లంతు

ఉధృతంగా ప్రవహించిన వరద నీటిలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరు గల్లంతయ్యారు. నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం కలుజు వద్ద 17 ఏళ్ల షేక్ మెహరాజ్ వరదలో పడి మృతి చెందాడు. మూర్ఛవ్యాధిగ్రస్తుడైన ఈ యువకుడు కలుజు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరదను చూసి మూర్ఛకు గురై నీటిలో పడి మరణించాడు. అలాగే, నెల్లూరు కాలువలో పడి 55 ఏళ్ల రవి గల్లంతు అయ్యాడు.

- మూడు పశువులు..

భారీవర్షాలకు జిల్లాలో మూడు పశువులు మృతిచెందినట్లు పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. కోవూరు మండలం మోడేగుంటలో ఒక ఆవు, ఇందుకూరుపేటలో ఇక దూడ, నర్రవాడలో ఒక గేదె మృతిచెందాయి. వీటి విలువ దాదాపుగా రూ.1.25 లక్షలుగా లెక్కగట్టారు.


నెల్లూరు : నీటమునిగిన వైఎస్సార్ నగర్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	139
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	274

కోడిగుడ్ల ధర (100): 670

అల్లూరులో మోస్తరు వర్షం

అల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంం మండలంలో గురువారం మోస్తరు వర్షం కురిసింది. అనుకున్న మేర వర్షపాతం లేకున్నా ఎగువ నుంచి వస్తున్న వరద నీరు పైడేరు ద్వారా అల్లూరు చెరువుకు చేరుకోవడంతో కలుజు పారుతున్నది. పైడేరు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో బీరంగుంట సమీపంలో కట్ట తెగి నీరు పొలాల్లోకి ప్రవహిస్తోంది. దీంతో రైతులు నాట్లు వేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.


కలుజు పారుతున్న అల్లూరు చెరువు

పాఠశాలకు కుర్చీల వితరణ


దాత అందజేసిన కుర్చీలను అందుకుంటున్న హెచ్‌ఎం గంగాధర్‌రావు

బిట్రగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు పాతబిట్రగుంటకు చెందిన ఎస్పీపీఎం కెనాల్-2 అధ్యక్షుడు యన్నాబత్తిన రమణయ్య ఐదు కుర్చీలను గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం గంగాధర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిని ఆశిస్తూ దాతలు ముందుకు రావడం అభినందనియమన్నారు. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిట్రగుంటను వీడని చలిగాలులు

బిట్రగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో తుఫాన్ ప్రభావం వీడలేదు. గురువారం చలిగాలులు వీస్తు చిరుజల్లులు కురిశాయి. తుఫాన్ తీరం దాటి నప్పటికీ చలితీవ్రత తగ్గలేదు. కురిసిన వర్షాలకు బోగోలు, కడనూతల, కోవూరుపల్లి, జక్కేపల్లి గూడూరు చెరువులు కలుజులు పారుతున్నాయి.

నేడు దగదర్తిలో మెగా పీటీఎం

దగదర్తి (బిట్రగుంట) డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలంలోని అన్నీ పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించనున్నట్లు ఎంఈవో ఎం. భాస్కర్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో జరిగే పేరెంట్స్ మీటింగ్‌కు ఉపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మను, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పాలనా సౌలభ్యం కోసమే డీడీవో కార్యాలయాలు


డీడీవో కార్యాలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, ఆర్డీవో తదితరులు

కావలి,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పరిపాలనా సౌలభ్యం కోసమే డీసీఎం పవన్ కల్యాణ్ డీడీవో కార్యాలయాలను ప్రారంభించి, పంచాయతీరాజ్ వ్యవస్థలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న భవనంలో ఏర్పాటు చేసిన డీడీవో కార్యాలయాన్ని ఆయన గురువారం ప్రారంబించారు. ఒకే భవన సముదాయంలో డీడీవో కార్యాలయం, డీఎల్‌పీవో, డ్వామా ఏపీడీ కార్యాలయాలను కూడా ఆయన ప్రారంభించారు. అంతకు ముందు డీసీఎం పవన్‌కల్యాన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డీడీవో కార్యాలయాల వల్ల ప్రజలు మండల పరిధిలో కాని పనులకు ఇక్కడ చేసుకోవచ్చన్నారు. కావలి డీడీవో కార్యాలయ భవనం కోసం 50 సెంట్ల స్థలం కేటాయించామని, రూ.2.5 కోట్ల నిధులు కూడా మంజూరు చేసామన్నారు. త్వరలో భవన నిర్మాణం చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ, డీడీవో విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శ్రీదేవి, పలువురు అధికారులు, టీడీపీ నాయకలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చొరవతో పాఠశాలల అభివృద్ధి


పాఠశాల కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న బీద గిరిధర్

అల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర చొరవతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు శ్రీకారం చుట్టామని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలలను స్థానిక నాయకులతో కలసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసించేందుకు దూరప్రాంతం నుంచి వచ్చే విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ల్యాబ్, ఆటస్థలం, మరుగుదొడ్ల నిర్మాణం విషయమై యాజమాన్యం ఆయన దృష్టికి తీసుకువచ్చింది. పరిశీలించి చర్యలు చేపడతామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండి శ్రీనివాసులు రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, మేడ కృష్ణారెడ్డి, మేడ శ్రీనివాసులు రెడ్డి, కావలి జగన్‌మోహన్, ఎంఈవో రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వంటేరు జన్మదిన వేడుకలు

జలదంకి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): కావలి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత వంటేరు వేణుగోపాల్‌రెడ్డి 76వ జన్మదిన వేడుకలను గురువారం స్వగ్రామం బ్రాహ్మణక్రాక, బీకే అగ్రహారంలోని వరదారెడ్డి గిరిజనకాలనీలో ఆయన అభిమానులు జరుపుకున్నారు. బ్రాహ్మనక్రాకలోని వంటేరు కార్యాలయంలో సర్పంచి ఇండ్ల సుధాకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అబిమానులకు పంచిపెట్టారు. వరదారెడ్డికాలనీలో వంటేరు అభిమాని బండి సంజీవయ్య ఆధ్వర్యంలో రామాలయం ప్రాంగణంలో బారీకేక్‌ను కట్ చేసి కాలనీ ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సర్పంచి సుదాకర్ మాట్లాడుతూ బ్రాహ్మణక్రాక పంచాయతీ అబివృద్ధి ప్రదాత వంటేరు అని కొనియాడారు. ఆయన సేవలు మరువలేనివని పేర్కొన్నారు.

ఎస్ఐఆర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ తదితరులు

కావలి,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) అర్బన్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలని ఆర్డీవో, కావలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. సన్నీ వంశీక్రిష్ణ తెలిపారు. ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం కావలి అర్బన్‌లోని ఏఈఆర్వో, సూపర్‌వైజర్లు, బీఎల్వోలతో ఆయన ఓటరు మ్యాపింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ప్రతి ఇంటిని సర్వే చేసి 2002లో ఓటర్‌లిస్టులో ఉన్న వారు 2025లో ఉన్న ఓటర్ లిస్టులో ఉన్నారా, ప్రస్తుతం 40ఏళ్లు పై బడిన వారు 2002 ఓటర్‌లిస్టులో ఉన్నారా, లేకపోతే ఇప్పుడు ఎలా వచ్చారు అనేదానిపై వివరాలు సేకరించాలన్నారు. ఇప్పుడు అదనంగా ఉన్న ఓటర్లు వారి కుటుంబంలో పిల్లలేనా వాటిపై జరుగుతున్న మ్యాపింగ్ సర్వేను వేగవంతం చేయాలని ఆర్డీవో కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ పాల్గొని మ్యాపింగ్‌పై పలు సూచనలు చేశారు.

రహదారి భద్రతపై సదస్సు



సదస్సులో పాల్గొన్న ఎంవీఐ సుందరరావు, ఏఎంవీఐ లక్ష్మీభాయి

కావలి (టౌన్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుకర్ పర్యవేక్షణలో ప్రొఫెసర్ ప్రతాప్ ఎసింగ్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ముఖ్య అతిథులుగా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందరరావు, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాయిలు పాల్గొన్నారు. విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి సదస్సు నిర్వాహకులను, అధికారులను అభినందించారు.

వేతనాలు పెంచాలని సీఆర్‌పీల వినతి


తహసీల్దారు కార్యాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేస్తున్న సీఆర్‌పీలు

జలదంకి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచాలని మండల విద్యావనరుల కేంద్రంలో పనిచేస్తున్న క్లస్టర్ రిజర్వు టీచర్స్(సీఆర్‌పీ)లు గురువారం తహసీల్దారు కార్యాలయంలోనూ, విద్యావనరుల కేంద్రంలోనూ వినతిపత్రాలు అందజేశారు. అనంతరం సీఆర్‌పీలు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల తమ జీతభత్యాలు పెంచలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 మాసాలు అయినా, మా జీతభత్యాల విషయంలో ఎలాంటి ముందడుగు వేయలేదని పేర్కొన్నారు. తమ వేతన పెంపు డిమాండ్ల సాధనలో భాగంగా తహసీల్దారు, ఎంఈవోలకు వినతిపత్రాలు అందజేశామన్నారు. ఈనెల 8న కలెక్టరేట్‌ల వద్ద, 22న విజయవాడలో ఆత్మగౌరవదీక్ష చేయనున్నామని సీఆర్‌పీల డీ. కొండయ్య, ఏ.మాధవ, డీ.శ్రీనివాసులు, పీ.రవిచంద్ర, పీ.శ్యామల పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు పెంచాలని వా రు డిమాండ్ చేశారు.

వృథాగా పోతున్న తాగు నీరు

లింగసముద్రం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాపురంలోని రక్షిత మంచినీటి ట్యాంకుకు చెందిన రెండు పైపులు పగిలిపోయాయి.దీంతో నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా పాత చెరువు కట్ట మట్టి రోడ్డు


వర్షాలకు అధ్వానంగా ఉన్న లింగసముద్రం పాత చెరువు కట్ట మట్టి రోడ్డు

లింగసముద్రం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను ప్రభావంతో గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు లింగసముద్రం పాత చెరువు కట్ట మట్టిరోడ్డు అధ్వానంగా మారింది. ఈ వర్షాలకు 3 కి.మీ పొడవున ఉన్న ఈ రోడ్డు బురదమయమై గుంతలతో నిండి దారుణంగా తయారైంది. దీంతో వాహనదారులు, పాదచారులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే నానా అవస్థలు పడుతున్నారు. అలాగే మండలంలోని వీఆర్, విశ్వనాధపురం, మాలకొండరాయునిపాలెం, ముక్తేశ్వరం, గంగపాలెం, తిమ్మారెడ్డిపాలెం గ్రామాల ప్రజలు లింగసముద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు, నిత్యావసరాల సరుకుల కోసం రావాలన్నా తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అంతేగాక వర్షాలకు చెరువు కట్ట పలుచోట్ల కోసుకుపోయి గుంతలు పడింది. వీటిని గమనించకపోతే వాహనదారులు ఈ గోతులలో పడి గాయాలపాలు కాక తప్పదు. ఈ విషయమై మండల మైనర్ ఇరిగేషన్ ఏఈ బి మనోహర్‌ను వివరణ కోరగా.. రెండు నెలల క్రితం చెరువు కట్ట అభివృద్ధికి, ఇతర పనుల కోసం రూ.3.05 కోట్లతో సెంట్రల్ వాటర్ కమిషన్‌కు ప్రతిపాదనలు పంపించామని, ఈ నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

వైభవంగా సత్యనారాయణ వ్రతం


కందుకూరు: సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

కందుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దబజారులో ఉన్న కోదండ రామాలయంలో గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. ఆలయ పూజారులు స్వామివారిని అలంకరించి వ్రతం నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసా దాలు అందించటంతో పాటు అన్నప్రసాదాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకటసుబ్బారావు, మురారిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● ఉలవపాడు : కరేడు గ్రామంలో ఉన్న శ్రీకృష్ణ దేవాలయంలో గురువారం వీర వెంకట సత్యనారాయణస్వామి సామూహిక వ్రతం నిర్వహించారు. ఆలయ పూజారి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పూజ అనంతరం వ్రతంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్న వితరణ నిర్వహించారు.

10వ తరగతి విద్యార్థులకు టెస్ట్ పేపర్ల పంపిణీ


విద్యార్థులకు టెస్ట్ పేపర్స్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం మాధవరావు, దాత ప్రభాకర్ తదితరులు

లింగసముద్రం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవని, లింగసముద్రంలోని జడ్పీ హైస్కూళ్లలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు టెస్ట్ పేపర్స్ పంపిణీ చేశారు. గురువారం లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి, ఇంగ్లీషు ఉపాధ్యాయుడు కల్లూరి ప్రభాకర్ హైస్కూల్‌లోని 90 మందికి అందజేశారు. అలాగే పెదపవని భోళారావు జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి రామిశెట్టి రంగారావు 75 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు, లింగసముద్రం, పెదపవని హైస్కూళ్ల హెచ్‌ఎంలు యు మాధవరావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పివిఆర్ మధుసూదనరావు, యూటీఎఫ్ నాయకులు ఎంఎం సుధాకర్‌రావు, టి సుధాకర్‌రావు, యు రవిబాబు, బి శారద, ఎస్ శాంతకుమారి, రంగవల్లి, శ్రీనివాసులు, ఇమామ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ అధికారిగా రాంబాబు

వలేటివారిపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండలం గ్రామ సచివాలయం అధికారిగా బి రాంబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రకాశం జిల్లా జె. పంగులూరు గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై వలేటివారిపాలెం మండలం గ్రామ సచివాలయం అధికారిగా బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీఓ శంకరరావు తెలిపారు.

పంచాయతీ నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలి

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


డీడీఓ కార్యాలయాన్ని ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధుల వినియోగంలో పారదర్శకత పాటించడంతో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు వెచ్చించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. పట్టణంలోని విప్పగుంట రోడ్డులో నూతనంగా నిర్మించిన డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ) కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రసంగాన్ని అధికారులతో కలిసి వీక్షించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు ఇతర సమస్యల పరిష్కారానికి డీడీఓ కార్యాలయం అనుసంధానంగా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీడీఓ రాంబాబు, డీఎల్‌పీఓ కృష్ణమోహన్, ఇంఛార్జి ఏపీడీ బాబూరావు, డివిజన్‌లోని వివిధ మండలాల ఎంపీడీఓలు రత్నకుమారి, కట్టా శ్రీనివాసరావు, శంకరరావు, సురేష్, శ్రీనివాసరావు, ఆదినారాయణ, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ రమేష్, పీఆర్ డీఈఈ చంద్రమౌళి, ఎంపీపీ ఇంటూరి సుశీల, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, గంగవరపు బ్రహ్మయ్య, మన్నం శ్రీనివాసరావు, కామినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సీఎం రిలీఫ్ ఫండ్‌కు భారీగా నిధులు కేటాయించటం ద్వారా పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 64మందికి మంజూరైన 45 లక్షల రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఎల్‌ఓసీలను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పూరిమెట్ల గురునాథం, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, చదలవాడ కొండయ్య, ఎన్వీ రమణయ్య, రావుల రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరికి సన్మానం

కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయం ఆదాయం పెంచటమే లక్ష్యంగా షాపుల నిర్మాణంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కృషి ఎనలేనిదని ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, మంచిరాజు మురళీమోహన్, ఈటీ కార్తీక్‌లు అభినందించారు. అంకమ్మ దేవాలయం ప్రాంగణంలో ఇప్పటికే పూర్తయిన 18 షాపు రూముల మొదటి నెల అద్దె రూ. 2.035 లక్షలు జమ అయిన సందర్భంగా గురువారం వారు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంకమ్మ ఆలయాన్ని పునర్నిర్మాణం చేసుకోవడంతో పాటు ప్రస్తుతం అనివేటి మండపం నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయన్నారు.

రేపు ఆలయ భూముల కౌలుకు బహిరంగ వేలం

కందుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాలెం కోదండరామాలయానికి సంబంధించి మండలంలోని కోవూరు గ్రామంలో ఉన్న 73 ఎకరాల మెట్ట భూములను మూడేళ్లపాటు కౌలుకు ఇచ్చేందుకు ఈనెల 6వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీ కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరు గ్రామ సర్వే నెంబరు 439లో 44.3 ఎకరాలను ఒక ప్లాట్‌గా అదే సర్వే నెంబరులోని 28.6 ఎకరాలను మరో ప్లాట్‌గా విభజించి కౌలుకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒంగోలులోని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో జరిగే ఈ కౌలు బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 50వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఈ వ్యవసాయ సీజన్ నుంచి మూడేళ్ల కాల పరిమితికి పాటలు నిర్వహించటం జరుగుతుందని, హెచ్చుపాటదారుడు వెంటనే పాట మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందనితెలిపారు.

రేపు వీవీపాలెం మండల సమావేశం

వలేటివారిపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యా లయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వై శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలస్థాయి అధికారులందరూ సమగ్ర సమాచారంతో హాజరుకావాలని కోరారు.

పొగ నాట్లలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


పొగాకు రైతులతో మాట్లాడుతున్న కందుకూరు వేలం నిర్వహణాధికారి చంద్రశేఖర్

లింగసముద్రం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పొగనాట్లలో రైతులు సస్య రక్షణ చర్యలు పాటించాలని కందుకూరు పొగాకు బోర్డు రెండవ వేలం నిర్వహణాధికారి చంద్రశేఖర్ సూచించారు. గురువారం రాత్రి మండలంలోని విశ్వనాధపురం గ్రామంలో పొగనారుమడులు, పొగనాట్లు సాగులో మెలకువలను రైతులకు వివరించారు. పొగాకు నారు, పంటపై మాగుడు, నారుకుళ్లు తెగుళ్లు ఆశించకుండా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సీనియర్ గ్రేడింగ్ అధికారి రాజగోపాల్ మాట్లాడుతూ పొగాకు రైతులు అంతర్జాతీయ పొగాకు మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, తక్కువ విస్తీర్ణంలో నాణ్యమైన పొగాకును పండించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిసి మేనేజరు గోలి వెంకటేశ్, జిపిఐ మేనేజరు ఉన్నం శ్రీనివాస్, ఎఫ్ఏలు నాగేంద్ర, రవీంద్ర, సిసింద్రీ, రైతులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో సత్తాచాటిన 'ప్రకాశం' విద్యార్థులు


అంతర్జాతీయ సదస్సులో పరిశోధనాపత్రంలో ప్రశంసలందుకున్న ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు మహిత, అమృత

కందుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజంపేట అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు డేటా విజ్ఞానం, యంత్ర అధ్యయన రంగాలలో తమ ప్రతిభను చాటారని కళాశాల కరస్పాండెంట్ కంచర్ల విజయ్ శ్రీనివాస్ గురువారం తెలిపారు. కళాశాల ఏఐ విభాగం తృతీయ సంవత్సర విద్యార్థినులు మహిత, అమృత, ద్వితీయ సంవత్సరం సీఎస్ విద్యార్థి ఎంఆర్‌కేఎస్ ప్రసాద్‌లు సంయుక్తంగా రూపొందించిన పరిశోధనాపత్రం అంతర్జాతీయ సదస్సులో ఆమోదం పొందటమే గాక ప్రపంచ స్థాయిలో పేరుపొందిన స్ప్రింగర్ ప్రచురణలలో ముద్రణకు ఎంపికవటం తమ కళాశాలకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల పరిశోధనకు మార్గనిర్దేశం చేసిన ఆర్‌అండ్‌డీ డీన్ డాక్టరు ముప్పా లక్ష్మణరావును, విద్యార్థినీ విద్యార్థులను ఈ సందర్భంగా కరస్పాండెంట్ విజయ్ శ్రీనివాస్ అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని శాస్త్రీయ ఆవిష్కరణలు వెలువడాలని ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్ ఆకాంక్షించారు.

ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి ఆధ్వర్యంలో

ఉచిత నేత్ర వైద్యశిబిరం


ఉచిత నేత్ర వైద్యశిబిరం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యసిబ్బంది, గ్రామస్థులు

కందుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు పంచాయతీ పంటవారిపాలెం వద్ద ఉన్న ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్యవిజ్ఞాన సంస్థ ఆసుపత్రి ఆధ్వర్యంలో కోవూరు గ్రామంలో గురువారం ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. డాక్టరు షేక్ సమీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో 63మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో 17మందికి శుక్లాలు ఆపరేషన్లు, ఐదుగురికి ఇతరత్రా నేత్రాలకు సంబంధించిన ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. అలాగే 29మందికి కంటి అద్దాలు అవసరమని నిర్ధారించినట్లు, వీరందరికీ అవసరమైన శస్త్రచికిత్సలు ఉచితంగా చేయటంతో పాటు కళ్లద్దాలు కూడా తక్కువ ధరలో అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్యశాలల రాష్ట్ర కో ఆర్డినేటరు ఎండ్లూరి వెంకటేశ్వర్లు, సిబ్బంది నంబూరి సుధీర్‌కుమార్, సయ్యద్ ముస్తాక్, గ్రామపెద్ద ఎన్వీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

కందుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ గాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ కళాశాలలో గురువారం కందుకూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి టీవీ నాగలక్ష్మి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై నియోజకవర్గ పరిధిలోని స్కూళ్లు, కాలేజీల బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలకు దారితీస్తున్న పరిస్థితులు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథలు, పాటల రూపంలో వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఆర్టీవో నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రతి బస్సుకు ఎమర్జెన్సీ డోరు వినియోగానికి అనువుగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేయటంతో పాటు ఫైర్ సిలిండర్, హేమర్‌లను ఉపయోగించే పద్ధతిపై డ్రైవర్లతో పాటు విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంవీఐ జె అనిల్‌కుమార్, శ్రీగాయత్రీ డైరెక్టర్ సీహెచ్ భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.



వీటిని ఇలా వదిలేస్తారా?

మండల కేంద్రం సంగంలోని ముంబయి జాతీయ రహదారి పక్కన కొండ ప్రాంతంలో బయో మెడికల్ వ్యర్థాలు గురువారం ప్రత్యక్షమయ్యాయి. వీటిలో కాలం చెల్లిన మందులతోపాటు సూదిమందులు, ఇతర బయో మెడికల్ వ్యర్థాలు ఉన్నాయి. సాధారణంగా ఆసుపత్రులు, క్లినిక్‌లు, ఫార్మసీలు బయో మెడికల్ వ్యర్థాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శుద్ధి కేంద్రాలకు తరలించి, నిర్వీర్యం చేయాలి. అయితే, గుర్తుతెలియని వ్యక్తులు వాటిని ఎక్కడ నుంచో తరలించి, హైవే పక్కన పడేశారు. ఉన్నతాధికారులు స్పందించి, సమగ్రంగా విచారణ చేసి ఇందుకు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)



కోన ఆదాయం కోటి దాటింది!

● 91 రోజులకు రూ.1,11,61,254 రాబడి

రాపూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో గురువారం ఉదయం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి, ఆంజనేయస్వామి ఆలయాల్లోని హుండీల కానుకలను లెక్కించారు. 91రోజులకు మొత్తం రూ.1,11,61,254 నగదు, మిక్స్ బంగారు ఆభరణాలు 240.095 మిల్లీగ్రాములు, వెండి ఆభరణాలు 2.870మిల్లీగ్రాములు, విదేశీ కరెన్సీ యూఎస్‌ఏ 20 డాలరు-1, యూఎస్‌ఏ 1 డాలర్స్ -5, యూఎస్‌ఈ 5దినార్స్ -1, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇరాక్ 250దినార్స్- 1, ఇంగ్లాండ్ 10పౌండ్స్ -4, కువైట్ 1దీనార్‌లు -5, 1/2దినార్స్ -2, 1/4దినార్స్ -6 వచ్చినట్లు ఆలయ ఉపకమిషనర్ పీ.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నెల్లూరు వేణుగోపాలస్వామి ఆలయ అధికారి జే శ్రీనివాసులు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించారు. వచ్చిన రాబడిని ఏపీజీబీ పెంచలకోన బ్రాంచ్‌లో జమ చేశామని ఉపకమిషనర్ తెలిపారు.



గరుడ వాహనంపై వేదగిరీశుడు

నెల్లూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మార్గశిర పౌర్ణమి పర్వదినం సందర్భంగా వేదగిరి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామికి గురువారం గరుడ సేవ, గిరిప్రదక్షిణ ఉత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఇందుపూరు అచ్యుతరెడ్డి, ఈవో గోపి, ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లపై ఫోకస్

పోలీసు స్టేషన్లలో ఏమి జరుగుతోంది?.. స్టేషన్ అధికారులకు దగ్గరగా ఉండే ఐడీ పార్టీలు ఏమి చేస్తున్నాయి?.. వారితో స్టేషన్ అధికారులు ఎలాంటి పనులు చేయిస్తున్నారు... ఐడీ పార్టీల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారా?... ఇలా జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్లలో జరిగే విషయాలపై ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆరా తీస్తున్నారు. దీంతో కొందరు సిబ్బంది, అధికారుల్లో వణుకు ప్రారంభమయ్యింది. మరోవైపు నేరాలను ఎందుకు నియంత్రించలేకపోతున్నారు?, క్రైమ్ పార్టీలు ఏమి చేస్తున్నాయి? అనే కోణంలోనూ ఎస్పీ వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

● దృష్టిపెట్టిన ఎస్పీ అజిత ● ఐడీ పార్టీల జాబితా సేకరణ

● అధికారులు, సిబ్బందిలో వణుకు

● సీసీఎస్, ఎస్‌బీలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఖాకీలు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్లలో అధికారులకు దగ్గరగా ఉండే ఐడీ పార్టీల వివరాలపై ఎస్పీ ఆరా తీశారు. ప్రతీ స్టేషన్ అధికారి ఐడీ పార్టీ వివరాలు పంపాలని ఆదేశించారు. ఆ జాబితా ప్రస్తుతం జిల్లా పోలీసు కార్యాలయానికి చేరింది. జాబితాలో ఉన్న సిబ్బంది పనితీరు, ఎప్పటి నుంచి ఆ స్టేషన్‌లో పనిచేస్తున్నారు.. తదితర వివరాలను స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది నుంచి సేకరిస్తున్నట్లు సమాచారం. ఆ తర్వాత ఎలాంటి చర్యలు ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది.

సీసీఎస్, ఎస్‌బీలో పాతుకుపోయిన సిబ్బంది

జిల్లాలోని అనేక పోలీసు స్టేషన్లలో కొందరు సిబ్బంది ఏళ్ల తరబడి పాతుకుపోయారు. ఐదేళ్లకు ఒకసారి బదిలీలు చేపట్టినా అధికార పార్టీ నాయకుల సిఫార్సులతో ఆ పోలీసు స్టేషన్‌లోనే ఉండిపోతున్నారు. అది సాధ్యం కాకపోతే అటాచ్‌మెంట్‌పై మళ్లీ అదే స్టేషన్‌కు వచ్చేస్తున్నారు. ఈ క్రమంలో నేరస్థులకు అండగా ఉంటున్నారన్న ఆరోపణలున్నాయి. సీఎసీఎస్, ఎస్‌బీలలో ఏళ్ల తరబడి సిబ్బంది పాతుకుపోయారని, వారిని ఏ అధికారీ కదిలించరన్న అభిప్రాయం పోలీసు వర్గాల్లో ఉంది. ఈ క్రమంలో ఎస్పీ ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.



నేరగాళ్లపై ఉక్కుపాదం

● ర్యాప్ గ్యాంగ్‌లపై కఠినంగా...

● మీడియాతో ఎస్పీ డాక్టర్ అజిత

నెల్లూరు(క్రైం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రౌడీయిజం చలాయిస్తూ, గ్యాంగులు నడుపుతూ నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతిభద్రతలతోపాటు వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ప్రత్యేక కార్యాచరణతో జిల్లాలోని ర్యాప్ గ్యాంగ్‌లపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. నకిలీ బంగారం, నకిలీ కరెన్సీ రకరకాల ట్రాప్‌లతో ప్రజలను మోసం చేస్తున్న ముఠాలపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఇలాంటి వరుస నేరాలకు పాల్పడుతున్న కావలి పట్టణానికి చెందిన దేవరకొండ సుధీర్ అలియాస్ అజయ్‌రెడ్డి అలియాస్ జయారెడ్డిని ఇటీవలే కావలి పోలీసులు అరెస్ట్ చేశారని చెప్పారు. అతని రాష్ట్ర వ్యాప్తంగా 38 కేసులున్నాయని, పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అల్లూరు మండలానికి చెందిన షేక్ హసన్ అలియాస్ అశోక్ అలియాస్ కార్తీక్‌రెడ్డిపై పలు జిల్లాల్లో 13 కేసులున్నాయని, గతంలో దేవరకొండ సుధీర్ గ్యాంగ్‌లో ఉంటూ మోసాలకు పాల్పడిన హసన్ విబేధాల కారణంగా మరో గ్యాంగ్‌ను తయారు చేసుకున్నాడని వివరించారు. తక్కువ రేటుకు బంగారు ఇస్తామని ప్రజలను హసన్ మోసం చేస్తూ నగదు దోచేస్తాడని తెలిపారు. టీపీ గూడూరుకు చెందిన మోనా సద్దాం అనే నేరస్థుడు హసన్ గ్యాంగ్‌లో ఉంటూ వారిమధ్య విబేధాలు రావడంతో మరో గ్యాంగ్‌ను ఏర్పాటు చేసుకొని ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి జిల్లాలో తక్కువ రేటుకు రొయ్యలు, చేపల సరుకు ఇప్పిస్తానని పిలిపించి నగదు దోచుకుని పరారవుతు న్నాడని తెలిపారు. సద్దాంపై మూడు కేసులున్నాయని, ప్రజలు ఇలాంటి గ్యాంగ్ లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు. గత నెలలో నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ప్రజానాట్యమండలి సభ్యుడు పెంచలయ్య హత్య కేసులో 17 మంది నిందితుల ను చేర్చామని, వారిలో ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. పాత నేరస్థులు, రౌడీషీటర్లపై నిఘా ముమ్మరం చేశామని, నేరాలకు సహకరించే వారిపై సైతం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పెంచలయ్య కుటుంబానికి న్యాయం చేస్తాం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గంజాయి వ్యతిరేక పోరాటంలో ఇటీవల హత్యకు గురైన పెంచలయ్య కుటుంబం గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ అజితను కలిసింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆ కుటుంబానికి చట్టపరమైన సహాయం, రక్షణ, న్యాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పెంచలయ్య ఆశయాలను, స్ఫూర్తి ని కొనసాగించడంలో జిల్లా పోలీసులు అన్నీ విధాలా సహకరిస్తారని తెలి పారు. పెంచలయ్య హత్య ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుగుతోం దని, ఇప్పటికే ప్రధాన నిందితులను అరెస్టు చేశామని చెప్పారు. మిగిలిన వారి పాత్రపై లోతుగా విచారణ సాగుతోందని తెలిపారు. అనంతరం పెంచలయ్య కుటుంబ సభ్యులతో కలిసి గంజాయి వ్యతిరేక అవగాహన పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ అధికారుల మెడకు ఉచ్చు

● గతంలో అక్రమాలు చేసినట్లు నిర్ధారణ

● 13 మందిపై చార్జస్ ఫ్రేమ్ చేసిన ప్రభుత్వం

● గృహ నిర్మాణ శాఖలో సంచలనం

నెల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తప్పు చేస్తే ఎప్పటికైనా శిక్ష అనుభవించక తప్పదన్న సత్యం మరోసారి రుజువైంది. పేదల ఇళ్ల మాటున జరిగిన భారీ దోపిడీకి కారణమైన హౌసింగ్ అధికారుల మెడకు ఉచ్చు బిగుస్తోంది. ఒక్క నెల్లూరు నగర పరిధిలోని వెంకటేశ్వరపురం, కొండ్లపూడి లేఅవుట్లలోనే రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైనట్లు విచారణలో బయటపడింది. ఇందుకు సంబంధించిన విచారణ ఈ ఏడాది సెప్టెంబరులో జరిగింది. హౌసింగ్ శాఖ క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు జిల్లాకు వచ్చి విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. నిర్మించిన ఇళ్లకు మించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించినట్లు నిర్ధారించారు. అలానే స్టీలు, సిమెంటు, ఇసుకను పక్కదారి పట్టించినట్లు కూడా గుర్తించారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గత ప్రభుత్వంలో నెల్లూరు నగరంలో పనిచేసిన హౌసింగ్ అధికారులపై అభియోగాలు నమోదు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఒకేసారి ఏకంగా 13 మంది హౌసింగ్ అధికారులపై చార్జస్ ఫ్రేమ్ కావడం ఆ శాఖలో సంచలనం మారింది. అభియోగాలు నమోదైన అధికారులంతా పది రోజుల్లో తమ వివరణ సమర్పించాలని ఆదేశించింది. కొండ్లపూడి లేఅవుట్‌లో ఎక్సెస్ పేమెంట్లు ఇవ్వడంతో పాటు స్టీలు, సిమెంటు, ఇసుక పక్కదారి పట్టించగా, వెంకటేశ్వరపురం లేఅవుట్లో ఒకరు నిర్మించిన ఇళ్ల బిల్లులను మరొకరికి చెల్లించి అవకతవకలకు పాల్పడ్డారు. చార్జస్ అందుకున్న వారిలో పీడీ నుంచి ఏఈ స్థాయి అధికారుల వరకూ ఉండడం గమనార్హం. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం..

● గతంలో హౌసింగ్ నెల్లూరు ఈఈగా పనిచేసిన పీ దయాకర్ ఇటీవల తిరుపతి పీడీగా పనిచేస్తూ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈయన హయాంలో వెంకటేశ్వరపురం లేఅవుట్లో రూ.78.29 లక్షలు, రూ.21.03 లక్షల విలువ చేసే స్టీలు దుర్వినియోగమైంది. అలానే కొండ్లపూడి లేఅవుట్లో రూ.84.35 లక్షల నిధులను అధికంగా చెల్లించారు. రూ.34.44 లక్షల విలువ చేసే ఇసుక, రూ.6.60 లక్షల విలువ చేసే సిమెంటు, రూ.17.33 లక్షల విలువ చేసే స్టీలు దుర్వినియోగమైంది. అలానే అప్పట్లో ఇన్‌చార్జ్ డీఈగా పనిచేసి ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న ఎం మధుసూదనరావు కూడా రూ.కోటి విలువ చేసే నిధులు, స్టీలు, ఇసుక, సిమెంటును పక్కదారి పట్టించారని అభియోగం. అదే విధంగా అప్పట్లో ఏఈగా పనిచేసిన ఎం కృష్ణారెడ్డి కూడా రూ.78.29 లక్షల ప్రజాధనం దుర్వినియోగం అవ్వడానికి బాధ్యులుగా పేర్కొన్నారు.

● గతంలో ఇన్‌చార్జ్ పీడీగా పనిచేసిన ఏ నాగరాజు సమయంలో కొండ్లపూడి లేఅవుట్లో రూ.49.30 లక్షల విలువైన నిధులు, సిమెంటు, ఇసుక, స్టీలు దుర్వినియోగమయ్యాయి. అప్పట్లో ఏఈగా పనిచేసి ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న జీ రామకృష్ణ రూ.26.30 లక్షల నిధుల దుర్వినియోగానికి బాధ్యుడిగా పేర్కొన్నారు. ఏఈగా పనిచేసిన పీ అహ్మద్ భాషా రూ.6.60 లక్షలు, ఈఈగా పనిచేసిన పీ నరసింహం రూ.12.05 లక్షల నిధుల దుర్వినియోగానికి బాధ్యులుగా అభియోగం నమోదు చేశారు.

● గతంలో ఈఈగా పనిచేసిన టీవీ శేషయ్య హయాంలో రూ.1.40 లక్షలు, ఏఈ టీ భాస్కర్ రావు ద్వారా రూ.2.20 లక్షలు, ఏఈ పల్లా వెంకటదాస్ ద్వారా రూ.2.20 లక్షలు, మరో ఏఈ పీ సురేష్ కుమార్ హయాంలో రూ.4.70 లక్షలు, డీఈ జహీరుద్దీన్ అహ్మద్, ఈఈ మోహన్‌రావు హయాంలో రూ.60 వేల చొప్పున ఎక్సెస్ పేమెంట్ జరిగినట్లు ఛార్జస్ ఫ్రేమ్ చేశారు.

ప్రభుత్వ సేవల సులభతరమే లక్ష్యం

● మంత్రి ఆనం రామనారాయణ ● జిల్లావ్యాప్తంగా డీడీవో కార్యాలయాల ప్రారంభం

ఆత్మకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టపరిచి గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభతరం చేయడమే లక్ష్యంగా డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో) కార్యాలయాలను ప్రభుత్వం ప్రారంభించిం దని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆత్మకూరులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డీడీవో కార్యాలయాన్ని గురువారం అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆనం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో వర్చువల్‌గా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా డీడీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేసేలా, ఒకే తరహా డిజైన్లతో భవనాలు రూపొందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరులో త్వరలోనే సొంత భవనం నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. వీర్లగుడిపాడుకు రాకపోకలు కల్పించేందుకు బీరాపేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో డివిజనల్ అభివృద్ధి అధికారి రమణయ్య, ఆర్డీవో పావని, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, జిల్లావ్యాప్తంగా నెల్లూరు, కందుకూరు, కావలి రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లోనూ డీడీవో కార్యాలయాలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు.



ఆత్మకూరులో డీడీవో కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

విద్యాబోధనకు ఇన్‌స్ట్రక్టర్స్

● ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు... ● ఐదు నెలల కాలానికి నియామకాలు

నెల్లూరు(విద్య), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే ఈ ప్రక్రియలో భాగంగా జిల్లాలో 70 పోస్టులను భర్తీ చేసేందుకు సన్నాహాలు ప్రారంభించారు. సబ్జెక్ట్ టీచర్లతోపాటు ఎస్‌జీటీలను సైతం నియమించాలని ఆదేశాలు జారీ చేస్తూ వారి వేతనాలను కూడా ఖరారు చేశారు. ఆయా మండలాల పరిధిలో ఈనెల 5వ తేదీ లోపల అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని నోటిఫికేషన్‌లు జారీ చేశారు. గతంలో విద్యావలంటీర్ల పేరుతో తాత్కాలిక ఉపాధ్యాయుల కొరత తీర్చగా ఈ ఏడాది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్‌గా పేరు మార్చుచేసి ఉపాధ్యాయుల కొరత తీర్చనున్నారు. మెగా డీఎస్సీలో ఇటీవల కొత్త ఉపాధ్యాయులు నియామకం చేపట్టినా వీటిలో ఇంకా పోస్టులు ఖాళీగా ఉండడంతో వీటిని పరిగణలోకి తీసుకుని కొత్తగా నియామకాలు చేపడుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో మిగిలిన ఐదునెలలు మాత్రమే వీరిని తాత్కాలిక ప్రాతిపదికన విధుల్లోకి తీసుకుంటున్నారు.

● జిల్లాలో 70 పోస్టులు..

జిల్లాలో స్కూల్ అసిస్టెంట్స్ తెలుగు 12, హిందీ 13, సంస్కృతం 2, ఉర్దూ 15, ఇంగ్లీష్ 7, మ్యాథ్స్ 5, ఫిజికల్ సైన్స్ 2, బయలాజికల్ సైన్స్ 3, సోషల్ 2 కలిపి 61 స్కూల్ అసిస్టెంట్, 9 ఎస్‌జీటీ పోస్టులు కలిపి మొత్తం 70 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిని ఖాళీలు ఉన్నచోట, ప్రాధాన్యతను పరిగణలోకి తీసుకుని ఈ విద్యాసంవత్సరంలో మిగిలిన ఐదునెలలపాటు విధుల్లో ఉండేలా నియమిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.బాలాజీరావు తెలిపారు. నియమితులైన వారిలో స్కూల్ అసిస్టెంట్‌కు నెలకు రూ.12,500, ఎస్‌జీటీలకు నెలకు రూ.10వేలు పారితోషకం అందిస్తామన్నారు. జిల్లాలోని మండలాల్లో ఎక్కడ అవసరమో గుర్తించి స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తారన్నారు. వారిలో పోటీ ఉంటే మెరిట్ ఆధారంగా నియామకాలుంటాయన్నారు. ఖాళీలపై స్థానిక ఎంఈఓలు ఇప్పటికే ప్రకటనలు విడుదల చేశారని, నియామకాలు కూడా ఆయా మండలాల్లోనే చేపడతామని తెలిపారు.

'పెట్రోల్' బంద్!

● బంకుల్లో నిలిచిన విక్రయాలు

● కంపెనీల నిర్లక్ష్యంతో ట్యాంకుల్లోకి నీరు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పెట్రోలు బంకుల్లో పెట్రోలు, డీజిల్ విక్రయాలు నిలిచిపోయాయి. గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వాహకులు బంద్ నిర్వహించడంతో వాహనదారులు పెట్రోలు, డీజిల్ కోసం అవస్థలు పడ్డారు.

● నీటి కారణంగానే..

జిల్లాలో ఆరు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాంతో రోడ్లపై ప్రవహిస్తున్న వర్షపునీరు, కాలువల్లోని మురుగు నీరు పెట్రోలు బంకుల ట్యాంకుల్లోకి చేరాయి. నీటితో కలిసిన ఇంధనం విక్రయిస్తే విమర్శలు తలెత్తుతాయని, దీన్ని వాడితే వాహనాలు మరమ్మతులకు గురవుతాయని బంకుల యజమానులు ముందు జాగ్రత్తగా ఇంధనం విక్రయాలను నిలిపివేశారు.

● నిర్లక్ష్యంతోనే ఇబ్బందులు

వర్షాకాలంలో పెట్రోలు కంపెనీల ఇంజినీర్లు బంకులను పరిశీలించి మరమ్మతులు చేయించాలి. ఈ దిశగా వారు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. అటు నిర్వాహకులు, ఇటు పెట్రో కంపెనీల ఇంజినీరు పట్టించుకోకపోవటంతో ట్యాంకుల్లో వర్షం నీరు చేరి ఇంధనంలో కలిసిపోతోంది. అయితే కొన్నిచోట్ల ఇదే ఇంధనాన్ని విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

● లక్షలాది లీటర్ల వినియోగం

జిల్లాలో 450కి పైబడి పెట్రోలు బంకులు ఉండగా, రోజుకు 3 లక్షల లీటర్ల పెట్రోలు, 4.5 లక్షల లీటర్ల డీజిల్ వినియోగం జరుగుతోంది. జిల్లాలోని పౌరసరఫరాల శాఖ అధికారులు ఈ బంకులపై నిరంతర పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా.. కనీసం కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెట్రో ట్యాంకులను శుభ్రం చేయించి నాణ్యమైన ఇంధనాన్ని విక్రయించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మున్సిపల్ స్థలానికి ఎసరు!

● రూ.కోట్లు విలువైన జాగాపై పెద్దల కన్ను

● అధికారులను బురిడీ కొట్టించే యత్నం

● నకిలీ పన్ను వేయమని అభ్యర్థన

● అనుమానంతో నిరాకరించిన యంత్రాంగం

కావలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ స్థలాలను కబ్జా చేసేందుకు కొందరు పెద్దలు పథకం రూపొందించారు. రూ.కోట్ల విలువైన మున్సిపల్ ఐడీఎస్‌ఎంటీ ప్లాట్లలోని ఓపెన్ ప్లేస్‌పై కొందరు బడాబాబులు కన్నేశారు. ఇందుకుగానూ 25 ఏళ్ల నాడు కావలి తహసీల్దార్‌గా పనిచేసిన ఓ అధికారి సంతకంతో మున్సిపల్ స్థలానికి నకిలీ పట్టాలు సృష్టించారు. అక్కడ సుమారు రూ.10 కోట్ల విలువైన 300 అంకణాల స్థలం ఉండగా, అందులో కొంతభాగంపై తొలుత దృష్టి పెట్టారు. స్థానికేతరులైన ముగ్గురు వ్యక్తులు ఒక్కొక్కరి పేరుతో 6 సెంట్లు (36 అంకణాల) వంతున నకిలీ పట్టాలను సృష్టించారు.



కబ్జా కోసం పెద్దలు కన్నేసిన ఐడీఎస్‌ఎంటీ ప్లాట్లలోని మున్సిపల్ ఓపెన్ ప్లేస్

● అధికారులను మోసం చేసే యత్నం

ఆ నకిలీ పట్టాలను మున్సిపల్ కార్యాలయానికి తీసుకువెళ్లి రెవెన్యూ విభాగంలోని ఓ ఆర్‌ఐని కలిశారు. వాటికి వేకెంట్ ట్యాక్స్(ఖాళీస్థలాల పన్ను) వేయమని కోరారు. డీ ఫారం పట్టాలు ఇచ్చి పన్నులు వేయమనటంతో ఆర్ఐ అందుకు సుముఖత వ్యక్తం చేశారు. అయితే ఖాళీ స్థలానికి పన్నులు వేయించుకునేవారు కొంత మొత్తాన్ని రెవెన్యూ విభాగంలో చెల్లించడం తరచూ జరుగుతోంది. ఈ నకిలీ పట్టాల వారు ఖాళీస్థలం పన్నులకు భారీ మొత్తాన్ని ఆఫర్ చేశారు. దీంతో ఆ అధికారికి అనుమానం వచ్చి ఆ స్థలం ఎక్కడదనే వివరాలు తెలుసుకున్నారు. అది మున్సిపల్ ఐడీఎస్‌ఎంటీ ప్లాట్లలోని ఓపెన్ ప్లేస్ అని తెలియడంతో ఆయన ఆందోళన చెందారు. ఈ స్థలానికి పన్ను వేస్తే తన ఉద్యోగం ఊడిపోతుందని భయపడి, అక్కడ నుంచి వారిని పంపించేశాడు. ఆ తర్వాత వారు కొంతమంది అధికారపార్టీ నాయకుల చేత ఒత్తిడి చేయించగా, అధికారులు భయపడి వాటికి పన్నులు వేస్తే ఉద్యోగాలు ఊడిపోతాయని చెప్పినట్లు తెలిసింది. అయితే గతంలో కూడా కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించి గ్రావెల్ కూడా తోలారు. అప్పట్లో ఈ విషయమై పత్రికల్లో కథనాలు రావటంతో దాని చుట్టూ మున్సిపాలిటీ అధికారులు కంచె ఏర్పాటు చేసి, బోర్డు పెట్టారు. కొంతకాలానికి ఆ బోర్డు, కంచె మాయం కావటంతో మళ్లీ కొంతమంది కన్ను ఆ స్థలంపై పడింది.

● వారి ఆక్రమణలే వీరికి ఆదర్శం

ఐడీఎస్‌ఎంటీ ప్లాట్లలో ఉన్న మున్సిపల్ ఖాళీ స్థలాన్ని ఆనుకుని తూర్పువైపున ఉన్న మున్సిపల్ ఖాళీస్థలాన్ని గతంలో బుడబుక్కలోళ్లు ఆక్రమించారు. పందులు మేపుకుంటూ, అక్కడే గుడిసెలు వేసుకుని, వాటికి నకిలీ పట్టాలు కూడా తెచ్చుకున్నారు. విద్యుత్ మీటర్లు తీసుకుని చివరకు సిమెంట్ రేకులతో నిర్మాణాలు చేపట్టారు. మున్సిపల్ అధికారులు వాటిని తొలగించాలనుకునేలోపు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. వారు పట్టాలు తెచ్చుకున్న స్థలం సర్వేనంబరు ఉదయగిరి రోడ్డుకు దక్షిణం వైపున ఉన్న వెంగళరావునగర్ పరిధిలోనిది. అయితే గుడిసెలు, రేకుల ఇళ్లు నిర్మించుకున్నది మాత్రం ఉదయగిరి రోడ్డుకు ఉత్తరం వైపున ఉన్న మున్సిపల్ స్థలం. అయినా అధికారులు ఎందుకో వారిని వదిలి వేశారు. దీంతో వారిని ఆదర్శంగా తీసుకుని పక్కనే ఉన్న స్థలానికి కొందరు ఎసరు పెట్టారు.

కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు

మున్సిపల్ స్థలాలను ఎవరైనా కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నకిలీ పట్టాలతో వేకెంట్ టాక్స్ వేయమని ఓ వ్యక్తి మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన విషయం తనకు తర్వాత తెలిసింది. అప్పుడే తన దృష్టికి తెస్తే అతనిపై క్రిమినల్ కేసు పెట్టే వాళ్లం. ఆ వ్యక్తి ఎవరో విచారించమని ఆదేశించాను.

- జీ. శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కావలి

బాల్య వివాహ రహిత జిల్లాయే లక్ష్యం

● ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : జిల్లాను బాల్య వివాహ రహితంగా చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ తెలిపారు. నెల్లూరు అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం బాల్య వివాహ రహిత భారత్ అవగాహనా కార్యక్రమం జరిగింది. పీడీ మాట్లాడుతూ బాల్య వివాహం చట్టవిరుద్ధ మన్నారు ఇది పిల్లల భవిష్యత్తును దెబ్బతీస్తుందని తెలిపారు. దీనిపై ప్రతీ గ్రామంలో, పాఠశాలలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మిషన్ వాత్సల్య కోఆర్డినేటర్ వీ అనురాధ, జిల్లా బాలల సంరక్షణ అధికారి బీ సురేష్, నెల్లూరు అర్బన్ సీడీపీవో అరుణ, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

జిల్లాలో 39వేల ఎకరాల్లో ఆక్వా సాగు

● వర్షాలకు ఎలాంటి నష్టం లేదు

● తీరప్రాంతాలకు బోటు ఏర్పాటు

● మత్స్యశాఖ జేడీ డాక్టర్ శాంతి

మనుబోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆక్వా, చేపల సాగు సుమారు 39వేల ఎకరాల్లో సాగవుతున్నదని జిల్లా మత్స్యశాఖ జేడీ డాక్టర్ కే. శాంతి పేర్కొన్నారు.గురువారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్ రమాదేవితో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వర్షప్రభావిత ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం పెద్ద మరబోటును ఏర్పాటు చేసేందుకు మత్స్యశాఖ ప్రయత్నిస్తున్నదన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎక్కడా ఆక్వాసాగుకు వరదల వల్ల నష్టం లేదన్నారు. చాలా గుంతలు అన్‌రిజిష్టర్‌లో ఉన్నాయన్నారు. ఇంకా 12వేల ఎకరాలు రిజిష్టర్ కావాల్సి ఉందన్నారు. రిజిష్టర్ చేసుకోకపోతే ఆక్వారైతులు రాయితీని కోల్పోతారన్నారు. వరద తగ్గేవరకు బోటు అందుబాటులో ఉంచి, ప్రజలకు సౌకర్యాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ చాన్‌బాషా, డీటీ ప్రదీప్, ఆర్ఐ తదిరతులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ శాంతి